అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

మంగళవారం 27-2-2024

సంపుటి : 10 | సంచిక : 07 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50



టార్గెట్ @ రూ.10 వేల కోట్లు

ఖజానా పూడ్చుకునేందుకు సర్కారు కసరత్తు



వట్టిపోయిన తెలంగాణ ఖజానాను నింపేందుకు కాంగ్రెస్ సర్కార్ కసరత్తు చేస్తోంది. ఎక్కడ అవకాశం ఉంటే అక్కడి నుంచి ఆదాయాన్ని సమకూర్చుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోంది. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షలో లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్)ను తెరపైకి తెస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. 2020లో ఈ పథకానికి ధరఖాస్తు చేసుకున్న 25.44 లక్షల మంది మార్చి 31 వరకు ఫీజు చెల్లించేందుకు కటాఫ్ డేట్ విధించింది. ఫలితంగా రూ.10 వేల కోట్ల ఆదాయం వస్తుందని సర్కార్ భావిస్తోంది.

- తెరపైకి మరోసారి పెండింగ్ దరఖాస్తులు
- మార్చి 31 వరకు కటాఫ్ గడువు
- ఎల్ఆర్ఎస్ కింద 25. 44 లక్షల అప్లికేషన్లు
- దేవాదాయ, వక్ఫ్, ప్రభుత్వ, కోర్టు కేసులున్న భూములకు వర్తించదని వెల్లడి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అనుమతి లేని లేఅవుట్ల క్రమబద్ధీకరణకు గత ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ పథకాన్ని తీసుకొచ్చింది. 2020లో ఇచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు చిన్న, మద్యతరగతి ప్రజల నుంచి మొదలుకుని రియల్టర్ల వరకు పోటీ పడ్డారు. ఆగస్టు 31 నుంచి అక్టోబర్ 31 వరకు రెండు నెలల పాటు ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను స్వీకరించారు. రాష్ట్రంలో అన్ని పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల నుంచి దాదాపు 25.44 లక్షల మంది అప్లికేషన్లు సమర్పించారు. కార్పొరేషన్లలో 4.13 లక్షలు, మున్సిపాలిటీల్లో 10.54 లక్షలు, పంచాయతీల్లో 10.76 లక్షల దరఖాస్తులు వచ్చాయి. అయితే ఈ అంశంపై పలువురు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో పథకానికి బ్రేకులు పడ్డాయి. ఎల్ఆర్ఎస్ కోసం లక్షల సంఖ్యలో ప్రజలు దరఖాస్తు చేసుకున్నారనీ, కోర్టు తుది ఉత్తర్వులొచ్చేవరకు ఎలాంటి నిర్ణయం తీసుకోమనీ, అయితే వాటిని పరిశీలించి అర్హతగల వారిని ఎంపికే చేసేందుకు అనుమతినివ్వాలని అప్పటి ప్రభుత్వంకోరింది. ఈ మేరకు కోర్టు నుంచి అనుమతి తీసున్నందున క్షేత్ర స్థాయిలో పరిశీలన చేశారు. మొదటి దశలో దరఖాస్తుల పరిశీలన, ...10లో

ఎల్ఆర్ఎస్ వేగవంతం చేయండి

- మున్సిపల్, రిజిస్ట్రేషన్ల శాఖలకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గత ప్రభుత్వం 2020లో తీసుకొచ్చిన ఎల్ఆర్ఎస్ (లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్) పథకాన్ని వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వివిధ కోర్టు కేసులతో ఈ ప్రక్రియ ఆలస్యమైందని రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు సోమవారం సచివాలయంలో జరిగిన సమీక్ష సందర్భంగా ముఖ్యమంత్రి దష్టికి తీసుకెళ్లారు. లక్షలాది కుటుంబాలకు మేలు చేసే ఈ పథకాన్ని వెంటనే ప్రారంభించాలని సీఎం వారికి సూచించారు. అప్పటి నిబంధనల ప్రకారమే ...11లో

క్విట్ డబ్ల్యూటీవో

400 జిల్లాల్లో ట్రాక్టర్ పరేడ్, డబ్ల్యూటీవో దిష్టిబొమ్మ దహనం

- ప్రపంచ వాణిజ్య సంస్థ నుంచి నిష్క్రమించాలి : ఎస్కేఎం డిమాండ్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

క్విట్ "డబ్ల్యూటీవో" డిమాండ్‌తో దేశవ్యాప్తంగా ఆందోళనలు జరిగాయి. దేశంలోని 400 జిల్లాల్లో రహదారులపై ట్రాక్టర్ పరేడ్, డబ్ల్యూటీవో దిష్టిబొమ్మ దహనాలను రైతులు నిర్వహించారు. డబ్ల్యూటీవో నుంచి ఇండియా నిష్క్రమించాలని డిమాండ్ చేస్తూ సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కేఎం) ఇచ్చిన పిలుపును రైతులు సోమవారం దేశవ్యాప్తంగా జయప్రదం చేశారు. ఈ సందర్భంగా ఎస్కేఎం నేతలు మాట్లాడుతూ పంజాబ్‌ను ఏకాకిని చేసి దేశంలోని మిగిలిన ప్రాంతాల్లో ఎన్నికల ప్రయోజనం పొందాలనే ప్రయత్నంలో పంజాబ్ రైతులపై తీవ్ర ...11లో

అన్నదాతను కాపాడాలి

ఎస్కేఎం నిరసనలో వక్తలు

- ఎస్వీకే నుంచి ఆర్టీసీ క్రాస్ రోడ్డు వరకు బైకు ర్యాలీ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో) నుంచి మన దేశం వెంటనే బయటకు రావాలని సంయుక్త కిసాన్‌మోర్చా (ఎస్కేఎం), కార్మిక, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ ...11లో

కేంద్రం తీరు వల్లే రాబడికి గండి..

- జీఎస్టీ పరిహారం రూ.4 వేల కోట్లు రావాలె... : సీఎం దృష్టికి తెచ్చిన ఉన్నతాధికారులు 10లో..

జ్ఞానవాపిలో హిందువులు ప్రార్థనలు చేసుకోవచ్చు

- అలహాబాద్ హైకోర్టు తీర్పు



ప్రయాగరాజ్ : జ్ఞానవాపి మసీదు ప్రాంగణంలోని సెల్లార్‌లో హిందువులు ప్రార్థనలు చేసుకోవచ్చునని అలహాబాద్ హైకోర్టు సోమవారం తీర్పు చెప్పింది. హిందూ ప్రార్థనలను అనుమతిస్తూ వారణాసి జిల్లా కోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాలను ...3లో

ఏడో 'సారీ' గైర్హాజరు

- ఈడీ సమన్లకు స్పందించని కేజ్రీవాల్



న్యూఢిల్లీ : మద్యం కుంభకోణానికి సంబంధించిన ఎక్సైజ్ పాలసీ కేసులో విచారణకు హాజరు కావాలంటూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) పంపిన సమన్లపై ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ స్పందించలేదు. ఆయన సోమవారం ఈడీ విచారణకు ...3లో

రైతును గోనె సంచిలో కుక్కి..

- కనికరం లేకుండా కొట్టిన హర్యానా పోలీసులు



చండీగఢ్ : ఫిబ్రవరి 24న ప్రీత్‌పాల్ సింగ్ (ఆ కుటుంబం ఏకైక కుమారుడు)ను చివరకు హర్యానాలోని రోహతక్ పీజీఐ నుండి పోస్ట్ గ్రాడ్యుయేట్ ...10లో

జూన్ 9న గ్రూప్-1 ప్రిలిమ్స్

టీఎస్‌పీఎస్సీ వెల్లడి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో గ్రూప్-1 పోస్టుల భర్తీకి జూన్ తొమ్మిదిన ప్రిలిమినరీ రాతపరీక్షలను నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) నిర్ణయించింది. ఈ మేరకు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 563 గ్రూప్-1 పోస్టుల భర్తీకి ఈనెల 19న గ్రూప్-1 నోటిఫికేషన్‌ను జారీ చేసిన విషయం తెలిసిందే. 503 గ్రూప్-1 పోస్టుల భర్తీకి 2022, ఏప్రిల్ 26న ఇచ్చిన నోటిఫికేషన్‌ను రద్దు చేసిన సంగతి విదితమే. ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతున్నదని ఆ ప్రకటనలో తెలిపారు. వాటి సమర్పణకు వచ్చేనెల 14వ తేదీ వరకు తుది గడువున్నది. పాత నోటిఫికేషన్‌లో దరఖాస్తు చేసిన అభ్యర్థులు మళ్లీ దరఖాస్తు చేయాల్సిందేననీ, అయితే ఫీజు మాత్రం మినహాయింపునిస్తున్నట్టు టీఎస్‌పీఎస్సీ గతంలోనే స్పష్టం చేసింది. యూనిఫామ్ సర్వీసులైన డీఎస్పీ, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ (ఏఈఎస్), ఆర్డీవో పోస్టులకు కనిష్ఠ, గరిష్ఠ వయోపరిమితి 21 నుంచి 35 ఏండ్లు ఉంటాయనీ, మిగిలిన పోస్టులకు 18 నుంచి 46 ఏండ్ల వరకు ఉంటాయని వివరించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులతోపాటు ప్రభుత్వ ఉద్యోగులకు ఐదేండ్లు, వికలాంగులకు పదేండ్లు, మాజీ సైనికులు, ఎన్‌సీసీ ఇన్‌స్ట్రక్టర్లకు మూడేండ్లపాటు సడలింపు ఉంటుందని స్పష్టం చేసింది. గ్రూప్-1 మెయిన్స్ రాతపరీక్షలను సెప్టెంబర్/అక్టోబర్‌లో నిర్వహించనున్నట్టు టీఎస్‌పీఎస్సీ ప్రకటించిన సంగతి తెలిసిందే.

భూగర్భ జలశాఖలో పోస్టుల ఫలితాలు విడుదల

భూగర్భ జల శాఖలో గెజిటెడ్, నాన్ గెజిటెడ్ పోస్టుల భర్తీకి సంబంధించిన ఫలితాలను టీఎస్‌పీఎస్సీ విడుదల చేసింది. ఈ మేరకు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గతేడాది జులై 18,19, 20, 31 తేదీల్లో రాతపరీక్షలను నిర్వహించామని తెలిపారు. జనరల్ ర్యాంకింగ్ జాబితా (జీఆర్ఎస్)ను విడుదల చేశామని పేర్కొన్నారు. ఆ వివరాలను టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో పొందుపరిచామని వివరించారు. ప్రస్తుతం ఉన్న కమిషన్ నిబంధనల ప్రకారం మెరిట్ ఆధారంగా జీఆర్ఎస్‌ను రూపొందించామని తెలిపారు. ధ్రువపత్రాలకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను త్వరలోనే ప్రకటిస్తామని పేర్కొన్నారు. తిరస్కరించిన, చెల్లని దరఖాస్తుదారుల అభ్యర్థులను జీఆర్ఎల్‌లో ప్రకటించలేదని వివరించారు.



హైదరాబాద్‌లో.. బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	62,840	▼	110
22 క్యారెట్లు	57,600	▼	100
కిలో వెండి	76,400	-	---



చికెన్ ధరలు
హైదరాబాద్
బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ. 140
రిటైల్ (లైవ్)	రూ. 162
స్కిన్‌తో	రూ. 235
స్కిన్‌లెస్	రూ. 267

‘కేజీ టు పీజీ’ పేరుతో కార్పొరేట్‌కు ప్రాధాన్యత
విద్య, వైద్య రంగాలను బలోపేతం చేస్తాం

2 లక్షల ఉద్యోగ నియామకాలకు కట్టుబడి ఉన్నాం

- ధరణి సమస్యల పరిష్కారానికి సదస్సులు : మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- కాళేశ్వరం పూర్తి వివరాలు ప్రజల ముందు ఉంచుతాం: ప్రొ.కోదండరామ్



నవతెలంగాణ-ఓయూ

గత ప్రభుత్వం కేజీ టు పీజీ ఉచిత విద్య అంటూ కార్పొరేట్ విద్యకు ప్రాధాన్యత ఇచ్చిందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గతంలో నిర్లక్ష్యానికి గురైన విద్య, వైద్య రంగాలకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రెండు లక్షల ఉద్యోగాల భర్తీకి కట్టుబడి ఉందని చెప్పారు. ఓయూ ఆర్ట్స్ కళాశాల సోషియాలజీ (సామాజికశాస్త్రం) విభాగం హెడ్ అండ్ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ.చింత గణేష్ ఉద్యోగ విరమణ సందర్భంగా "తెలంగాణ పునర్ నిర్మాణం-అభివృద్ధి దృక్పథాలు" అంశంపై మూడ్రోజులపాటు జరగనున్న జాతీయ సదస్సు సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ వస్తే బతుకులు మారుతాయని, విశ్వవిద్యాలయాల విద్యార్థులు, ప్రజలు ఎంతో పోరాడారని, దాని ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని చెప్పారు. కానీ రాష్ట్రం ఏర్పడిన అనంతరం వారి కలలను గులాబీ పెద్దలు కలలుగానే మిగిల్చారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కులగణన చేసి సామాన్య ప్రజలకు మంచి చేస్తామని చేసిన హామీ ప్రకారం అసెంబ్లీ సాక్షిగా కులగణన బిల్లును ఆమోదింపచేసుకున్నామని చెప్పారు. టీఎస్పీఎస్సీని కూడా ప్రక్షాళన చేశామన్నారు. ఇప్పటికే 19 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని, 2లక్షల ఉద్యోగ నియామకాలకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. విద్యార్థులు, నిరుద్యోగులు ఆశించిన విధంగా ఉద్యోగ, ఉపాధి, విద్య అందిస్తామన్నారు. ధరణి పోర్టల్‌తో రైతులు, రైతు కూలీలకు ఉన్న ఐదు గుంటలు, పది గుంటలు భూమి కూడా సమస్యలోకి నెట్టబడిందన్నారు. ప్రభుత్వ భూములను వారి సొంత భూములుగా మార్చుకోవడానికి కుట్రపూరితంగా ధరణిని ప్రవేశపెట్టారని విమర్శించారు. గత ప్రభుత్వ పెద్దలు ఎన్ని వేల ఎకరాల ప్రభుత్వ భూములను కబ్జా చేసారో, ఎన్ని లక్షల కోట్ల ప్రజల సొత్తును కొల్లగొట్టారో త్వరలో ప్రజలముందు పెట్టబోతున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ శాఖ, ధరణికి సంబంధించి గత ప్రభుత్వంలో వచ్చిన 2.45 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటి పరిష్కా రానికి మార్చి 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు ఎమ్మార్వో స్థాయిలో సదస్సులు నిర్వహిస్తామని వెల్లడించారు. లక్ష కోట్లు ఖర్చు చేసి నిర్మించిన ప్రపంచ అద్భుతం నేడు కుప్ప కూలిపోతుందని..గత ప్రభుత్వ అవినీతికి కాళేశ్వరం ఒక నిదర్శనమని అన్నారు. యూనివర్సిటీలలో ఖాళీలను భర్తీ చేస్తామని, ఉస్మానియా యూనివర్సిటీ సమస్యలను త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకొచ్చి అధికారులతో సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పారు. ప్రొ.కోదండరామ్ మాట్లాడుతూ.. 6 గ్యారంటీలతో పాటుగా 7వ గ్యారంటీ అయిన రాజ్యాంగ భద్రత కాంగ్రెస్ లక్ష్యంగా చెప్పారు. కాళేశ్వరం అవినీతిపై మంత్రు లతో చర్చించి పూర్తి వివరాలు ప్రజల ముందుంచుతామ న్నారు. విద్యారంగాన్ని గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని, ఇకపై నూతన మార్పులు చేర్పులు చేస్తామని చెప్పారు. ప్రిన్సిపాల్ ప్రొ.చింత గణేష్ సదస్సు ఉద్దేశాన్ని వివరించారు. ఓయూ వీసీ ప్రొ.రవీందర్, సోషల్ సైన్స్ డీన్ అర్జునరావు కుతాడి, ప్రొ.పి.విష్ణుదేవ్, డా.రాంషెఫర్డ్ భీనవేని, డా.టి .శ్రీధర్ డా. వినిత్ పాండే, ప్రొ.సత్యనారాయణ, ప్రొ.చెన్న బసవయ్య, డా.రామచంద్ర మూర్తి, డా.కవిత షిండే ప్రసంగించారు.



డేంజర్ జోన్‌లో ఉన్న ఇండ్లు, భూములకు.. పరిహారం, ప్యాకేజీ ఇవ్వాలి

- తాడిచెర్ల ఓసీపీలో భూ నిర్వాసితుల ఆందోళన

నవతెలంగాణ-మల్హర్‌రావు

జయశంకర్-భూపాలపల్లి జిల్లా మల్హర్‌రావు మండలం తాడిచెర్ల కాపురం బ్లాక్-1 ఓసీపీకి 500 మీటర్లు డేంజర్ జోన్‌లో ఉన్న సుమారు 2,800 ఇండ్లకు, భూములకు నష్టపరిహారం, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వడంతో పాటు సురక్షితమైన ప్రాంతంలో పునరావాసం ఏర్పాటు చేయాలని భూ నిర్వాసితులు డిమాండ్ చేశారు. సోమవారం ఓసీపీ మైన్‌లో తాడిచెర్ల భూ నిర్వాసితులు ఆందోళన చేపట్టారు. నిర్వాసితులను పోలీసులు అడ్డుకునేందుకు ప్రయత్నం చేయగా..వారిని అడ్డడించి నిర్వాసితులు మైన్ లోకి వెళ్లి బైటాయించారు. ఈ సందర్భంగా నిర్వాసితులు మాట్లాడుతూ .. ఓసీపీకి డేంజర్ జోన్‌లో ఉన్న ఇండ్లకు టీఎస్ జెన్కో ఇంటి నెంబర్లు కేటాయించి, 14-12-2022న పలు దినపత్రికల్లో ప్లినిమరి నోటిఫికేషన్ ఇచ్చినట్టు తెలిపారు. ఈ నోటిఫికేషన్ కాలపరిమితి 12 నెలలు మాత్రమేనని, దాంతో రెండు నెలల ముందుగానే కలెక్టర్ దృష్టికి తమ సమస్యను తీసుకెళ్లామని తెలిపారు. దీనికి జిల్లా కలెక్టర్.. జెన్కో అధికారులు ఇంకా డబ్బులు వేయలేదని చెప్పారన్నారు. తాడిచెర్ల ఓసీపీలో బ్లాస్టింగ్ బాంబుల దెబ్బలతో ఇండ్లు నేలమట్టమై, ఇంటి గోడలు భారీగా పగుళ్లు తెలుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బ్లాస్టింగ్ వల్ల రసాయన విషపు వాయువుతో ప్రజలకు ఊపిరితిత్తులు, క్యాన్సర్, గుండె తదితర వ్యాధుల బారిన పడి చని పోతున్నారని వాపోయారు. ఇప్పటికైనా నిర్వాసితుల సమస్యలకు పరిష్కార మార్గం చూపేలా చర్యలు తీసుకోవాలని జెన్కో ఉన్నతాధికారులకు, ప్రభుత్వా నికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో నిర్వాసితులు పాల్గొన్నారు.

విద్యుద్ఘాతంతో భార్యాభర్తలు మృతి



నవతెలంగాణ-కోడంగల్

విద్యుద్ఘాతంతో భార్యభర్తలు మృతి చెందిన ఘటన వికారాబాద్ జిల్లా బొంరాస్ పేట్ మండలం బురాన్‌పూర్‌లో సోమవారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బొంరాస్ పేట్ గ్రామానికి చెందిన బోయిని లక్ష్మణ్ (45), లక్ష్మి (40) దంపతులు.. కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం ఉదయం లక్ష్మణ్, లక్ష్మి ఉతికిన బట్టలను ఇంటి బయట రేకుల కింద ఉన్న తీగపై ఆరేస్తుండగా తీగకు విద్యుత్ సరఫరా కావడంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. భార్యభర్తలు ఇద్దరు మృతిచెందడంతో గ్రామంలో విషాధ చాయలు అలుముకున్నాయి. తమ కాలనీకి విద్యుత్ సరఫరా నియంత్రణలో సాంకేతిక లోపం కారణంగానే ఈ ఘటన జరిగినట్టు కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. మృతులకు కుమారుడు, కూతురు ఉన్నారు. కూతురికి ఇటీవలే వివాహం కాగా, కుమారుడు డిగ్రీ చదువుతున్నాడు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ రవూఫ్, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

మేడారంలో పడకేసిన పారిశుద్ధ్యం



నవతెలంగాణ - ములుగు/తాడ్వాయి

ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతరైన మేడారం సమ్మక్క సారలమ్మ జాతర అంగరంగ వైభవంగా ముగిసింది. ఈనెల 21 నుండి 24 వరకు మేడారం జాతర జరగగా ఆదివారం వరకు సందర్శకుల రద్దీ పెద్ద ఎత్తున కొనసాగింది. ఈ క్రమంలో వ్యర్థాలతో మేడారం జాతర సమీప ప్రాంతాలన్నీ అస్తవ్యస్తంగా మారాయి. రెడ్డిగూడెం, కన్నెపల్లి, కాల్వపల్లి, ఊరట్టం, ఏలుబాక, నార్లాపూర్ తదితర సమీప గ్రామాల్లో పెద్ద ఎత్తున సందర్శకులు విడిది చేశారు. ఈ క్రమంలో వ్యర్థాలతో జాతర గ్రామాలు నిండిపోయాయి. పారిశుధ్య నిర్వహణ కోసం 4,000మంది సిబ్బందిని ఏర్పాటు చేసినప్పటికీ జాతర సమయంలో పారిశుధ్య నిర్వహణ పూర్తిస్థాయిలో కొనసాగలేదు. వ్యర్థాల నుంచి వస్తున్న దుర్వాసన మేడారం సమీప గ్రామాల ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. దాంతో త్వరితగతిన వ్యర్థాలను తొలగించి స్వచ్ఛ మేడారాన్ని కొనసాగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మేడారం నుంచి 512 హుండీల తరలింపు..

- 29 నుంచి లెక్కింపు..

నవతెలంగాణ- తాడ్వాయి

ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం మహా జాతర హుండీలను సోమవారం పూజార్లు ఎండోమెంట్ శాఖాధికారులు రెవెన్యూ అధికారుల సమక్షంలో హుండీలను ఆర్టీసీ డీజీటీ బస్సుల ద్వారా హన్మకొండలోని టీటీడీ కళ్యాణ మండపానికి తరలించారు. 29 నుంచి దేవదాయ శాఖ అధికారులు హుండీలను లెక్కించనున్నారు. మేడారం మహా జాతరలో సమ్మక్క హుండీలు 215, సారలమ్మ హుండీలు 215, పగిడిద్దరాజు హుండీలు 26, గోవిందరాజు హుండీలు 26, క్లాత్ హుండీలు 30 మొత్తం 512 హుండీలను పటిష్టమైన భద్రత నడుమ తరలించారు. పది రోజులపాటు లెక్కింపు కొనసాగనుంది.

మతం పేరుతో కాదు.. ప్రజాస్వామ్యయుతంగా ఓట్లు అడగాలి

రైతులు పొద్దు తిరుగుడు సాగుపై దృష్టి పెట్టాలి

గౌరవెల్లి పూర్తి చేసి ప్రతి ఎకరానికీ నీరందిస్తాం :మున్సిపల్ బడ్జెట్ సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్



నవతెలంగాణ- హుస్నాబాద్ రూరల్

రామాలయం లాంటి మతపరమైన అంశాలతో బీజేపీ ఓట్లు అడగడం కాదని, ప్రజాస్వామ్యయుతంగా ఓట్లు అడగాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని మార్కెట్ యార్డులో పొద్దు తిరుగుడు గింజల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో తడి చెత్త, పొడి చెత్త బుట్టలను పంపిణీ చేశారు. 27 నుంచి రూ.500కే గ్యాస్ పథకం అమలవుతుండటంతో మహిళలతో కలిసి గ్యాస్ సిలిండర్‌కి పూలు వేసి శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంత్రి సందర్శించారు. డయాలసిస్ సెంటర్‌తో పాటు 200 పడకలకు అప్ గ్రేడ్ కావాల్సిన వసతులు, సౌకర్యాలపై వైద్యులను, అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాభావ పరిస్థితుల్లో పొద్దుతిరుగుడు పంటల సాగుపై రైతులు, అధికారులు దృష్టి పెట్టాలన్నారు. ఎకరానికి 8-10 క్వింటాల్ చొప్పున దిగుబడి వచ్చే ఈ పొద్దు తిరుగుడు విత్తనాల ధర క్వింటాల్‌కు రూ.6760 ఉందన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి చేసి ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామన్నారు. రాజకీయంగా విమర్శలు, ప్రతి విమర్శలు ప్రజాస్వామ్య పద్ధతిలో చేసుకోవాలని తెలిపారు. అధికారంలోకి వచ్చి వంద రోజులు కూడా పూర్తికాక ముందే ప్రేరేపితమైన మాటలతో ప్రభుత్వాన్ని కూలగొడతామని మాట్లాడుతూ ప్రజలను కన్ఫ్యూజ్ చేసే పద్ధతిలో ప్రతిపక్షాలు వ్యవహరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణకు బీజేపీ ఏం చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. సంకల్ప యాత్ర చేస్తున్న బండి సంజయ్.. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో ఏం అభివృద్ధి చేశారో చెప్పాలన్నారు.

ప్రజలకు సౌకర్యాలు కల్పించడం మా బాధ్యత

హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో జరిగిన బడ్జెట్ సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. ప్రజలకు సౌకర్యాలు కల్పించడం పాలక వర్గం బాధ్యత అని అన్నారు. అభివృద్ధికి సంబంధించి ఇప్పటికే మున్సిపల్ శాఖ అధికారులతో పాటు రాష్ట్ర స్థాయి అధికారులతోనూ ఒక ప్రత్యేకమైన వ్యవస్థ ఏర్పాటు చేసే విధంగా ఆలోచన చేస్తున్నామని తెలిపారు. పోతారం నుంచి వచ్చే వాగులో నీరు.. హుస్నాబాద్ టౌన్‌లో ఆగకుండా ఆర్‌అండ్‌బీ ప్రిన్సిపల్ సెక్రెటరీతో రివ్యూ చేశామన్నారు. ఇక్కడ ఇంటర్నల్ రోడ్స్‌కి ఆర్ అండ్ బీ నుంచి డబ్బులు విడుదల చేసినట్టు చెప్పారు. మున్సిపాలిటీ బిల్డింగ్ త్వరగా పూర్తి చేసుకోవాలన్నారు. సమావేశం లో పీసీసీ సభ్యులు లింగమూర్తి, సింగిల్ విండో చైర్మెన్ బోలిశెట్టి శివయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బంక చందు, చిత్తరి పద్మ రవీందర్, మాజీ సర్పంచ్‌లు మడప జైపాల్ రెడ్డి, బొంగోని శ్రీనివాస్, మున్సిపల్ చైర్మెన్ ఆకుల రజిత పాల్గొన్నారు.

ఎర్రజెండా మార్గంలోనే ప్రజా సమస్యల పరిష్కారం

బీజేపీని ఓడించడమే ఎర్రజెండా లక్ష్యం

- కామ్రేడ్ కృష్ణ కుమారి ఆశయాలను కొనసాగిస్తాం.. : సంస్మరణ సభలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మల్లు లక్ష్మి



నవతెలంగాణ-మణుగూరు

దేశంలో తొమ్మిదిన్నరేండ్లు బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబించిందని, దాన్ని ఓడించడమే కృష్ణ కుమారికి అర్పించే నిజమైన నివాళులని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. సోమవారం భద్రాద్రి జిల్లా మణుగూరు మండలం పగిడేరులో మాజీ సర్పంచ్, ఎంపీటీసీ కామ్రేడ్ కృష్ణకుమారి సంస్మరణ సభ మండల కార్యదర్శి కోడిశాల రాములు అధ్యక్షతన జరిగింది. ముందుగా గ్రామంలో స్థూపాన్ని ఆవిష్కరించారు. అనంతరం సభలో ఆమె మాట్లాడుతూ.. కమ్యూనిజంపై అచంచలమైన విశ్వాసం, మనో నిబ్బరం కలిగిన కృష్ణకుమారి ధన్యురాలని అన్నారు. కమ్యూనిజం భావజాలం పునికి పుచ్చుకొని అచంచలమైన విశ్వాసంతో ప్రజా సమస్యలపై అంకితమై పనిచేసిన మహిళ అని కొనియాడారు. ప్రశ్నించేతత్వాన్ని కమ్యూనిజం ద్వారా నేర్చుకొని, సర్పంచ్‌గా, రెండుసార్లు ఎంపీటీసీగా పాలక సమావేశాల్లో ప్రజా సమస్యలపై పోరాడిందని గుర్తుచేశారు. నేడు.. ప్రజా సమస్యలపై పాలకులను ప్రశ్నించే వారిపై కేసులు పెడుతున్నారని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజల హక్కులను హరిస్తూ, భావ ప్రకటనా స్వేచ్ఛపై దాడి చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కరువయిందని, ఉపాధి హామీ పనికి నిధులు కేటాయించలేదన్నారు. ఆహార భద్రతలో ప్రపంచంలో 111 స్థానంలో మన దేశం ఉందని తెలిపారు. అందుకే ఆహార భద్రత, ప్రజా సమస్యలపై పోరాటాలు చేయాల్సిన బాధ్యత కమ్యూనిస్టులపై ఉందని స్పష్టంచేశారు. అనంతరం మాజీ ఎంపీ మిడియం బాబురావు మాట్లాడుతూ.. పినపాక నియోజకవర్గంలో పగిడేరు.. కమ్యూనిస్టు భావజాలం అధికంగా ఉన్న గ్రామమని, ఉద్యమాలకు పేరుగాంచిన గడ్డ అని తెలిపారు. సీపీఐ(ఎం) తరఫున నిలబడి ఉద్యమాలు నిర్వహించి ప్రజాప్రతినిధిగా ప్రజల మనసులను తెలుసుకున్న వ్యక్తి కృష్ణకుమారి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులపై మోడీ ప్రభుత్వ దమన నీతి

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మోడీ ప్రభుత్వం రైతులపై దమననీతిని కొనసాగిస్తున్నదని సీపీఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ విమర్శించారు. అన్నదాతలపై నిరంకుశ ధోరణులను నిరసిస్తూ సోమవారం హైదరాబాద్‌లోని అంబేద్కర్ విగ్రహం దగ్గర ఆ పార్టీ ఆధ్వర్యంలో తమ నిరసనను తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నారాయణ మాట్లాడుతూ తమ పంటకు కనీస మద్దతు ధర ఇవ్వాలని కోరుతూ ఢిల్లీ సరిహద్దుల్లో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న రైతులను మోడీ సర్కార్ క్రూరంగా అణచివేస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు.

రైతుల బాధల పట్ల కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. పంజాబ్-హర్యానా సరిహద్దుల్లో నిరసన తెలుపు తున్న వారిపై జరిగిన పోలీస్ కాల్పుల్లో శుభకరన్ సింగ్ అనే రైతు మృతి చెందారనీ, ఈ ఘటనకు సంబంధించి కేంద్ర ప్రభుత్వంపై హత్య కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్న ప్రధాని మోడీ తప్పుడు వాగ్దానాలు చేశారని దుయ్యబట్టారు. వారిని విశ్వాసంలోకి తీసుకోకుండా రైతు వ్యతిరేక చట్టాలను ప్రయోగించి బడా వ్యాపారులకు వ్యవసా యాన్ని అప్పగించేందుకు కేంద్రం ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. పంటలకు కనీస మద్దతు ధరపై కేంద్రం చట్ట పరమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించ కుంటే దేశ వ్యాప్తంగా ఉద్యమాలు తీవ్రతరం చేస్తా మని నారాయణ హెచ్చరించారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ మోడీ సర్కార్.. రైతులను తీవ్రంగా నష్టపరిచే వివాదాస్పద వ్యవసాయ చట్టాలు తీసుకొచ్చిందన్నారు. ఇది దుర్మార్గమైన చర్య అని చెప్పారు. రైతులు మును పెన్నడూ లేని విధంగా కష్టాల్లో కూరుకుపో తున్న నేపథ్యంలో తమ సమస్యల పరిష్కరానికి ఆందోళనలు నిర్వహిస్తున్నారని తెలిపారు. వారి బాధల పట్ల మోడీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సిగ్గు చేటన్నారు.కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పశ్యపద్మ, బాలమల్లేశ్, కె శంకర్, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి బి. వెంకటేశం, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి, తెలంగాణ రాష్ట్ర గిరిజన సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఆర్. అంజయ్య నాయక్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.డా. కె. నారాయణ తోపాటు సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పశ్యపద్మ, కలవేణి శంకర్, ఎన్. బలమల్లేష్, ఈ.టి. నరసింహ, సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్. ఛాయాదేవి, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాల్మాకుల జంగయ్య పాల్గొన్నారు.



వికారాబాద్‌లో...

పాతపద్ధతిలోనే ప్రమోషన్స్ ఇవ్వాలి

- ప్రభుత్వ నిర్ణయంతో అంగన్‌వాడీ హెల్పర్లకు తీవ్ర నష్టం
- బకాయి వేతనం వెంటనే ఇవ్వండి : తెలంగాణ అంగన్ వాడీ వర్కర్స్(టీచర్స్) అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షులు కె.సునీత
- కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు

నవతెలంగాణ- విలేకరులు

అంగన్‌వాడీ హెల్పర్లకు పాత పద్ధతిలోనే ప్రమోషన్స్ సౌకర్యం కల్పించాలి.. ప్రభుత్వ నిర్ణయంతో ఎక్కువ మంది హెల్పర్లకు నష్టం వాటిల్లుతుంది.. అంగన్‌వాడీల బకాయి వేతనం వెంటనే విడుదల చేయాలి.. అని తెలంగాణ అంగన్‌వాడీ వర్కర్స్ (టీచర్స్) అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ)



రాష్ట్ర అధ్యక్షులు కె.సునీత అన్నారు. సోమవారం తెలంగాణ అంగన్‌వాడీ వర్కర్స్ (టీచర్స్) అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు చేశారు. అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ధర్నాలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.సునీత పాల్గొని అంగన్‌వాడీలనుద్దేశించి ప్రసంగించారు. ఐసీడీఎస్‌లో 9 వేల అంగన్‌వాడీ ఉద్యోగుల పోస్టులు ఖాళీ ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చి వెంటనే భర్తీ చేస్తామని ప్రకటించడం సంతోషమన్నారు. అయితే, హెల్పర్ల ప్రమోషన్‌కు ఎస్ఎస్సీ అర్హత ఉండగా.. దానిని ఇప్పుడు ఇంటర్‌కు మార్చారని అన్నారు. దీనివల్ల అనేక సంవత్సరాల తర్వాత వస్తున్న ఖాళీ పోస్టుల భర్తీకి, ప్రమోషన్ సౌకర్యానికి ఎక్కువమంది అంగన్‌వాడీ హెల్పర్లు దూరమయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయానికి రాష్ట్రంలోని అంగన్‌వాడీ హెల్పర్లు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఈ నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రమోషన్స్ అర్హత వయస్సు 50ఏండ్లకు పెంచాలని కోరారు. నిర్మల్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. మంచిర్యాల, నిజామాబాద్ కలెక్టరేట్ల ఎదుట అంగన్ వాడీలు ధర్నా నిర్వహించారు.

ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా కలెక్టరేట్‌ల ఎదుట ధర్నాలు చేశారు. మెదక్ అనంతరం పలు డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని సంబంధిత శాఖ అధికారులకు అందజేశారు. నల్లగొండ జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేసి జిల్లా కలెక్టర్, జిల్లా శిశు సంక్షేమ అధికారికి వినతిపత్రం అందజేశారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో కలెక్టర్ వెంకట్రావుకు వినతిపత్రం అందజేశారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల కలెక్టరేట్ల ఎదుట మహాధర్నా నిర్వహించారు. అనంతరం ఆయా జిల్లా కలెక్టర్లకు మెమోరండం అందజేశారు.

అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు పెండింగ్‌లో ఉన్న మూడు నెలల జీతాలు, ఆరు నెలల అంగన్‌వాడీ సెంటర్ల కిరాయిని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియకు వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం సంబంధిత అధికారులకు వినతిపత్రం అందజేశారు.

అటవీ కళాశాల ఆధ్వర్యంలో ‘వైల్డ్ ఫ్లేవర్స్’ తేనె

- ఆవిష్కరించిన మంత్రి కొండా సురేఖ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ములుగు ఫారెస్ట్ కాలేజి ఆధ్వర్యంలో ఉత్పత్తి చేసిన ఆర్గానిక్ తేనె ‘వైల్డ్ ఫ్లేవర్స్’ను సోమవారం హైదరాబాద్‌లోని అరణ్యభవన్‌లో అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ ఆవిష్కరించారు. అటవీ కళాశాల, పరిశోధనా సంస్థ(ఎఫ్‌సీఆర్ఐ) ఆధ్వర్యంలో శాస్త్రీయంగా పెంచుతున్న తేనెటీగల కేంద్రం నుంచి తయారు చేసిన ఆర్గానిక్ (సేంద్రియ) తేనె ఉత్పత్తులను ఆదరించాలని ప్రజలకు మంత్రి పిలుపునిచ్చారు. కళాశాల డీన్ ప్రియాంక వర్గీస్ మాట్లాడుతూ...రైతులకు తేనెటీగల పెంపకం, ఆదాయ అభివృద్ధిపై ములుగు ఫారెస్ట్ కళాశాలలో రైతులకు, మహిళలకు, ఔత్సాహికులకు వారం పాటు శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. సేంద్రీయ పద్ధతుల్లో అభివృద్ధి చేసిన తేనెను “వైల్డ్ ఫ్లేవర్స్” బ్రాండ్ పేరుతో అందుబాటులోకి తేబోతున్నామనీ, ములుగు అటవీ కళాశాలలో త్వరలోనే తేనె విక్రయ కేంద్రాన్ని ప్రారంభించబోతున్నామని తెలిపారు. కార్యక్రమంలో అటవీశాఖ ముఖ్య కార్యదర్శి వాణీప్రసాద్, పీసీసీఎఫ్ ఆర్ఎం.డోబ్రియల్ పాల్గొన్నారు.

ప్యాసింజర్ రైలా... అదెక్కడ?!



'ఎక్స్‌ప్రెస్ స్పెషల్'గా నామకరణం
పేరులోనే ప్రత్యేకం... సౌకర్యాల్లో సాధారణమే

అదే వేగం...అవే స్టాపులు
ఛార్జీలు మాత్రం డబుల్

కోవిడ్ తర్వాత మారిన సీను



న్యూఢిల్లీ : 'నాన్నా. ప్యాసింజర్ రైలు అంటే ఏమిటి?' అడిగాడో ఆరు సంవత్సరాల పిల్లవాడు తన తండ్రిని. బులెట్ రైలు, హైస్పీడ్ రైలు, ఏసీ బోగీల రైలు గురించి మాత్రమే అతనికి తెలుసు. మరి ఈ ప్యాసింజర్ రైలు ఎలా ఉంటుందో అతనికి ఎలా తెలుస్తుంది? అందుకే సందేహ నివృత్తి కోసం తండ్రిని ప్రశ్నించాడు. కొడుకు ప్రశ్నకు ఆ తండ్రి 'అదా...మా కాలంలో ఆ రైళ్లు తిరుగుతుండేవి. పేదవారు, దిగువ మధ్య తరగతి ప్రజలు తక్కువ ఛార్జీతో వాటిలో ప్రయా ణించే వారు. నరేంద్ర మోడీ అనే ఆయన ప్రధానమంత్రి అయిన తర్వాత వాటిని తీసేసారు' అని జవాబిచ్చాడు. ఇది వినడానికి అతిశయోక్తిగా అనిపించినా ఇప్పుడు జరుగుతున్నది అక్షరాలా అదే.

రాబోయే కాలంలో ప్యాసింజర్ రైళ్ల శకం పూర్తిగా ముగిసినట్లే. ప్రస్తుతం అక్కడక్కడా మనకు కన్పిస్తున్న ప్యాసింజర్ రైళ్లకు 'ఎక్స్‌ప్రెస్ స్పెషల్స్'గా నామకరణం చేసి పట్టాలపై తిప్పుతున్నారు. ప్యాసింజర్ రైలు ప్రయాణికులకు సుపరిచితమైన పదం 'రెండో తరగతి సాధారణ ఛార్జీ'. అయితే ఇకపై ఆ పదమూ వినిపించదు. ప్యాసింజర్ రైలును ఎక్స్‌ప్రెస్ స్పెషల్‌గా మార్చేసినట్లుగానే అందులో ప్రయాణించే వారి నుండి కూడా ఎక్స్‌ప్రెస్ ఛార్జీలను ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. ఇవి ప్యాసింజర్ రైలు ఛార్జీల కంటే దాదాపు రెట్టింపు ఉంటున్నాయి. రైలు అదే...ఛార్జీ మాత్రం డబుల్ !

పేదలకు ప్రయోజనకరంగా ఉన్నా...

ప్యాసింజర్ రైళ్లు దాదాపు అన్ని స్టేషన్లలో ఆగుతూ పేద ప్రయాణికులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ముఖ్యంగా వీధి వ్యాపారులు, వ్యవసాయ కార్మికులు,రోజువారీ వేతనాలపై ఆధారపడి జీవించే వారు అతి తక్కువ ఛార్జీలతో నిత్యం వీటిలో ప్రయాణిస్తూ ఎంతో ప్రయోజనం పొందుతున్నారు. రైల్వే వ్యవస్థలో అతి తక్కువ ఛార్జీలు ఉండేది ప్యాసింజర్ బళ్లలోనే. ఇప్పుడు వాటిని ఎక్స్‌ప్రెస్ స్పెషల్స్‌గా మార్చేసి ప్రయాణికుల నుండి అధిక ఛార్జీలు గుంజుతున్నారు.

డెములు...మెములు

పోనీ ఎక్స్‌ప్రెస్ స్పెషల్స్‌గా మార్చిన ప్యాసింజర్ రైళ్లలో సౌకర్యాలు ఏమైనా అదనంగా ఉంటాయా అంటే ఆ మాటే అడగొద్దు. అవే పాత బోగీలు, అవే రూట్లు. అవే స్టాపులు. చెన్నయ్ డివిజన్‌లో ఇప్పటికే ప్యాసింజర్ రైళ్ల స్థానంలో మెయిన్‌లైన్ ఎలక్ట్రిక్ మల్టిపుల్ యూనిట్లు (మెము) తిరుగుతున్నాయి. తిరుచి, మదురై డివిజన్లలో డీజిల్ ఎలక్ట్రిక్ మల్టిపుల్ యూనిట్ల (డెము)ను నడుపుతున్నారు. తెలంగాణలో కూడా నిజామాబాద్-కాచిగూడ, సికింద్రాబాద్-మనోహరాబాద్, నడికుడి-కాచిగూడ, కాచిగూడ-పెద్దపల్లి, మేడ్చల్-ఫలక్‌నుమా, మిర్యాలగూడ-కాచిగూడ, సిద్ధిపేట-సికింద్రాబాద్ మధ్య ఈ తరహా రైళ్లను నడుపుతున్నారు.

సిబ్బందితో వాదనలు

దక్షిణ రైల్వే బకింగ్ కౌంటర్ల వద్ద ఏర్పాటు చేసిన ఛార్జీల ఛార్టుల్లో కోవిడ్‌కు ముందు వసూలు చేసిన ఛార్జీలే దర్శనమిస్తున్నాయి. వాటిపై కన్పిస్తున్న రెండో తరగతి సాధారణ ఛార్జీలు ఇక ఎంతమాత్రం చెల్లుబాటు కావు. 'చాలా సందర్భాలలో ప్రయాణికులు చార్టులపై ఉన్న ఛార్జీలను చూసి మాతో వాదనకు దిగుతున్నారు. వాటి కంటే రెట్టింపు మొత్తాన్ని ఎందుకు వసూలు చేస్తున్నారంటూ గొడవ పడుతున్నారు. ప్యాసింజర్ రైళ్లకు కాలం చెల్లిపోయిందన్న వాస్తవాన్ని వారు అర్థం చేసుకోవడం లేదు. యూటీఎస్ యాప్‌లు కూడా పాత ఛార్జీలనే చూపిస్తున్నాయని ఫిర్యాదులు అందుతున్నాయి' అని ఓ టికెట్ బుకింగ్ క్లర్కు వాపోయారు. ప్రజల నుండి ఫిర్యాదులు రావడంతో సౌత్ వెస్టర్న్ రైల్వే తన జోన్‌లో పాత ఛార్జీలనే పునరుద్ధరించింది. ఈ మేరకు ఈ నెల 22న ఆదేశాలు జారీ చేశారు. అన్ని స్టేషన్లలో ఆగే మెము, డెము, ప్యాసింజర్ రైళ్లలో ప్రయాణించే వారి నుండి రెండో తరగతి సాధారణ ఛార్జీలను మాత్రమే వసూలు చేయాలని అందులో సూచించారు.

రికార్డుల్లో ప్యాసింజర్లేనట

ప్యాసింజర్ రైళ్లకు ఎక్స్‌ప్రెస్ స్పెషల్స్‌గా పేరు పెట్టి రెట్టింపు ఛార్జీలు వసూలు చేస్తుండడంతో 2022-23లో ప్రయాణికుల ద్వారా రైల్వే శాఖకు గణనీయమైన ఆదాయం లభించింది. గత సంవత్సరం దక్షిణ రైల్వే ప్రయాణికుల ఛార్జీల రూపంలో గరిష్ట స్థాయిలో రూ.6,345 కోట్లు ఆర్జించింది. అంతకుముందు సంవత్సరంతో పోలిస్తే ఇది 80% అధికం. అయితే ఇక్కడ ఆశ్చర్యకరమైన విషయమేమంటే ప్యాసింజర్ రైళ్లను ఉపసంహరించుకుంటున్నామని, లేదా వాటిని ఎక్స్‌ప్రెస్ స్పెషల్స్‌గా మార్చి అధిక ఛార్జీలు వసూలు చేస్తున్నామని రైల్వే శాఖ ఇప్పటి వరకూ ఎలాంటి ప్రకటన చేయలేదు. దీనిపై రైల్వే శాఖ సీనియర్ అధికారులను సంప్రదించగా 'మా రికార్డుల ప్రకారం నెమ్మదిగా నడిచేవన్నీ ప్యాసింజర్ రైళ్లే. అయితే వాటినే ఛార్జీలు పెంచి ఎక్స్‌ప్రెస్ రైళ్లుగా నడుపుతున్నాం. డివిజన్లలో రోజువారీ సమయపాలన నివేదికల్లో మాత్రం వాటిని మేము ప్యాసింజర్ రైళ్లగానే పిలుస్తున్నాం' అని చెప్పుకొచ్చారు.

తడిసి మోపెడవుతున్న ఛార్జీలు

దేశంలో అత్యంత రద్దీగా ఉండే రైల్వే స్టేషన్లలో ఎంజీఆర్ చెన్నయ్ సెంట్రల్ ఒకటి. ఇకపై సబర్బన్ రైళ్లలో సాధారణ ఛార్జీలతో ప్రయాణించడం కుదరదని అక్కడి బుకింగ్ క్లర్కులు చెబుతున్నారు. కొన్ని మార్గాలలో ఛార్జీలు రెట్టింపయ్యాయి. ఉదాహరణకు కోవిడ్‌కు ముందు ప్యాసింజర్ లేదా డెము రైలులో చెన్నయ్ నుండి తిరుపతికి ప్రయాణించాలంటే రూ.35 ఛార్జీ మాత్రమే అయ్యేది. అయితే కోవిడ్ లాక్‌డౌన్ తర్వాత ఈ ఛార్జీని అమాంతం రూ.70కి పెంచేశారు. అలాగే చెన్నయ్ బీచ్ నుండి వెల్లూరుకు, చెన్నయ్ ఎగ్మోర్ నుండి పుదుచ్చేరికి గతంలో రూ.30, రూ.45గా ఉండే ఛార్జీని ఏకంగా రూ.65, రూ.80కి పెంచారు. పోనీ ఈ రైళ్ల వేగం ఏమన్నా పెరిగిందా అంటే అదీ లేదు. 'అది ప్యాసింజర్ రైలు అయినా, ఎక్స్‌ప్రెస్ అయినా లేదా దాని స్టాపులు ఎన్ని ఉన్నా ఆ రైలు ఏ రకానికి చెందినది అనే విషయం ఆధారంగానే ఆర్డినరీ ఛార్జీని నిర్ణయిస్తారు. కోవిడ్‌కు ముందు ప్యాసింజర్ రైళ్లకు వర్తించిన రెండో తరగతి సాధారణ ఛార్జీలను రైల్వే శాఖ రద్దు చేసింది. ఇకపై ప్యాసింజర్ రైళ్లు ఉండవు' అని సీనియర్ అధికారులు సెలవిచ్చారు.

ఇక నుంచి ఏటా రెండు సార్లు 'టెట్'

- రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం
- జూన్, డిసెంబర్‌లో నిర్వహణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉపాధ్యాయ అభ్యర్థులకు నిర్వహించే ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)ను ఇకనుంచి ఏటా రెండుసార్లు నిర్వహించాలనీ, రాష్ట్ర ప్రభుత్వం జూన్, డిసెంబర్ నెలల్లో ఆ పరీక్షలను నిర్వహించాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవలే అందుకు సంబంధించిన దస్త్రంపై సంతకం చేసినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో ఇకనుంచి డీఎస్సీ నోటిఫికేషన్లతో సంబంధం లేకుండా ఏటా రెండుసార్లు టెట్‌ను విద్యాశాఖ నిర్వహించనుంది. టెట్ నిర్వహణకు 90 రోజుల సమయం పట్టనుండగా, అంతకు ముందే నోటిఫికేషన్‌ను విడుదల చేయనున్నాయి. జాతీయ ఉపాధ్యాయ విద్యామండలి (ఎన్సీటీఈ) నిబంధనల ప్రకారం ఏటా రెండుసార్లు టెట్‌ను నిర్వహించాలని ఆదేశించిన విషయం తెలిసిందే. అంతే కాకుండా టెట్ గడువును ఏడేండ్ల నుంచి జీవిత కాలానికి పొడిగించింది. గతంలో అర్హత పొంది మార్కులను పెంచుకోవాలనుకునే వారు, ఇటీవలీ కాలంలో బీఈడీ, డీఐఈడీ వంటి కోర్సులను పూర్తిచేసిన వారు మాత్రమే టెట్ రాసేవారు.

కానీ ఇప్పుడు స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులకు పేపర్-2లో అర్హత కావాలన్న నిబంధనను తప్పనిసరిగా పాటించాల్సి ఉన్నది. దీంతో ఇక నుంచి ఉపాధ్యాయ ఉద్యోగ కోసం ఎదురుచూసే వారే కాకుండా ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వారు కూడా టెట్‌కు దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. దీంతో టెట్‌కు హాజరయ్యే అభ్యర్థుల సంఖ్య పెరిగే అవకాశాలున్నాయి.



(ఫైల్)

రాష్ట్రంలో గతేడాది ఆగస్టు ఒకటిన టెట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసిన విషయం తెలిసిందే. సెప్టెంబర్ 15న రాతపరీక్షలను నిర్వహించారు. అదేనెల 27న ఫలితాలను విడుదల చేశారు. టెట్ పేపర్-1కు 2,69,557 మంది దరఖాస్తు చేస్తే వారిలో 2,23,582 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వారిలో 82,489 (36.89 శాతం) మంది అభ్యర్థులు ఉత్తీర్ణత సాధించారు. పేపర్-2కు 2,08,498 మంది దరఖాస్తు చేయగా, వారిలో 1,90,047 మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. వారిలో 29,073 (15.30 శాతం) మంది అభ్యర్థులు ఉత్తీర్ణత పొందారు. ఇందులో మ్యాథ్స్, సైన్స్ విభాగానికి 1,01,134 మంది హాజరుకాగా, 18,874 (18.66 శాతం) మంది పాసయ్యారు. సోషల్ స్టడీస్ విభాగానికి 88,913 మంది 10,199 (11.47 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు.

తునికాకు టెండర్లు వెంటనే నిర్వహించాలి

మంత్రి కొండా సురేఖకు ఏఐఏడబ్ల్యూయూ వినతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తునికాకు టెండర్లను ప్రభుత్వం వెంటనే నిర్వహించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి నాగయ్య, ఆర్ వెంకట్రాములు, ఉపాధ్యక్షులు బి ప్రసాద్, మహిళా కూలీల రాష్ట్ర కన్వీనర్ బి పద్మ సోమవారం మంత్రి కొండా సురేఖకు వినతి పత్రం సమర్పించారు.

రాష్ట్రంలో తునికాకు సేకరణ రెండో ప్రధాన ఉపాధిగా ఉన్నదని తెలిపారు. దీని వల్ల వచ్చే ఆదాయంతో వేలాది కుటుంబాలు బతుకుతాయని వివరించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే టెండర్లు పిలవాలని కోరారు. పెరిగిన నిత్యావసర సరుకుల ధరలకనుగుణంగా తునికాకు కట్ట రేటును



పెంచాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బోనస్ రూ. 280కోట్లను విడుదల చేసి పంపిణీ చేయలేదనీ, వాటిని వెంటనే పంపిణీ చేయాలని కోరారు.

హయ్యర్ పెన్షన్ సమస్యలు పరిష్కరించండి

రవాణామంత్రికి టీఎస్‌ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ విజ్ఞప్తి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఆర్టీసీ కార్మికుల హయ్యర్ పెన్షన్ విషయంలోని సమస్యల్ని ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని టీఎస్‌ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కార్యాలయంలో వినతిపత్రాన్ని సమర్పించినట్టు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీరాంజనేయులు, వీఎస్ రావు తెలిపారు. ఆర్టీసీ యాజమాన్యం పీఎఫ్ ట్రస్ట్‌కు రూ.1,450 కోట్లు చెల్లించాల్సి ఉందనీ, అది ఇవ్వకపోవడంతో, కార్మికులకు హయ్యర్ పెన్షన్ డిమాండ్ నోటీసులు ఇవ్వట్లేదని వివరించారు. హయ్యర్ పెన్షన్ కోసం కార్మికులు చేసుకున్న దరఖాస్తులను టీఎస్‌ఆర్టీసీ పీఎఫ్ ట్రస్ట్ 2023 ఏప్రిల్‌లోనే రీజినల్ ప్రావిడెంట్ ఫండ్ కమీషనర్ కార్యాలయానికి పంపారని తెలిపారు. దాదాపు 10 నెలల సమయం గడిచినప్పటికీ కార్మికులకు డిమాండు నోటీసులు అందలేదనీ, ఆర్టీఐ ద్వారా సమాచారం తెలుసుకుంటే యాజమాన్యం పీఎఫ్ ట్రస్ట్‌కు డబ్బు చెల్లించలేదని వెల్లడైందనీ, కేవలం 125 మందికి మాత్రమే డిమాండ్ నోటీసులు వచ్చాయని పేర్కొన్నారు. అదే సమయంలో ఏపీఎస్‌ఆర్టీసీలో 11,608 మంది డిమాండ్ నోటీసులు అందుకున్నారని వివరించారు. సంస్థలో కార్మికులకు ఏటా మార్చి నెలలో ఇస్తున్న పీఎఫ్ స్లిప్పులన్నీ బుక్ అడ్జస్ట్‌మెంట్లుగా ఇచ్చినవే తప్ప, బోర్డుకు నగదు చెల్లించలేదని తెలిపారు. దీనివల్ల సంస్థలోని 42వేల మంది కార్మికులు తీవ్రంగా నష్టపోతారని చెప్పారు. తక్షణం ఈ సమస్యల్ని పరిష్కరించి, కార్మికులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

జ్ఞానవాపిలో హిందువులు ప్రార్థనలు చేసుకోవచ్చు

(మొదటి పేజీ తరువాయి)

సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను న్యాయస్థానం తోసిపుచ్చింది. మసీదు నిర్వహణ బాధ్యతలు చూస్తున్న అంజుమన్ ఇంతెజామియా మసీదు కమిటీ దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయమూర్తి రోహిత్ రంజన్ అగర్వాల్ ఈ తీర్పును వెలువరించారు. 17వ శతాబ్ద కాలం నాటి హిందూ దేవాలయాన్ని కూల్చివేసి, అక్కడ మసీదును నిర్మించారంటూ పురావస్తు శాఖ ఇచ్చిన నివేదికను ఆధారంగా చేసుకొని జ్ఞానవాపి కాంప్లెక్స్ సెల్లారులో హిందువులు ప్రార్థనలు చేసుకోవచ్చునంటూ జనవరి 31న వారణాసి కోర్టు ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

- రేపటినుంచి పరీక్షలు ప్రారంభం
- హాజరుకానున్న 9,80,978 మంది విద్యార్థులు
- 1,521 పరీక్షా కేంద్రాల ఏర్పాటు
- 27,900 మంది ఇన్విజిలేటర్ల నియామకం
- విద్యార్థులు ఒత్తిడికి లోనైతే టెలీమానస్ ద్వారా కౌన్సిలింగ్ : ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. వచ్చేనెల 19 వరకు జరిగే ఈ పరీక్షలను ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తారు. ఉదయం తొమ్మిది తర్వాత పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులకు అనుమతి ఉండదు. ఈ పరీక్షల నిర్వహణ కోసం ఇంటర్ బోర్డు అధికారులు సర్వంసిద్ధం చేశారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లను పూర్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్ ప్రథమ సంవత్సరం నుంచి 4,78,718 మంది, ద్వితీయ సంవత్సరం నుంచి



(ఫైల్)

5,02,260 మంది కలిపి మొత్తం 9,80,978 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ద్వితీయ సంవత్సరంలో 4,44,189 మంది రెగ్యులర్, 58,071 మంది ప్రయివేటు విద్యార్థులు న్నారు. రాష్ట్రంలో 1,521 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో ప్రభుత్వ జూనియర్ కాలేజీలు 407, ప్రభుత్వ రంగ కాలేజీలు 234, ప్రయివేటు జూనియర్ కాలేజీలు 880 ఉన్నాయి. రాష్ట్రంలో 1,521 మంది చీఫ్ సూపరింటెండెంట్లు (సీఎస్), 1,521 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు (డీవో), 27,900 మంది ఇన్విజిలేటర్లు, 75 మంది ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు, 200 మంది సిట్టింగ్ స్క్వాడ్‌లను ఇంటర్ బోర్డు నియమించింది. సోమవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా మాట్లాడుతూ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఒత్తిడి, భయాందోళనలకు లోనుకాకుండా ఉండాలని కోరారు. ప్రశాంతంగా పరీక్షలను రాయాలనీ, విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఇంటర్ విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా చూడాల్సిన బాధ్యత ఆయా యాజమాన్యాలతోపాటు అధ్యాపకులు, తల్లి దండ్రులపై ఉందన్నారు. విద్యార్థులకు మానసిక ఒత్తిడి, ఇతర సమస్యలుంటే టెలిమానస్ ద్వారా కౌన్సిలింగ్ ఇస్తామని వివరిం చారు. టోల్‌ఫ్రీ నెంబర్ 14416 లేదా 1800-914416 నెంబర్లను సంప్రదించాలని సూచించారు. ఇప్పటి వరకు 475 మంది ఫోన్ చేశారని అన్నారు.

పరీక్షా కేంద్రాల వద్ద వసతుల కల్పన

పరీక్షా కేంద్రాల వద్ద ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నామనీ, విద్యార్థులకు అవసరమైన సదుపాయాలను కల్పించామని శృతి ఓజా చెప్పారు. తాగునీరు, ఓఆర్ఎస్ అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్దకు విద్యార్థులు సకాలంలో చేరేందుకు వీలుగా ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను కోరారు. పరీక్షల నిర్వహణ సమయంలో తలెత్తే సమస్యలకు సత్వర పరిష్కారం లభించే విధంగా ప్రత్యేకంగా కంట్రోల్ రూం ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. పరీక్షా కేంద్రాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తూ ఎప్పటికప్పుడు వాటిని పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్షలు సమర్థవంతంగా, పారదర్శకంగా, ఇబ్బందులు తలెత్తకుండా నిర్వహించాలని కోరారు. పరీక్షల సమయంలో విద్యుత్‌కు ఆటంకం కలగకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఉంటుందన్నారు. ఇంటర్ బోర్డు వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం విద్యార్థులకు కల్పించామని చెప్పారు. ఈ సమావేశంలో ఇంటర్ పరీక్షల నియంత్రణాధికారి జయప్రదబాయి, జాయింట్ సెక్రెటరీ శ్రీనివాస్, ప్రజాసంబంధాల అధికారి పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఏడో 'సారీ' గైర్హాజరు

(మొదటి పేజీ తరువాయి)

హాజరు కావాల్సి ఉండగా ఏడోసారి గైర్హాజరు అయ్యారు. ఈ వ్యవహారంపై వచ్చే నెల 16వ తేదీన ఢిల్లీ కోర్టులో విచారణ జరుగుతుందని, అప్పటి వరకూ ఈడీ వేచి ఉండాల్సిందేనని అమ్‌ఆద్మీ పార్టీ వ్యాఖ్యానించింది. 'కేజ్రీవాల్‌కు రోజూ సమన్లు పంపే బదులు కోర్టు నిర్ణయం కోసం ఈడీ వేచి చూడాల్సి ఉంటుంది' అని పార్టీ తెలిపింది. మోడీ ప్రభుత్వం ఎంత ఒత్తిడి తెచ్చినప్పటికీ ఇండియా కూటమి నుండి వైదొలిగే ప్రశ్నే లేదని అమ్‌ఆద్మీ స్పష్టం చేసింది. ప్రతిపక్ష కూటమి నుండి నిష్క్రమించేలా తమ పార్టీపై బీజేపీ ప్రభుత్వం ఒత్తిడి తెస్తోందని, అందుకోసం కేంద్ర దర్యాప్తు సంస్థలను ప్రయోగిస్తోందని ఆ పార్టీ ఇప్పటికే ఆరోపించింది. కాగా తన సమన్లను కేజ్రీవాల్ పట్టించుకోవడం లేదంటూ ఢిల్లీ కోర్టులో ఈడీ ఫిర్యాదు దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన న్యాయస్థానం మార్చి 16 వరకూ వ్యక్తిగత హాజరు నుండి ఆయనకు మినహాయింపు ఇచ్చింది. ఆయన ఇటీవల కోర్టు ఎదుట వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. గత నవంబర్ నుండి తనకు ఈడీ జారీ చేస్తున్న సమన్లపై ఢిల్లీ ముఖ్యమంత్రి మండిపడ్డారు. అవి చట్టవిరుద్ధమైనవని, వాటిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అయితే విచారణ నుండి తప్పించుకునేందుకే కేజ్రీవాల్ సమన్లను బేఖాతరు చేస్తున్నారని బీజేపీ నేత హరీష్ ఖురానా విమర్శించారు.

సిసోడియాపై తప్పుడు కేసు : సీఎం

ఇదిలావుండగా మద్యం కేసులో ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియాను అరెస్ట్ చేసి సంవత్సరం పూర్తయిన సందర్భంగా ముఖ్య మంత్రి కేజ్రీవాల్ సోమవారం రాజ్‌ఘాట్‌ను సందర్శించి మహాత్మునికి శ్రద్ధాంజలి ఘటించారు. సిసోడియాపై తప్పుడు కేసు మోపారని, ఆయనకు వ్యతిరేకంగా కేంద్ర దర్యాప్తు సంస్థ వద్ద ఎలాంటి ఆధారాలు లేవని కేజ్రీవాల్ మీడియాకు చెప్పారు. 'మా ప్రభుత్వంలో అత్యంత సమర్థుడైన విద్యా మంత్రిని గత సంవత్సరం ఇదే రోజు ఓ తప్పుడు కేసులో ఇరికించి కేంద్ర ప్రభుత్వం అరెస్ట్ చేసింది' అని ఆయన చెప్పారు. సిసోడియా బీజేపీలో చేరి ఉంటే ఆయనపై పెట్టిన కేసులు ఎత్తేసి ఉండేవారని, కానీ ఆయన ఆ పని చేయలేదని అన్నారు. పలువురు ఆప్ నేతలు కూడా కేజ్రీవాల్‌తో పాటు రాజ్‌ఘాట్‌ను సందర్శించారు.

డబ్ల్యూటీవో నుంచి భారత్ బయటికి రావాలి

- దాని ఒత్తిడితోనే పంటలకు మద్దతు ధరల చట్టం ఇవ్వట్లేదు
- దేశంలో ఆహార భద్రతతో పాటు దేశ సార్వభౌమత్వానికి ప్రమాదం
- ఢిల్లీ నిరసనలో రైతుల డిమాండ్స్ వెంటనే పరిష్కరించాలి
- సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిరసనలు

నవతెలంగాణ-విలేకరులు

డబ్ల్యూటీవో (వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్) నుంచి భారత్ బయటకి రావాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) నాయకులు డిమాండ్ చేశారు. డబ్ల్యూటీవో సూచనలతోనే కేంద్రంలోని మోడీ సర్కార్ పంటలకు మద్దతు ధరల చట్టం తీసుకురావడం లేదని విమర్శించారు. ఈ ప్రతిపాదనలు దేశంలో ఆహార భద్రతకు, దేశ సార్వభౌమత్వానికి ప్రమాదకరమని హెచ్చరించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఢిల్లీలో నిరసన తెలుపుతున్న రైతుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సోమవారం అబుదాబీలో ప్రారంభం కానున్న డబ్ల్యూటీవో కాన్ఫరెన్స్‌ను నిరసిస్తూ.. 'క్విట్ డబ్ల్యూటీవో డే'గా పాటించాలని ఎస్‌కేఎం కేంద్ర కమిటీ పిలుపునిచ్చిన నేపథ్యంలో సోమవారం రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో బైక్ ర్యాలీలు, నిరసనలు చేపట్టారు.

ఖమ్మం జిల్లా కేంద్రంలో తెలంగాణ రైతు సంఘం, అఖిల భారత రైతుకూలీ సంఘం, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పెవిలియన్ గ్రౌండ్ నుంచి ఇందిరా నగర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి వై ప్రకాష్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయరంగాన్ని విదేశీ



కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు తహతహలాడుతోందన్నారు. రైతులకు ఎంఎస్‌పీని మంజూరు చేయకుండా ప్రజా పంపిణీ వ్యవస్థను ఉపసంహరించుకోవడంతో పాటు ఆ ప్రయోజనం నేరుగా ప్రజలకు నగదు బదిలీ చేయాలని భారత దేశంపై డబ్ల్యూటీవో ఒత్తిడి చేస్తున్నదని ఆరోపించారు. ఢిల్లీ



సరిహద్దుల్లో రైతుల నిరసన స్థలంలో రైతుల ట్రాక్టర్లను పోలీసులు ధ్వంసం చేయడంతో పాటు అణచివేత ప్రయోగించడం, రైతు ఉద్యమాన్ని ఏకాకిని చేసి విభజించేందుకు కుట్ర పన్నారని విమర్శించారు. ఈ విభజనతో ఎన్నికల్లో ప్రయోజనం పొందేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.



ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం దిగి రాకపోతే మార్చి 14న ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు.

వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. అనంతరం కలెక్టర్ సి. నారాయణ రెడ్డికి మెమోరాండం అందించారు. ఈ సందర్భంగా సీపీఐ వికారాబాద్ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్ మాట్లాడుతూ.. ఢిల్లీలో రైతులు న్యాయబద్ధంగా ఉద్యమం చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం రైతులను అణచివేసేందుకు రబ్బర్ బులెట్‌తో టియర్ గ్యాస్ వదులుతూ బాష్పవాయువు గోళాలు వదిలి రైతు శుభకరన్ సింగ్ హత్య చేసిందన్నారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో గాంధీ చౌక్ నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వరకు బైక్ ర్యాలీ చేపట్టారు. కామారెడ్డి పట్టణంలో బైక్ ర్యాలీ చేపట్టారు. నల్లగొండ జిల్లా నకిరేకల్ పట్టణకేంద్రంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన ప్రదర్శన చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో నల్లగొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట మండలంలో రైతు సంఘం, సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆలేరులో రైతుకూలీ సంఘం, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు.

చేతలు అధ్వాన్నం

సంపాదకీయం

'దేశంలో ప్రతి రంగంలోనూ నారీశక్తి కొత్త శిఖరాలకు చేరుతోంది' అంటూ ప్రధాని మోడీ మొన్నటి తన మన్‌కీబాత్ 110వ ఎపిసోడ్లో ఎంతో గొప్పగా చెప్పాడు. మహిళలకు సమాన అవకాశాలు కల్పించినప్పుడే ప్రపంచం సుసంపన్నం అవుతుందని ప్రఖ్యాత కవి భారతీయార్ చెప్పిన మాటలను కూడా ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో నివసించే మహిళలు సైతం డ్రోన్లు ఉపయోగిస్తున్నారని, ఇది ఎవ్వరూ ఊహించని మార్పు అంటూ ఆయన తన రేడియో ఉపన్యాసంలో తనదైన శైలిలో ఆవేశంగా మాట్లాడాడు. కానీ వాస్తవంగా జరుగుతున్న దీనికి భిన్నంగా ఉన్నది.

> అవకాశాల్లో సగ భాగం ఇవ్వకుండా ఆకాశంలో సగం అంటే ఎవరు నమ్ముతారు? రక్షణ కల్పించకుండా సాధికారత కల్పిస్తానంటే ఎలా విశ్వసిస్తారు? తమ ఆత్మగౌరవానికి విలువివ్వవని పాలనలో ఎంతకాలమని మగ్గుతారు? అలాంటి పాలకుడు నారీ శక్తి అంటూ ఉపన్యాసాలు చెబుతుంటే నమ్మడానికి మహిళలు ఇక సిద్ధంగా లేరు. అతని మన్ కీ బాత్ వెనకున్న అసలు సంగతేంటో అర్థం చేసుకుంటున్నారు.

కోస్ట్ గార్డ్ (భారతీయ తీర రక్షణ దళం)లో మహిళల శాశ్వత కమిషన్ ఏర్పాటుకు కేంద్రం అంగీకరించలేదు. రక్షణ రంగంలోని మహిళా అధికారుల పట్ల కేంద్రం చూపు తున్న వివక్షకు ఇదొక మచ్చుతునక. కోస్ట్‌గార్డ్‌లో అర్హులైన షార్ట్ సర్వీస్ కమిషన్డ్ (ఎస్ఎస్సీ) మహిళా అధికారులతో పర్మినెంట్ కమిషన్ ఏర్పాటు చేయడానికి కేంద్రం అనుమతి ఇవ్వడం లేదని ప్రియాంక త్యాగి అనే అధికారి ఇటీవలె న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. 'మాట్లాడితే నారీశక్తి అంటారు. ఇప్పుడు ఇక్కడ ఎందుకు చూపించడం లేదు. ఈ విషయంలో మీరు చాలా అగాథంలో ఉన్నారు. మహి ళలను సముచితంగా పరిగణించే విధానాన్ని మీరు రూపొందించాల్సిందే' అంటూ సుప్రీం ఈ కేసు విషయంలో కేంద్రానికి అక్షింతలు వేసింది.

వాస్తవానికి మోడీ ప్రభుత్వం ఈ ఒక్క విషయంలోనే కాదు మహిళల పట్ల అడుగడుగునా అగాథంలో ఉండే ఆలోచిస్తోంది. పదేండ్ల తన పాలనలో మహిళలకు రక్షణ కల్పించడంలో మోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలమయిందనేది ఎవ్వరూ కాదనలేని సత్యం. ఉపన్యాసాల్లో మాత్రం నారీ శక్తి అంటూ ఓట్ల ప్రేమ ఒలకపోతుస్తున్నాడు. బిల్కిస్‌బానో సంఘటన, రెజ్లర్లు చేసిన పోరాటం దేశంలో



మహిళల దుస్థితికి మచ్చుతునకలు. ఇక ఉజ్జయినిలో గత ఏడాది 12 ఏండ్ల బాలిక లైంగిక దాడికి గురై వణికిపోతూ అర్ధ నగ్నంగా కిలోమీటర్ల దూరం సాయం కోసం పరిగెత్తిన విషయం గుర్తుకొస్తే ఎవరికైనా హృదయం ద్రవించక మానదు. మణిపూర్‌లో ఇద్దరు మహిళలపై లైంగికదాడి చేసి నగ్నంగా ఊరేగించిన ఘటన దేశాన్ని అల్లకల్లోలం చేసింది. అయినా మన ప్రధాని చలించలేదు. ఇలా చెప్పుకుంటూపోతే మోడీ పాలనలో మహిళలపై జరుగుతున్న దాడులు కోకొల్లలు. ఈ ఘటనలు చాలవా? మహిళల రక్షణ పట్ల బీజేపీ వైఖరి ఏంటో చెప్పడానికి.

ఇక దేశవ్యాప్తంగా మహిళలపై హింస రోజురోజుకు పెరిగిపోతోందని గతేడాది కేంద్ర నేర గణాంక సంస్థ విడుదల చేసిన నివేదిక చెబుతోంది. అలాగే గతంతో పోలిస్తే మహిళలపై హింస 30శాతం పెరిగిందని గత ఏడాది స్వయానా జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ) నివేదికే తేల్చి చెప్పింది. ఆ ఏడాది వచ్చిన ఫిర్యాదులను పరిశీలిస్తే బీజేపీ పాలిత రాష్ట్రం ఉత్తరప్రదేశ్ నుంచే సగానికి పైగా ఉన్నాయని ఆ లెక్కల్లో తేలింది. అంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో, మహిళ పట్ల బీజేపీ ప్రభుత్వానికి ఎంతటి ప్రేమ ఉందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనే లేదు.

అవకాశాల్లో సగభాగం ఇవ్వకుండా ఆకాశంలో సగం అంటే ఎవరు నమ్ముతారు? రక్షణ కల్పించకుండా సాధికారత కల్పిస్తానంటే ఎలా విశ్వసిస్తారు? తమ ఆత్మగౌరవానికి విలువివ్వవని పాలనలో ఎంతకాలమని మగ్గుతారు? అలాంటి పాలకుడు నారీశక్తి అంటూ ఉపన్యాసాలు చెబుతుంటే నమ్మడానికి మహిళలు ఇక సిద్ధంగా లేరు. అతని మన్‌కీబాత్ వెనకున్న అసలు సంగతేంటో అర్థం చేసుకుంటున్నారు.

బీజేపీ పాలనలో మహిళల పరిస్థితి రోజురోజుకు దిగజారి పోతుందని ఒకపక్క మహిళా సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తే తమ మనుగడే కష్టమని ఆందోళన చెందుతున్నారు. అందుకే మహిళా లోకమంతా ఏక మై బీజేపీని తరిమి కొట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఇక ఒట్టి మాటలు కట్టిపెట్టాల్సిన సమయం మోడీకి ఆసన్నమైనట్టే. తన మన్‌కీ బాత్ 111వ ఎపిసోడ్‌కు ముచ్చటగా మూడు నెలలు విరామం ఇస్తున్నట్టు ప్రధాని ప్రకటించాడు. లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొనే ఈ నిర్ణయం తీసుకున్నాడనేది అందరికీ తెలిసిన విషయమే. తామంటే విలువలేని మోడీకి ఈ తాత్కాలిక విరామం శాశ్వతం కావాలని మహిళలు ముక్త కంఠంతో కోరుకుంటున్నారు. ఈ హింసా పాలకుల నుండి తమని తాము కాపాడుకునేందుకు నడుం బిగిస్తున్నారు.

ఎన్నికల బాండ్లు... బహిరంగ అవినీతి



జి.తిరుపతయ్య
9951300016


రాజకీయ పార్టీలకు నిధులు లభించే విధానం 'ఎన్నికలబాండ్ల' ప్రక్రియను భారతదేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు రద్దుచేసింది. ఈ సందర్భంలోని సుప్రీంకోర్టు వ్యాఖ్యలు ప్రాధాన్యత గలవి. "దాతల వివరాలను గోప్యతలో 'క్విడ్‌ప్రోకో' అనగా 'నేను ఇంత మొత్తం ఇస్తే నాకేమిలాభం' అనే కుతంత్రం దాగి ఉన్నది" అని వ్యాఖ్యానించింది. లబ్ధి పొందడానికి బీజేపీ చేసిన ప్రయోగంపై ఈ తీర్పు చెంపదెబ్బ. గత ఐదేండ్లుగా ప్రఖ్యాత న్యాయవాదులు ప్రశాంత్‌భూషన్, పిల్సిబల్వంటి వారితోపాటు సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సుప్రీంకోర్టును ఆశ్రయించిన దరిమిలా కోర్టు ఈవిధమైన తీర్పును ఇవ్వడానికి వీలు కలిగింది. ఈ తీర్పుతో ఎన్నికల బాండ్ల ద్వారా ఊహించినదానికంటే ఎక్కువ మొత్తంలో లాభపడిన బీజేపీ నోట్లోవెలక్కాయ పడినట్లు అయింది. సుప్రీంకోర్టు నిర్ణయాన్ని అది జీర్ణించుకోలేకపోతున్నది. బహిరంగంగానే తమ అక్కసు వెళ్ళగకుతున్నారు. దేవుడి మాట ఎత్తనిదే పొద్దుగడవని పరిస్థితికి దిగజారుతున్నారు. ప్రధాని నరేంద్ర మోడీ ఒక సమా వేశంలో ప్రసంగిస్తూ, "నేడున్న సమాజంలో శ్రీకృష్ణునికి సుధాముడు (కుచేలుడు) కొన్ని ఫలహారాలిస్తే అది కూడా అవినీతిలో భాగమని, శ్రీకృష్ణుడు కూడా అవినీతిపరుడే అని తీర్పునిస్తున్నాయి" అంటూ ఎన్నికల బాండ్ల సందర్భంగా సుప్రీంకోర్టు వెలువరించిన నిర్ణయంపై పరోక్షంగా తమ మనోగతాన్ని బయట పెట్టుకున్నారు. ఇక్కడ గమనించాల్సింది ఏమంటే ఎన్నికల బాండ్లరూపంలో కార్పొరేట్ కంపెనీలు రాజకీయ పార్టీలకు ముఖ్యంగా బీజేపీకి ముట్టచెబుతున్న విరాళాలు కేవలం ఫలహారాలు మాత్రమే అనబడేవారి ఉద్దేశం! దేశ అత్యున్నత న్యాయస్థానపు తీర్పును ఇలా అగౌరవపరుస్తూ ప్రధానమంత్రిస్థాయిలో ఉండికూడా ప్రసంగించడం ఏమాత్రం అంగీకారం కాదు. సుప్రీంకోర్టు తీర్పులను సెలెక్టివ్‌గా ఆహ్వానించడం ఎవరికీ మంచిదికాదు. ఇలాంటి వ్యాఖ్యలు సామాన్యులను ప్రభావితం చేసి కోర్టు తీర్పులను ధిక్కరించేలా ఉసిగొలుపుతాయి. ఈమాత్రం కూడా గమనించకపోవడం కడుశోచనీయం.

> తెలంగాణలోని యశోద హాస్పిటల్ 2019-20లో బీజేపీకి రూ.ఐదులక్షలు విరాళమిస్తే, 2020 డిసెంబర్‌లో జరిగిన ఐటీ దాడుల అనంతరం 2021- 22 లో పదికోట్ల రూపాయల విరాళం ఇచ్చింది. హెటిరో కంపెనీ, లలితజ్యువెలర్స్, అరబిందో రియాలిటీ, ఇన్ఫ్రాస్ట్రక్చర్, సింటెక్స్, హల్దిరామ్స్ వంటివారందరూ దాడుల అనంతరం పెద్దమొత్తంలో చెల్లించుకున్నట్లు వివరాలు బయటపడ్డాయి. కొన్ని కంపెనీలు సెలెక్టివ్‌గా అనగా తమ ఇండస్ట్రీ నెలకొల్పబడిన రాష్ట్రంలో అధికారంలో ఉన్నపార్టీకి, కేంద్రంలో అధికారంలో ఉన్నపార్టీకి మాత్రమే విరాళాలు చెల్లించుకున్నారు. ఈ కోవలో ఆదిత్య బిర్లా గ్రూప్ సంస్థ ఉన్నది.

ఇన్‌కంటాక్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్‌వారు నిర్వహించే దాడులకు ప్రధాన రాజకీయ పార్టీకి అందుతున్న నిధులకు సంబంధం ఉన్నట్టు వెలువడింది. గత ఐదేళ్లకాలంలో దాదాపు 30 కంపెనీలు వారిపై ఇన్‌కంట్యాక్స్ అధికారులు జరిపిన దాడుల తర్వాత రూ.335 కోట్ల నిధులు ఎన్నికల బాండ్ల రూపంలో చెల్లించుకున్నారు. వీరిలో 23 కంపెనీలు 2014 నుండి ఐటిదాడులు జరిగేనాటికి ఒక్క పైసా కూడా ఏ రాజకీయ పార్టీకి ఇవ్వలేదు. కేవలం 2022- 23 సంవత్సరానికిగాను ఎన్నికల బాండ్ల ద్వారా సమకూరిన మొత్తం రూ.850 కోట్లు ఇందులో బీజేపీకి చేరింది. రూ. 720 కోట్లు అంతకుముందు ఆర్థిక సంవత్సరాల్లో బీజేపికి చేరిన మొత్తాలు 57, 61 శాతంగా నమోదైనవి. ఇప్పటి వరకు ఎన్నికల బాండ్ల ద్వారా నమోదు కాబడిన నిధులు రూ.16,518 కోట్లు. ఇందులో ఒకకోటి లేదా అంతకుమించిన మొత్తాలలో కొనుగోలు చేయబడినవి 94.41శాతం. కోట్లరూపాయల విరాళం ఇచ్చేవారు ఏమాత్రం ప్రతిఫలం ఆశించకుండా ఇస్తారని ఎంత నమ్మబలికినా అది వాస్తవమగునా? ఇలాంటి బాండ్లను కొనుగోలుచేసిన వారు తమ అస్తిత్వాన్ని సదరు రాజకీయ పార్టీకి తెలియజేయకుండా చెల్లిస్తారని కూడా నమ్మడం సబబేనా?

> కంపెనీలు రాజకీయ పార్టీలకు నిధులను సమకూర్చే విధానం స్వతంత్రం వచ్చినప్పటి నుండి కూడా ఉన్నది. అయితే స్వతంత్రం వచ్చిన పదేండ్లలోని ప్రయివేటు సంస్థలు ఎన్నికల విరాళాల ద్వారా లాలుచి పడుతున్నాయని గమనించిన నాటిపెద్దలు 1960లో ఈ విరాళాలపై సీలింగును విధించారు. అదేసందర్భంలో కార్పొరేట్ కంపెనీలు పుట్టుకొచ్చి మరింతగా రాజకీయాలను ప్రభావితం చేస్తున్నాయని భావించి 1969లో కార్పొరేట్ ఫండింగ్ మొత్తాన్ని బ్యాన్‌చేశారు. అయితే నూతన ఆర్థిక విధానాల శకం ప్రారంభమైన తొలినాళ్లలోనే దేశప్రధాని బాధ్యతలు చేపట్టిన రాజీవ్‌గాంధీ ఆధ్వర్యంలో 1985లో ఈ కార్పొరేట్ ఫండింగ్‌పై విధించిన నిర్బంధాన్ని తొల గించారు. అయితే నిరంతరం లాభార్జనకు పన్నుఎగవేతకు వివిధ దారులను వెతుక్కునే చాకచక్యంతో కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ ద్వారా 1993లో ప్రతిపాదించి, రాజకీయపార్టీలకు అందించే విరాళాలన్నింటిపై పన్ను రాయితీని సాధించుకుంది.

కంపెనీలు రాజకీయ పార్టీలకు నిధులను సమకూర్చే విధానం స్వతంత్రం వచ్చినప్పటి నుండి కూడా ఉన్నది. అయితే స్వతంత్రం వచ్చిన పదేండ్లలోని ప్రయివేటు సంస్థలు ఎన్నికల విరాళాల ద్వారా లాలుచి పడుతున్నాయని గమనించిన నాటిపెద్దలు 1960లో ఈ విరాళాలపై సీలింగును విధించారు. అదే సందర్భంలో కార్పొరేట్ కంపెనీలు పుట్టుకొచ్చి మరింతగా రాజకీయాలను ప్రభావితం చేస్తున్నాయని భావించి 1969లో కార్పొరేట్ ఫండింగ్ మొత్తాన్ని బ్యాన్ చేశారు. అయితే నూతన ఆర్థిక విధానాల శకం ప్రారంభమైన తొలినాళ్లలోనే దేశప్రధాని బాధ్యతలు చేపట్టిన రాజీవ్ గాంధీ ఆధ్వర్యంలో 1985లో ఈ కార్పొరేట్ ఫండింగ్‌పై విధించిన నిర్బంధాన్ని తొలగించారు. అయితే నిరంతరం లాభార్జనకు పన్ను ఎగవేతకు వివిధ దారులను వెతుక్కునే చాకచక్యంతో కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ ద్వారా 1993లో ప్రతిపాదించి, రాజకీయపార్టీలకు అందించే విరాళాలన్నింటిపై పన్ను రాయితీని సాధించుకుంది. ఇలా విరాళాలు చెల్లించడం పన్నురాయితీ పొందడం విచ్చలవిడిగా సాగింది.



1996లో రాజకీయ పార్టీలన్నీ ఆదాయ రిటర్న్స్ దాఖలు చేయాలని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. ఇలాంటి రిటర్న్స్ దాఖలు చేస్తున్న సందర్భంలో దాతల వివరాలు బయటపడి కొన్ని కంపెనీలకు తాము నిధులు సమకూర్చిన రాజకీయ పార్టీ అధికారంలోకి రానప్పుడు ఇబ్బందిఏర్పడింది. ఈ సందర్భంలో తట్టిన ఆలోచననే 'ఎన్నికల ట్రస్టు' అనే విధానం. ఎవరైనా ఒకరు (సాధారణంగా కార్పొరేట్ సంస్థ) ఏర్పాటు చేసే ఈ ఎలక్టోరల్ ట్రస్టుకి ఏకంపెనీ యైనా విరాళాన్ని అందించవచ్చు. సదరు విరాళాలను ఆ ట్రస్టు వివిధ రాజకీయ పార్టీలకు అవి పొందిన ఓట్ల నిష్పత్తిని బట్టి నిధులను మళ్లిస్తుంది. సదరు ట్రస్టు తాముసేకరించిన విరాళాల వివరాలను భారతఎన్నికల కమిషన్‌కు సమర్పిస్తుంది. అయితే ఇందులో ఉన్నకాస్తయినా జెన్యూనిటీ ఏమంటే దాతల వివరాలు నేరుగా రాజకీయ పార్టీకి చేరవు. అందరి ద్వారా సేకరించబడిన మొత్తంలో నుంచే ఒక రాజకీయ పార్టీకి నిష్పత్తి ప్రకారం వెళుతుంది కాబట్టి ప్రత్యేకంగా ఒక కంపెనీకి లాభం చేకూర్చాలనే ప్రతిఫల బాధ్యత రాజకీయ పార్టీలకు ఉండదు. 'ప్రోగ్రెసివ్ ఎలక్ట్రోరల్ ట్రస్ట్' అనే సంస్థను మొట్టమొదటిగా టాటాగ్రూప్ 1996లో ఏర్పాటు చేసింది. అప్పటినుండి అది నిధులను సమకూరుస్తూ రాజకీయ పార్టీలకు సమర్పిస్తూ తమకు కావలసిన పనిని తాము తీసుకొని తమకు నిధులను అందించిన వారికి కూడా పనులు చక్కబెడుతూ వస్తున్నది! ఇంతలా ఉపయోగ పడుతున్నవారికి ఏదైనా మేలుచేయాలని వాజ్‌పేయి ఆధ్వర్యంలోని ఎన్డీఏ ప్రభుత్వం 2003లో ఇలాంటి డొనేషన్స్ అన్నింటికీ 100 శాతం పన్నురాయితీ కల్పించింది. సాంప్రదాయ పద్ధతిలో టాటా గ్రూపు సంస్థ ఏర్పాటు చేసిన ఎన్నికల ట్రస్టు వ్యవహరిస్తుందని కాబోలు, భారతిగ్రూప్స్ సంస్థ 'ప్రుడెంట్ ఎలక్ట్రోరల్ ట్రస్ట్' అనే మరో సంస్థను 2013లో ఏర్పాటు చేసింది. కానీ భారతీ గ్రూప్ స్థాపించిన ఎలక్టోరల్ ట్రస్టు ఇంకా కొనసాగుతున్నది! ఈ ట్రస్టు ద్వారా వస్తున్న మొత్తంలో బీజేపీకి రు.100 వస్తే కాంగ్రెస్‌కు 19 పైసలు అందుతున్నాయి.


అయితే ఈఎలక్ట్రోరల్ ట్రస్టుల ద్వారా సమీకరించబడుతున్న మొత్తాలు సరిపోకపోవడం ఒకటై ఉండవచ్చు, రెండవది, "మనము నిధులు సమకూర్చిన తర్వాత ప్రతిఫలము పొందకపోతే ఎట్లా" అని కార్పొరేట్ కంపెనీలు ఆలోచించి ఉండవచ్చు, మూడవది, "మనకు ఎవరు నిధులు ఇస్తున్నారు, వారి అవసరాలు ఏమిటి, వారికెలా సహాయపడగలము..." అనే ఆలోచన ప్రభుత్వాలదై ఉండవచ్చు, ఇకచివరిగా, అధికారంలోలేని ప్రతిపక్షపార్టీలకు నిధులు ఎందుకు అని అధికారపక్షం భావించి ఉండవచ్చు. ఈ కారణాల వల్లనే ఎన్నికల బాండ్ల విధానానికి 2018లో నాంది పడింది. ఈవిధానం నోటిఫై కాకముందే, 2017లోనే అప్పటివరకు కార్పొరేట్ సంస్థలు చెల్లించే విరాళాలపై ఆయా కంపెనీల నికర లాభాలపై ఉన్న 7.5శాతం సీలింగ్‌ను కూడా కేంద్రం రద్దుచేసింది. 2018 నుంచి ఎన్నికల బాండ్ల రూపంలో యదేచ్ఛగా నిధులను రాబట్టుకోవడం విరాళాలు ఇవ్వని సంస్థలపై నిర్దాక్షిణ్యంగా దాడులు జరపడం, లొంగదీసుకోవడం పరిపాటిగా మారి పోయింది.

తెలంగాణలోని యశోద హాస్పిటల్ 2019- 20లో బీజేపీకి రూ.ఐదులక్షలు విరాళమిస్తే, 2020 డిసెంబర్‌లో జరిగిన ఐటీ దాడుల అనంతరం 2021- 22లో పది కోట్ల రూపాయల విరాళం ఇచ్చింది. హెటిరో కంపెనీ, లలితజ్యువెలర్స్, అరబిందో రియాలిటీ, ఇన్ఫ్రాస్ట్రక్చర్, సింటెక్స్, హల్దిరామ్స్ వంటివారందరూ దాడుల అనంతరం పెద్ద మొత్తంలో చెల్లించుకున్నట్లు వివరాలు బయటపడ్డాయి. కొన్ని కంపెనీలు సెలెక్టివ్‌గా అనగా తమ ఇండస్ట్రీ నెలకొల్ప బడిన రాష్ట్రంలో అధికారంలో ఉన్నపార్టీకి, కేంద్రంలో అధి కారంలో ఉన్నపార్టీకి మాత్రమే విరాళాలు చెల్లించుకున్నారు. ఈకోవలో ఆదిత్య బిర్లా గ్రూప్ సంస్థ ఉన్నది. పైన పేర్కొన్న వివరాల ప్రకారం నిధులు సమకూరుస్తున్న ఈకంపెనీలకు వాటిని స్వీకరిస్తున్న రాజకీయ పార్టీలకు లోపాయికారి ఒప్పందం ఉన్నది. ఇంతటి అవినీతి భాగోతాన్ని తప్పుపట్టిన సుప్రీంకోర్టుకు శ్రీ కృష్ణుడు, సుధాముడు అంటూ పురాణాలలోని వాస్తవ అర్థాన్ని వక్రీకరించే ఆపాదిస్తాడు మన 'విశ్వగురు'. కంపెనీలు రాజకీయపార్టీలకు సమర్పించే నిధులపై సీలింగు లేకుండా ఆయా నిధుల వివరాలు ప్రజలకు తెలియకుండా ఉండాలన్న నిబంధనలోనే దురుద్దేశం దాగిఉంది. అందుకే ఈఎన్నికల బాండ్లవిధానం పూర్తిగా అవినీతి ప్రక్రియ, దీనిరద్దు అత్యంత ఆవశ్యకం. ఆ దిశలో ముందడుగు వేసిన సుప్రీంకోర్టు నిర్ణయం అభినందనీయం.

> కోవిడ్ కాలంలో మద్యం షాపులు లేవు. నూటికి 90 శాతం జనం తాగడం మానేశారు. బతుకు సాగలేదా? జైలులో మందు దొరకదు కదా? తాగకుండానే ఉన్నారు. అయితే ఈ మందు అవసరం ఎవరికి? లాభాలు ఆశించే వారికి. అందుకే మోడీ ప్రభుత్వం కోవిడ్ సమయంలో పాఠశాలలు తెరవడానికి అనుమతి ఇవ్వలేదు. కానీ మద్యం షాపులను తెరవడానికి అనుమతించింది.

మన రాష్ట్రంలో శాసనసభ ఎన్నికలు అయ్యాయి. మరి కొద్ది రోజుల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. ప్రజలను ఏడిపిస్తున్న మద్యం సమస్య మీద ఆయా రాజకీయ పార్టీల వైఖరి మాత్రం ఎటూ తేల్చకుండానే ఉన్నట్టు కనిపిస్తోంది. మద్యాన్ని నియంత్రించడానికి, తాగుడు తగ్గించడానికి, పేదరికం నుండి బయటపడేందుకు, ఆరోగ్యాన్ని కాపాడేందుకు, నేరాలు తగ్గించేందుకు, మహిళల గౌరవాన్ని కాపాడేందుకు, రాజకీయ పక్షాలు ఆలోచిస్తాయా? లేక ప్రజల్ని పీడించి మరింత లాభాలను సంపాదించుకునే ప్రయత్నం చేస్తాయా? మద్యం సమస్య మీద అనేక అధ్యయనాలు జరిగాయి, జరుగుతున్నాయి. మన దేశంలో ప్రతి ముగ్గురిలో ఒకరికి తాగుడు అలవాటు ఉందట. దీనిని కనీసం రెట్టింపు చేయడం ద్వారా తమ లాభాలను రెట్టింపు చేసుకోవచ్చని బహుళజాతి కంపెనీలు, దేశీయ కంపెనీలు ప్రయత్నం చేస్తున్నాయి. తమ మార్కెట్‌ను పెంచుకునేందుకు వివిధ రూపాల్లో

మద్యంపై రాజకీయపక్షాల దారెటు?



దొంగ చాటుగా ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాయి. ఇక ప్రజల ఓట్లతో అధికారంలోకి వస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మద్యం అమ్మకాల ద్వారా తమ బహుళ ప్రయోజనాల్ని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నాయి. ప్రజలు నుండి ఒత్తిడి వచ్చినప్పుడు వాటిని తగ్గించడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు నటిస్తున్నాయి. అక్కడో ఇక్కడో కొన్ని మినహాయింపులు తప్ప! మద్యపానం వల్ల జీడీపీలో 1.45 శాతం ఆర్థికంగా దేశం నష్టపోతుందని ఇటీవల వచ్చిన ఒక అధ్యయనం తెలియజేసింది. మొత్తం బడ్జెట్‌లో ఆరోగ్యం కోసం కేటాయిస్తున్నది 1.1 శాతం మాత్రమే! అంటే ఆరోగ్య సంరక్షణకు కేటాయిస్తున్న దాని కంటే మద్యం తాగడం వల్ల దేశం ఆర్థికంగా నష్టపోతున్నది ఎక్కువ. దీనితో పాటుగా ప్రజల ఆరోగ్యం క్షీణించడంలో, పేదరికం పెరగడంలో, హింస పెరగడంలో కూడా దీని ప్రభావం ఎంత ఉందో ఈ అధ్యయనాలు తెలియచేస్తున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ మద్యం తాగడాన్ని తగ్గించడానికి అన్ని చర్యలు చేపట్టాలని సూచన చేసింది. ధరలు పెంచడం ద్వారా మద్యం తాగుడును నిరుత్సాహపరచాలని కూడా ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫార్సు చేసింది.

1990 నుండి 2017 వరకు 189 దేశాల్లో మద్యం ఎంత తాగుతున్నారు, దాని ప్రభావం ఎంత ఉందని ఇటీవల ఒక అధ్యయనం చేశారు. మన దేశంలో ఈ కాలంలో 38 శాతం తాగడం పెరిగిందని తేలింది. అంతే కాదు, తాగుతున్న మోతాదు కూడా పెరిగింది. మన దేశంలో గతంలో ఏడాదికి ఒక వ్యక్తి 4.3 లీటర్ల లిక్కర్ తాగేవాడు. ఇప్పుడు 2017 నాటికి 5.9 లీటర్ల మద్యం తాగుతున్నారు. కర్నాటక రాష్ట్రంలో సగటున ఒక మనిషి తొమ్మిది లీటర్లు తాగుతున్నారు. కేరళలో ఎన్.హెచ్.ఎఫ్.ఎస్-4, 2015-16 సర్వే ప్రకారం 37 శాతం పురుషులకు 1.6 శాతం మహిళలకు మద్యం తాగే అలవాటు ఉండగా ఎన్.హెచ్. ఎఫ్ ఎస్-5, 2019- 20 సర్వే ప్రకారం 19.9 శాతం పురుషులు, 0.2 శాతం మహిళలు (సగటున 9.4 శాతం) తాగుతున్నట్లు తేలింది. అంటే గణనీయంగా తగ్గింది. పశ్చిమ బెంగాల్‌లో తాగుడు చాలా ఆందోళనకరంగా పెరిగిందని పేర్కొన్నారు. 29 శాతం మంది తాగుతుండగా చిన్నపిల్లల్లో నాలుగు శాతం తాగుతున్నారట. మన రాష్ట్రంలో 11.5 శాతం (15-49 వయస్సులో పురుషులు 31.2 శాతం) జనం తాగుతూ ఉండగా జాతీయ సగటు 9.9 శాతం (మగవాళ్లు 22 శాతం) ఉంది. బీహార్‌లో 1.7 శాతం మంది మాత్రమే ప్రస్తుతం తాగుతున్నారు. ఈ వివరాలు చూసినప్పుడు దేశవ్యాప్తంగా తాగుడు అలవాటు ప్రజలందరిలో ఒకే విధంగా లేదు. ఆయా రాష్ట్రాల్లో లిక్కర్ కంపనీలు, మాఫియా, అందుకు సహకరించే ప్రభుత్వాలు లిక్కర్ పెంపుదలకు ప్రధానమైన కారణాలుగా కనిపిస్తున్నాయి.

కేరళలో "విముక్తి" పేరుతో తాగుడికి వ్యతిరేకంగా కుడుంబశ్రీ, ఆరోగ్య శాఖ కలిసి ఒక విస్తృతమైన ప్రచారం చేపట్టాయి. అందులో మహిళలు, యువకులు ప్రధాన భాగస్వాములుగా ఉన్నారు. ఆ రాష్ట్రంలో 2016లో ఒక విధానంగానే 730 బార్లను మూసివేయడం జరిగింది. బీహార్, గుజరాత్, నాగాలాండ్, లక్షద్వీప్‌లలో మద్యనిషేధం ఉంది. గుజరాత్ గిఫ్ట్ సిటీలో ఇటీవల మద్యాన్ని అనుమతించారు.

ఆనాడు మహిళలు వ్యక్తం చేసిన నిరసన ఫలితంగా బీహార్‌లో 2016 ఎన్నికలవేళ నితీష్ కుమార్ మద్య నిషేధం హామీ ఇచ్చి ఎన్నికల తర్వాత కఠినంగా అమలు చేశారు. ఫలితంగా భారీగా తాగే వారి సంఖ్య తగ్గడానికి కారణమైంది. అందుకు భిన్నంగా పశ్చిమ బెంగాల్‌లో అమెజాన్, బిగ్ బాస్కెట్ కంపెనీల ద్వారా హోమ్ డెలివరీ ప్రవేశపెట్టారు. చిన్న చిన్న పాకెట్లు, చిన్న సీసాలలో ప్యాకేజీ ద్వారా చేయడం కూడా విస్తరించడానికి కారణమైంది. భారత రాజ్యాంగం ఆర్టికల్ 47లో మద్య నియంత్రణ లక్ష్యంగా ప్రకటించింది. అందుకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం విధి విధానాలు రూపొందించి అమలుచేయాలి. కానీ బహుళజాతి కంపెనీలతో సంబంధాలే కేంద్ర ప్రభుత్వానికి ప్రధానం అయ్యాయి. లాభాల కోసం స్వదేశీ, విదేశీ పొత్తులతో మురిసిపోతున్నారు. పాలకుల మద్దతుతో మద్యం వ్యాపారం విస్తరిస్తున్నది. మద్యం ద్వారా ఆదాయం లేకపోతే ప్రభుత్వాలు ఎలా నడుస్తాయంటూ జనాన్ని నమ్మించ చూస్తున్నారు.

కోవిడ్ కాలంలో మద్యం షాపులు లేవు. నూటికి 90 శాతం జనం తాగడం మానేశారు. బతుకు సాగలేదా? జైలులో మందు దొరకదు కదా? తాగకుండానే ఉన్నారు. అయితే ఈ మందు అవసరం ఎవరికి? లాభాలు ఆశించే వారికి. అందుకే మోడీ ప్రభుత్వం కోవిడ్ సమయంలో పాఠశాలలు తెరవడానికి అనుమతి ఇవ్వలేదు. కానీ మద్యం షాపులను తెరవడానికి అనుమతించింది. మహమ్మారిగా మారిన మద్యాన్ని నియంత్రిస్తేనే జనానికి ఆరోగ్యం. నేరాలు తగ్గిం చేందుకు వీలవుతుంది. కుటుంబాలు, ఆ కుటుంబంలో పిల్లలు ఒకరికి మరొకరుగా బతుకు బండి నడుస్తుంది. పేదరికాన్ని ఎదిరించే శక్తి వస్తుంది. ఎన్నికల సందర్భంగా మహిళలు మరోసారి ఆవేదనతో ఆగ్రహంతో గళమెత్తుతున్నారు. మద్య నియంత్రణ చేయలేనివారికి అభివృద్ధి గురించి మాట్లాడే అర్హత ఉందా అన్నది వారి ప్రశ్న!

- డి. రమాదేవి

ఛండీఘర్‌లో ఏం జరిగిందంటే..!



కె.శాంతారావు
9959745723


ఇటీవల జరిగిన పంజాబ్, హర్యానా రాష్ట్రాల ఉమ్మడి రాజధాని ఛండీఘడ్ నగర మేయర్ ఎన్నికల్లో బీజేపీ బరితెగించింది. ఆ నగరంలో ప్రజల చేత ఎన్నికైన 35 మంది కౌన్సిలర్‌లు, ఒక పార్లమెంటు సభ్యుడు కలిసి నగర మేయర్‌ను ఎన్నుకోవాలి. ఎవరు ఎటుపక్క నిలిపి చేతులెత్తించినా చాలు. ఎన్నిక సుస్పష్టంగా తేలిపోతుంది, తెలిసిపోతుంది. బడిపిల్లలకైనా ఈ ప్రజాస్వామ్య ఎన్నిక ప్రక్రియ చాలా సులువుగా అర్థమైపోతుంది. కానీ బీజేపీ మసి పూసి మారేడుకాయ చేయదలచింది. ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్‌గా వ్యవహరించిన బీజేపీ వ్యక్తి ఎలాగైనా సరే తమ పార్టీ మనిషినే మేయర్‌గా చేయాలని భావించాడు. అందుకే కావాలని రహస్య బ్యాలెట్ ఓటింగ్ పద్ధతికి పట్టు బట్టాడు. చేసేదిలేక కౌన్సిలర్‌లు ఆ ఓటింగ్ పద్ధతిలో పాల్గొన్నారు. తమకు నచ్చిన వ్యక్తికి అనుగుణంగా ఓట్లేసారు ఎన్నిక ముగిసాక, తీరా బాక్స్‌లోని ఓట్లు తీసి లెక్కవేస్తూ ఎనిమిది మంది కాంగ్రెస్ కౌన్సిలర్‌ల ఓట్లు చెల్లవని అడ్డంగా గీతలు గీసాడు. మిగిలిన చెల్లిన ఓట్లలో ఆప్-కాగ్రెస్ ఉమ్మడి అభ్యర్థికన్నా బీజేపీ అభ్యర్థికే నాలుగు ఓట్లు అధికంగా వచ్చాయని డిక్లేర్ చేసాడు. సి.సి.కెమెరాలతో సహా అందరూ చూస్తుండగానే ఈ ఘోరం జరిగిపోయింది. బీజేపీ నామినేటెడ్ కౌన్సిలర్ అనిల్ మాసి రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించి ఈ ఘోరానికి ఒడిగట్టాడు. తన బీజేపీ అభ్యర్థి మనోజ్ శంకర్ మేయర్ అని ప్రకటించాడు.

పట్టపగలు, నగరం నడిబొడ్డున జరిగిన 'ప్రజాస్వామ్య హత్యగా' ఈ ఘటనను రాజకీయ పరిశీలకులు అభి వర్ణించారు. ఎందుకంటే ఇది పొరపాటున జరిగిన తంతుకాదు. అత్యంత హేయమైన బీజేపీ లజ్జాకర బరితెగింపు గానే దానిని భావించాలి. కనుకనే ఈ కేసు ఘటన పూర్వాపరాలు నిశితంగా పరిశీలించిన సుప్రీం ధర్మాసనం భారత ఎన్నికల వ్యవస్థకు ఇది 'మాయని మచ్చ' అంటూ తీవ్రంగా వ్యాఖ్యానించింది. అక్కడితో ఆగకుండా తాజా మలి తీర్పులో... తొత్తడంగా మార్చిన ఆ బీజేపీ అభ్యర్థి ఎన్నిక చెల్లదంటూ, ఆప్ - కాంగ్రెస్ ఉమ్మడి అభ్యర్థి కులదీప్ కుమారే సిసలైన విజేత మేయర్‌గా ప్రకటించింది.

సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన ఈ తీర్పు భారత ప్రజాస్వామ్య ప్రస్థానంలో నిస్సందేహంగా ఓ మైలురాయి వంటిదని న్యాయనిపుణులు అంటున్నారు. ఓ సాధారణ నగర మేయర్ ఎన్నికే కావచ్చు కానీ బీజేపీ దుర్మార్గ వైఖరికి ఇది చెంపపెట్టుగా నిలిచింది.ఇందుకోసం భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 142 కింద తనకు దఖలైన విశిష్ట అధికారాలను సుప్రీం ఉపయోగించుకున్నది. రిటర్నింగ్ అధికారి చెల్లనివిగా ప్రకటించిన ఎనిమిది ఓట్లను సుప్రీం స్వయంగా పరిశీలించింది. అవి ఎందుకు చెల్లుబాటు కాలేదు? కారణం ఏమిటి? అని సుప్రీం ఆ రిటర్నింగ్ అధికారిని నిగ్గదీసింది. సదరువ్యక్తి సరైన సమాధానం చెప్పక నీళ్ల నమలడంతో, ఆ ఓట్లు వాస్తవంగా కులదీప్‌కుమార్‌కే పడ్డట్టు తేల్చి విజేతగా ఆ కులదీప్‌నే ప్రకటిస్తూ విస్పష్ట తీర్పునిచ్చింది.

ఎన్నికల విషయంలో రిటర్నింగ్ అధికారి పాత్ర సక్రమంగా లేదని పేర్కొంటూ ఆ వ్యక్తి శిక్షార్హుడు అని ప్రకటించింది. ప్రజాస్వామ్య విలువలు కాపాడవలసిన బాధ్యత తమవంటి ధర్మాసనాల పైన ఉన్నదని ఆ తీర్పులో నొక్కి చెప్పింది కూడా, అందుకే ఇదో చారిత్రక తీర్పుగా విపక్షాలు భావిస్తున్నాయి. ఎన్నికను తొత్తడం చేయడం ఓ తప్పు అయితే, అంతా నిజమే చెప్తానని అబద్ధం చెప్పడం మరో నేరమని సుప్రీం తెలిపింది. తప్పు జరిగింది కౌంటింగ్‌లో కనుక మొత్తం ఎన్నికల ప్రక్రియనే తిరగతోడాల్సిన అవసరంలేదని చెబుతూ బీజేపీ కుట్రను వమ్ము చేసింది. చివరి అంకంలో ఆ రిటర్నింగ్ అధికారి చేసిన కుట్రను సరిదిద్దేందుకే తాము నేరుగా జోక్యం చేసుకుని నిజమైన విజేతను ప్రకటించాల్సి వచ్చిందని వివరించింది.

చట్టాలకు దొరక్కుండా యధేచ్ఛగా తప్పించుకు తిరగవచ్చని, ఒకవేళ దొరికినా తమని ఎవ్వరూ ఏమి చేయలేరనే తెంపరితనాన్ని ఈ తీర్పు పటాపంచలు చేసింది. కనుకనే బీజేపీ ఈ విషయంలో తేలుకుట్టిన దొంగలా మిన్నకుండి పోయింది. కెమెరా క్లిప్పింగ్‌ల ఆధారంగానే సుప్రీం ఈ తీర్పును వెల్లడి చేసింది. ఏ దేశ ప్రజా స్వామ్య వ్యవస్థకైనా ఎన్నికల ప్రక్రియే ప్రాణాధారం. అయితే ఆ ప్రక్రియ స్వేచ్ఛగా, నిస్పక్ష పాతంగా, పారదర్శకంగా జరగ కుంటే ఆ ప్రక్రియకు అర్థమే ఉండదు. అందుకే మహాకవి శ్రీశ్రీ ఏనాడో ప్రశ్నించాడు. 'దొంగనోట్ల దొంగ ఓట్ల రాజ్యమొక రాజ్యమా? అని. ప్రస్తుతం ఈ.వి.ఎం. మిషన్‌ల ఓటింగ్ పద్ధతి కూడా లోపభూయిష్టంగా జరుగుతున్నదని ఇటీవల న్యాయవాదులు, మేధావులు, ప్రజాస్వామికవాదులు పెద్దఎత్తున ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే.



> చట్టాలకు దొరక్కుండా యధేచ్ఛగా తప్పించుకు తిరగవచ్చని, ఒకవేళ దొరికినా తమని ఎవ్వరూ ఏమి చేయలేరనే తెంపరితనాన్ని ఈ తీర్పు పటాపంచలు చేసింది. కనుకనే బీజేపీ ఈ విషయంలో తేలుకుట్టిన దొంగలా మిన్నకుండి పోయింది. కెమెరా క్లిప్పింగ్‌ల ఆధారంగానే సుప్రీం ఈ తీర్పును వెల్లడి చేసింది. ఏ దేశ ప్రజా స్వామ్య వ్యవస్థకైనా ఎన్నికల ప్రక్రియే ప్రాణాధారం. అయితే ఆ ప్రక్రియ స్వేచ్ఛగా, నిస్పక్ష పాతంగా, పారదర్శకంగా జరగ కుంటే ఆ ప్రక్రియకు అర్థమే ఉండదు. అందుకే మహాకవి శ్రీశ్రీ ఏనాడో ప్రశ్నించాడు. 'దొంగ నోట్ల దొంగ ఓట్ల రాజ్య మొక రాజ్యమా? అని.

పెత్తందారీ భూస్వామ్య వ్యవస్థలో ఎన్నికల ఘర్షణలు, హింస, రిగ్గింగ్ సర్వసాధారణమవుతుంది. అలాగే పెట్టుబడీదారీ పార్లమెంటు వ్యవస్థలో ఓటు సరుకై పోతుంది. అమ్ముకోవడం కొనుక్కోవడం షరామామూలే. ఎమ్మెల్యే, ఎంపీ ఓట్లతో సహా... ఇవన్నీ మనకు చేదు అనుభవాలే. అయినా ఉన్నంతలో ప్రతి ఒక్కరం శక్తి మేరకు ప్రజాస్వామ్య పరిరక్షణకు నడుం కట్టాల్సిందే. మనిషిని మనిషిగా గుర్తించడం, అట్టడుగు ప్రజల మానవ హక్కులను కాపాడటం, ప్రజాస్వామ్యంలో అంతర్భాగమని భావిచడం కొందరు నేతల స్పృహలోనే ఉండదు గాక ఉండదు. ఎందుకంటే వారు నేతల ముసుగులో జీర్ణించుకుపోయిన నియంతలని గ్రహించాలి.అందుకే ప్రజాస్వామ్యం గురించి మన భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ చెప్పిన మాటలు గుర్తుకు తెచ్చుకోవాలి.

అధిక సంఖ్యాకులైనవారు అతి నికృష్ట పరిస్థితుల్లో జీవిస్తున్నప్పుడు ఏ కొద్దిమందో భోగ భాగ్యాలను అను భవించడం ప్రజాస్వామ్యం కాదు. అధిక సంఖ్యాకులు ఏ హక్కులూ లేకుండా కుమిలిపోతూ ఉన్నప్పుడూ బహుకొద్ది మంది సమస్త హక్కులను అనుభవించడం ప్రజాస్వామ్యం కాదు. ప్రజాస్వామ్యం అంటే ప్రజలందరూ సామాజిక, ఆర్థిక రంగాలలో సమానమైన హక్కులు, బాధ్యతలు కలిగి ఉండటం. ప్రజాస్వామ్యం అంటే అభివృద్ధి చెందడానికి గల అవకాశాలు అందరికీ అందుబాటులో ఉండటం.

-కానీ బీజేపీ పాలన తద్విరుద్ధంగా సాగుతున్నది. కనుకనే 'సేవ్ డెమోక్రసీ సేవ్ ఇండియా' (ప్రజాస్వామ్యాన్ని కాపాడండి, దేశాన్ని కాపాడండి) అన్న నినాదం సర్వత్రా వినిపిస్తున్నది. ఒక ప్రజా ఉద్యమంలా వ్యాపిస్తున్నది.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం
మంగళవారం | ఫిబ్రవరి 27, 2024 | www.navatelangana.com



తమ్మినేనిని పరామర్శించిన కందాడ



నవతెలంగాణ-ఖమ్మంరూరల్

సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఇటీవల అనారోగ్యానికి గురైన విషయం తెలిసిందే. మండలంలోని తెల్దారుపల్లి గ్రామంలో సోమవారం తమ్మినేనిని ఆంధ్రప్రదేశ్ సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కందాడ మురళి పరామర్శించారు. ఈ సందర్భంగా గత స్మృతులను నెమరు వేసుకున్నారు. తమ్మినేని త్వరగా కోలుకొని ప్రజా జీవితంలోకి రావాలని మురళి ఆకాంక్షించారు. అనంతరం ఇటీవల ప్రమాదానికి గురైన సిపిఎం సీనియర్ నాయకురాలు బత్తుల హైమావతి, సిపిఎం సీనియర్ నాయకులు పి.సోమయ్య సతీమణి సుశీలమ్మను పరామర్శించి వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వీరంతా త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిం చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు పి.సోమయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న లారీ.. మహిళ మృతి

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

ఆటోను లారీ ఢీ కొట్టగా తల్లి మృతి చెందగా, కుమారుడికి గాయాలైన సంఘటన మండల పరిధిలోని కోదాడ క్రాస్ రోడ్ వద్ద సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పొన్నెకల్లు గ్రామానికి చెందిన కొట్టే లక్ష్మీ (47) అనారోగ్యం వల్ల తన కుమారుడు రాజేశ్‌తో కలిసి వైద్య పరీక్షల కోసం ఖమ్మం వెళ్లారు. ఖమ్మం నుంచి తమ ఆటోలో ఇంటికి వస్తుండగా మార్గ మధ్యలో కోదాడ క్రాస్ రోడ్ వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. దీంతో లక్ష్మీ అక్కడికక్కడే మృతిచెందగా, రాజేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ సురేశ్ సందర్శించారు.

డబ్ల్యూటీవో నుండి భారత్ బయటకు రావాలి

ఖమ్మంలో వాహనాలతో ర్యాలీ



నవతెలంగాణ-ఖమ్మం

డబ్ల్యూటీవో (ప్రపంచ వాణిజ్య సంస్థ) నుండి భారతదేశం బయటికి రావాలని, నరేంద్ర మోడీ ప్రభుత్వం రైతుల డిమాండ్స్ వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి వై ప్రకాష్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు సోమవారం ఖమ్మం జిల్లా కేంద్రంలో తెలంగాణ రైతు సంఘం, అఖిల భారత రైతుకూలీ సంఘం, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ద్విచక్ర వాహనాలతో పెవిలియన్ గ్రౌండ్ నుంచి ఇందిరా నగర్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్, రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి వై ప్రకాష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వ్యవసాయరంగాన్ని విదేశీ కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు కోరుకుంటున్నదని అన్నారు. డబ్ల్యూటీవో నుండి భారతదేశం బయటకు రావాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 26న అబుదాబీలో డబ్ల్యూటీవో కాన్ఫరెన్స్ ప్రారంభం కానుందని, అదే రోజు క్విట్ డబ్ల్యూటీవో డేగా పాటించాలని పిలుపునిచ్చిందని, రైతులకు ఎంఎస్‌పీని మంజూరు చేయకుండా ప్రజా పంపిణీ వ్యవస్థను ఉపసంహరణ కోసం భారత ప్రభుత్వాన్ని బలవంతం చేయడంతో పాటు ప్రయోజనాన్ని నేరుగా డబ్బుగా (నగదు) బదిలీ చేయాలని, భారత దేశంపై డబ్ల్యూటీవో ఒత్తిడి చేస్తున్నదని, ఈ రెండు ప్రతిపాదనలు రైతులకు, పేద ప్రజలకు మరియు ఆహార భద్రతకు మరియు భారతదేశ సార్వభౌమత్వానికి హానికరం అని అన్నారు. క్విట్ డబ్ల్యూటీవో డిమాండ్ రైతులతో పాటు ప్రజలు బలపర్చాలి అన్నారు. ఢిల్లీ సరిహద్దు ప్రాంతంలో రైతుల నిరసన స్థలంలో రైతుల ట్రాక్టర్లను పోలీసులు ధ్వంసం చేశారన్నారు. రైతులపై అణచివేత ప్రయోగించడం, రైతు ఉద్యమాన్ని ఏకాకిని చేసి విభజించేందుకు కుట్ర పన్నారని, ఈ విభజనతో ఎన్నికల ప్రయోజనం పొందేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. అలాగే మృతుల కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారం ఇవ్వాలని, పాడైన 100 ట్రాక్టర్ల మరమ్మతు ఖర్చులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం దిగి రాకపోతే మార్చి 14న ఛలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తామని అన్నారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మేరుగు సత్యనారాయణ, ఉపాధ్యక్షులు ఎర్రా శ్రీనివాసరావు, తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్‌కె మీరా, వాసిరెడ్డి ప్రసాద్, చెరకు మల్లి కుటుంబరావు, కుసుపూడి మధు, సంక్రాంతి నర్సయ్య యనమద్ది రామకృష్ణ, బోడపట్ల సుదర్శన్, గాలి అంజయ్య, ప్రవీణ్, రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు మందుల రాజేంద్రప్రసాద్, ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

పాలేరు పాత కాల్వకు నీటిని విడుదల చేయాలి

- వేలాది ఎకరాల వరి పంటలను కాపాడాలి
- మంత్రి ఇచ్చిన హామీలను నిలుపుకోవాలి
- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు బండి రమేష్



నవతెలంగాణ- కూసుమంచి

పాలేరు జలాశయం నుండి పాత కాలువకు నీటిని వెంటనే విడుదల చేసి, పాలేరు పాత కాలువ ఆయకట్టు పరిధిలోని వేలాది ఎకరాల వరి పంటలను కాపాడాలని, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నిలుపుకొని, రైతాంగాన్ని కాపాడాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు బండి రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని పాలేరు పాత కాలువ పరిధిలోని ఆయకట్టు రైతులను ఆయన కలిశారు. అనంతరం మండలంలోని మల్లేపల్లి, జక్కేపల్లి, పెరకసింగారం తదితర గ్రామాలలో రైతులతో కలిసి నీరు లేక ఎండిపోయిన వరి పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పెరకసింగారం గ్రామంలో ఆయన మాట్లాడుతూ... నేడు కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలతో రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. ఈ నష్టంతో పాటు చేతికి వచ్చిన వరి పంట పొలాలు నీళ్ల లేక ఎండిపోవడంతో రైతులకు తీవ్ర ఆర్థిక నష్టం జరుగుతుందన్నారు. దీంతో రైతులు మనోవేదనకు గురై, ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే పాలేరు జలాశయానికి ఎస్సారెస్పీ నీళ్లను తరలించి, ఆ నీటితో పాలేరు జలాశయం నుండి పాలేరు పాత కాలువకు నీటిని విడుదల చేసి, పాత కాల్వ పరిధిలోని వేలాది ఎకరాల రైతులు పంటను కాపాడాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతి ఎకరా పంటకు ఇప్పటికే 20 నుంచి 25 వేల రూపాయల పెట్టుబడులు అయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని, ఒక తడి నీళ్ల వస్తే తమ పంటలను కాపాడుకుంటామని రైతును మొరపెడుతున్నారని, రైతే రాజు అనే విషయాన్ని ఈ ప్రభుత్వం గుర్తుంచుకొని, తక్షణమే కాలువ ద్వారా నీటిని విడుదల చేసి రైతాంగాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు మల్లెల సన్మతరావు, యడవల్లి రమణారెడ్డి, రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు తోటకూరి రాజు, బిక్కసాని గంగాధర్, ముకుందరెడ్డి, మాధవరావు, ఉపేందర్, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మూడు గన్యా నాయక్, మండల నాయకులు కర్ణబాబు, ఆయా గ్రామాల పరిధిలోని సర్పంచులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో అంగన్‌వాడీ భవనం

- రైతు వేదికలోకి అంగన్వాడీ కేంద్రం తరలింపు



నవతెలంగాణ - బోనకల్

మండల పరిధిలోని గోవిందాపురం (ఏ) గ్రామంలోని అంగన్వాడి భవనం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ప్రతిరోజు అంగన్వాడి కేంద్ర టీచర్, అంగన్వాడికి హాజరవుతున్న చిన్నారులు భయం నీడలో కాలం గడుపుతున్నారు. కాంగ్రెస్ నాయకులు భాగం నాగేశ్వరరావు తండ్రి భాగం నాయుడు, చెల్లెలు బాలినేని విమల జ్ఞాపకార్థం నిర్మించిన రైతు వేదికలోకి అంగనవాడీ కేంద్రాన్ని సోమవారం తరలించారు. ఈ సందర్భంగా భాగం నాగేశ్వరరావు చిన్నారులకు హార్లిక్స్, పండ్లు పంపిణీ చేశారు. గది పైపెచ్చులు ఊడి పడుతుండటంతో చిన్నారులు భయాందోళనకు గురవుతున్నారనీ అంగన్వాడి టీచర్ లక్ష్మీ తెలిపారు. అంగన్వాడీ కేంద్రం పూర్తిగా శిథిలావస్థలో ఉందని, గతంలో పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. దీంతో చేసేదేమీ లేక కాంగ్రెస్ నాయకులు భాగం నాగేశ్వరరావును ఆశ్రయించగా వారు నిర్మించిన రైతు వేదికలో అంగన్వాడీ కేంద్రాన్ని నిర్వహించుకోవడానికి అంగీకరించారని అంగన్వాడీ టీచర్ లక్ష్మీ తెలిపారు. అంగన్వాడీ భవన మరమ్మత్తుల కోసం నిధులు మంజూరు చేయాలని ఆళ్లపాడు ఎంపిటిసి పారా శ్రీదేవి భట్టి విక్రమార్కును కోరారు. 2019లో సుమారు నాలుగు లక్షల రూపాయల ఖర్చుతో సొంత స్థలంలో ఆయన ఈ వేదికను నిర్మించారు. ప్రస్తుత రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఈ రైతు వేదికను నాడు ప్రారంభించారు. నాటి నుండి గ్రామ ప్రజలు పలు విధాలుగా ఈ వేదికను ఉపయోగించుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో ఆళ్లపాడు, గోవిందాపురం ఏ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంత విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ- ముదిగొండ

ఈనెల 27 మంగళవారం ఖమ్మంలో జిల్లా స్థాయిలో జరిగే ఎస్ఎఫ్ఐ టాలెంట్ టెస్ట్‌కు మండలం నుండి ఎంపికై విజేతలుగా నిలిచిన విద్యార్థుల వివరాలను ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పోనుకుల సుధాకర్ సోమవారం వెల్లడించారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ముదిగొండ మండల కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 15న మండల స్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు ఈసందర్భంగా ఎస్ఎఫ్ఐ ఖమ్మం జిల్లా అధ్యక్షులు పోనుకుల సుధాకర్ మాట్లాడుతూ వచ్చే నెలలో జరగనున్న పబ్లిక్ పరీక్షలకు సిద్ధం చేసేందుకే ఎస్ఎఫ్ఐ పదో తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించామన్నారు.

మండల స్థాయి టాలెంట్ టెస్ట్ విజేతలు వీరే.

1.చందు 92 మార్కులు, సాయి మెరిట్స్ స్కూలు. (కమలాపురం), 2 మనోశ్రీ, మార్కులు 70, జిల్లా పరిషత్ హైస్కూల్ (ముదిగొండ), 3.రమ్య మార్కులు 65, జడ్పీహెచ్ఎస్ (మేడపల్లి), 4.డి.ఇందు, మార్కులు 62, (యడవల్లి) స్కూల్, 5.ఉమానందిని మార్కులు 60, (వల్లభి) గిరిజన బాలికల పాఠశాల.

క్రైస్తవులపై మతోన్మాదుల దాడులను ఖండించండి

- ఎన్‌సీసీ రాష్ట్ర అధ్యక్షుడు అలవాల కరుణాకర్



నవతెలంగాణ-సత్తుపల్లి

క్రైస్తవులపై మతోన్మాదులు జరుపుతున్న దాడులను ప్రజాస్వామికవాదులు తీవ్రంగా ఖండించాలని నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ (ఎన్‌సీసీ) రాష్ట్ర అధ్యక్షుడు అలవాల కరుణాకర్ కోరారు. సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధి ఎన్టీఆర్‌నగర్ క్రీస్తు మందిరంలో ఆ కౌన్సిల్ ముఖ్య నాయకుల సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశంలో కరుణాకర్ ప్రధానోపన్యాసం చేశారు. దేశం ప్రమాదకర పరిస్థితిలో ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మతతత్వ వాదుల వల్ల ప్రజలకు ప్రమాదం పొంచి ఉందన్నారు. లౌకిక రాజ్యమైన మనదేశంలో ఎవరికి ఇష్టం వచ్చిన దేవుళ్లను వారు పూజించుకోవచ్చన్నారు. సర్వమత సౌభాతృత్వంతో అన్ని మతాలకు చెందిన ప్రజలంతా ఐకమత్యంగా ఉండాలన్నారు. తెలంగాణ ప్రజలకు అనుకూలమైన ప్రభుత్వం ఏర్పడిన విధంగానే కేంద్రంలో కూడా ప్రజలకు అనుకూలంగా ఉండే ప్రభుత్వం ఏర్పడటానికి క్రైస్తవులు సిద్ధపడాలన్నారు. ఎన్‌సీసీ రాజకీయ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి సామేలు మాట్లాడుతూ మతతత్వ పార్టీలు మనకొద్దన్నారు. ప్రజలందరిని సమానంగా గౌరవించే ప్రభుత్వం మనకి కావాలన్నారు. ఎన్‌సీసీ మండల అధ్యక్షుడు రవికిరణ్ పాల్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మీడియా వింగ్ రాష్ట్ర అధ్యక్షుడు కనకపూడి నాగార్జున, మండల గౌరవాధ్యక్షుడు ఎస్ యాకోబు, కొత్తపల్లి ప్రభాకర్, కె బాలప్రసాద్ పాల్గొన్నారు.

ఆర్‌జి2 ఐటి కంపెనీకి 32 మంది ఎస్బిఐటి విద్యార్థుల ఎంపిక



నవతెలంగాణ- ఖమ్మం

ప్రముఖ బహుళజాతి సంస్థ ఆర్‌జి2 ఐటి సొల్యూషన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి 32 మంది ఎస్‌బీఐటీ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. కార్పొరేట్ డెవలప్మెంట్ ట్రైనీ ఉద్యోగాల కోసం నిర్వహించిన ఈ డ్రైవ్‌కు 168 మంది విద్యార్థులు హాజరయ్యారని ఆయన వెల్లడించారు. వీరిలో 32 మంది విద్యార్థులు తుది పరీక్షలో విజేతలుగా నిలిచి ఉద్యోగార్హత సాధించినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు వార్షిక ఆదాయం 3.5 లక్షల రూపాయల వేతనం లభిస్తుందని అన్నారు. భవిష్యత్తులోను తాము ఈ రకమైన ప్లేస్మెంట్లు సాధించేలా విద్యార్థులను అన్ని రంగాలలో నైపుణ్యం కలవారుగా తయారు చేస్తున్నామన్నారు. దీని కోసం అవసరమైన శిక్షణలతో పాటు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అంది పుచ్చుకొనేలా అన్ని రకాల చర్యలను తీసుకుంటునట్లు తెలిపారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి. ధాత్రి మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు కార్పోరేట్ ట్రైనీగా ఎంపిక కావడం గర్వకారణం అని, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ప్రవేశ పరీక్షలలో వారు రాణించడం కార్పోరేట్ రంగానికి తగిన విధంగా వారు తర్ఫీదు పొందటం అభినందనీయమన్నారు. మేనేజ్మెంట్, అధ్యాపక బృందంల పర్యవేక్షణలో యస్‌బిఐటి. విద్యార్థులు ఈ విద్యాసంవత్సరంలో ఇప్పటి వరకు 210 మంది ఉద్యోగ అర్హత సాధించారని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఆర్థిక మాన్యం వల్ల సాఫ్ట్వేర్ రంగం కుదేలు అయిన ప్రస్తుత తరుణంలో కూడా ఆర్‌జి2 వంటి ఐటి బహుళజాతి కంపెనీలలో తమ విద్యార్థులు రాణించటం హర్షనీయమన్నారు. జావా, పైథాన్ వంటి ఆదరణ కలిగిన కోర్సులలో తమ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణను ఇప్పించటం తద్వారా వారు రికార్డు ప్లేస్మెంట్స్ సాధించటం గర్వకారణం అన్నారు. ఆధునిక కోర్సులను కరికులమ్‌తో పాటుగా ప్రత్యేక తరగతులను నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్.జి.2 ఐటి హెచ్.ఆర్. హెడ్. అవినాష్, సంస్థ ప్రతినిధులు గావిన్, ఇయాన్, అకిలేష్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ కె.అమిత్ బింధాజ్, అకడమిక్ డైరెక్టర్స్, గంధం శ్రీనివాసరావు, ఎవివి. శివప్రసాద్, జి.ప్రవీణ్ కుమార్, జె.రవీంద్రబాబు, యస్.శ్రీనివాసరావు, టి.పి.ఒ. యస్.సవిత, కోఆర్డినేటర్ జి.ప్రభాకర్ పాల్గొన్నారు.



ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల వాల్ పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ- ఖమ్మం

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించే ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్ విపి.గౌతమ్ తెలిపారు. ఈ నెల 26 నుండి మార్చి 2 వరకు జరిగే వారోత్సవాల సందర్భంగా పొదుపు చేయడం అలవాటు చేసుకోండి, ఆర్థిక లాభాలను ఆర్జించండి, సైబర్ స్మార్ట్ అవ్వండి అనే వాల్‌పోస్టర్లను అధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్, శ్రీనివాస రెడ్డి, జిల్లా విద్యా శాఖ అధికారి సోమశేఖర్ శర్మ, జిల్లా పరిషత్ సిఇఓ వినోద్, డిఐఇఓ రవిబాబు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుబ్బారావు, ఏసీపీ సాంబయ్య తదితరులు అధికారులు పాల్గొన్నారు.

జేవీఆర్‌లో 'కమ్యూనికేటివ్ ఇంగ్లీష్' కోర్సు ప్రారంభం



నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంగ్ల విభాగం, టీఎస్‌కేసీ సంయుక్త ఆధ్వర్యంలో కమ్యూనికేటివ్ ఇంగ్లీష్ సర్టిఫికేట్ కోర్సును ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె విజయకుమార్ సోమవారం ప్రారం భించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు భావ వ్యక్తీకరణ నైపుణ్యాలను పెంపొందించుకొనే విధంగా రూపొందించిన ఈ శిక్షణను సద్వినియోగ పర్చుకొని ఆంగ్లభాషపై పట్టు సాధించాలని ఆయన విద్యార్థులను కోరారు. కోర్సు కో-ఆర్డినేటర్ రాంబాబు మాట్లాడుతూ 30 రోజుల పాటు ఈ కోర్సు కొనసాగుతుందని తెలిపారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఆంగ్లభాష నైపుణ్యాల ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకొని ఈ కోర్సును ప్రారంభించడం జరిగిందన్నారు. ఆంగ్ల విభాగాధిపతి డి బంగారి పవర్ ప్రజెంటేషన్ ద్వారా కోర్సు విధి విధానాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జి వీరన్న, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ పానెం రామచంద్రరావు, డాక్టర్ సారంగపాణి, డాక్టర్ ఎం వినోద్‌కుమార్, మధు, డాక్టర్ ఎం మాధవి, డాక్టర్ చెన్నారావు, డాక్టర్ జి విజయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

పరీక్షల సమయానికి అనుగుణంగా బస్సు సౌకర్యాలను కల్పించాలి

- ఆర్టీసీ పిఓ శ్రీహరికి వినతి



నవతెలంగాణ-ఖమ్మం

ఈనెల 28 నుండి ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమవు తున్నందున విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆర్టీసీ పిఓ శ్రీహరికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రవీణ్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణ ప్రాంతాల నుంచి నడిచేటువంటి బస్సు సౌకర్యాలను విద్యార్థుల పరీక్షల సమయానికి అనుగుణంగా నడిచే విధంగా మార్పులు చేయాలని, ఇంటర్మీడియట్ బోర్డు విద్యార్థుల పట్ల నిర్లక్ష్య వైఖరి చూపుతూ నిమిషం లేటైనా పరీక్షలకు అనుమతించ బోమని, నిబంధన పెట్టి విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో రవాణా సౌకర్యాలు సమస్య వలన విద్యార్థులు పరీక్షలకు లేటుగా వచ్చేటువంటి పరిస్థితులు రాకుండా ఆయా ప్రాంతాల నుండి పరీక్షా సమయాలకు అనుగుణంగా బస్సు రోడ్డు సౌకర్యాలను నడపాలని ఎక్కువ మంది విద్యార్థులకు సెంటర్ ఉన్నటువంటి ప్రాంతాలకు ఆయా ప్రాంతాలను గుర్తించి పరీక్షలు అయ్యేంతవరకు బస్సు సౌకర్యాలు కూడా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యురాలు పర్వీన్, జిల్లా కమిటీ సభ్యులు వెంకటలక్ష్మి, నాయకులు వినోద్, తరుణ్ పాల్గొన్నారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- సమీక్షా సమావేశంలో కలెక్టర్ గౌతమ్



నవతెలంగాణ-ఖమ్మం

పదవ తరగతి, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వి.పి.గౌతమ్ అధికారులకు ఆదేశించారు. సోమవారం నూతన కలెక్టర్ సమావేశ మందిరంలో కలెక్టర్ పదవ తరగతి, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలపై విద్యాశాఖ ఇతర శాఖల జిల్లా అధికారులుతో జిల్లా కో-ఆర్డినేషన్ కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 28 నుండి మార్చి 19 వరకు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు జరగనున్నాయని, జిల్లాలో మొత్తం 70 పరీక్షా కేంద్రాలలో 36578 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని అన్నారు. అలాగే మార్చి 18 నుండి ఏప్రిల్ 02 వరకు ఉదయం 9:30 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పదవ తరగతి పరీక్షలు జరగనున్నాయని, ఇందుకోసం జిల్లాలో 97 కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పరీక్షలను నిర్వహించాలని, విధులలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవిబాబు, జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా సుబ్బారావు, విద్యుత్ శాఖ ఎస్ఈ సురేందర్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి వినోద్, డివిజనల్ పంచాయతీ అధికారి ప్రభాకర్, ఏసిపి సాంబయ్య, వైరా, సత్తుపల్లి మున్సిపల్ కమిషనర్లు సి.హెచ్.వేణు, రవిబాబు, పోస్టల్ శాఖ సూపరింటెండెంట్ బి.రవికుమార్, ఆర్‌టిసి డివిజనల్ మేనేజర్, జిల్లా కోశాధికారి సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

3న జిల్లాలో పల్స్‌పోలీయో : కలెక్టర్

మార్చి 3వ తేదీన జిల్లాలో పల్స్‌పోలీయో కార్యక్రమాన్ని అనుబంధ శాఖల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో 0-5 సంవత్సరాల వయస్సు చిన్నారులకు మార్చి 3వ తేదీ వేయనున్న పల్స్‌పోలీయో ఇమ్యునైజేషన్ ఏర్పాట్లపై సోమవారం నూతన కలెక్టరేట్ సమావేశ మందిరంలో వైద్య ఆరోగ్య, సంక్షేమ, గ్రామీణాభివృద్ధి అనుబంధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించి, పలు సూచనలు, ఆదేశాలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 92,511 మంది 0-5 సంవత్సరాల లోపు చిన్నారులను గుర్తించడం జరిగిందని, మార్చి 3వ తేదీన వీరందరికి పల్స్‌పోలీయో ఇమ్యునైజేషన్ కొరకు 4,984 మంది సిబ్బందిని కేటాయించినట్లు తెలిపారు. 26 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 4 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 30 అర్బన్ ప్రాంతాల్లో 252, రూరల్ ప్రాంతాల్లో 843, ట్రైబల్ ప్రాంతాల్లో 151 మొత్తం 1246 కేంద్రాలు, 70 మొబైల్ పాయింట్‌లను ఏర్పాటు చేయడం జరిగిందని, వీటితో పాటు బస్‌స్టాండ్, రైల్వేస్టేషన్, జనసమూహాలు అధికంగా ఉండే ప్రాంతాలలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి ఐదు సంవత్సరాలలోపు చిన్నారులందరికి పోలీయో చుక్కలు వేయాలని సూచించారు. మార్చి 3వ తేదీన జరిగే ఇమ్యూనైజేషన్ కార్యక్రమంలో మిగిలిన చిన్నారులకు మరుసటి రోజు ఇంటింటికి తిరిగి పోలీయో చుక్కలను వేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సన్యాసయ్య, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ సైదులు, డాక్టర్ ప్రమీల, డాక్టర్ ప్రశాంత్, జిల్లా పరిషత్ సి.ఇ. వినోద్, డిఇఓ సోమశేఖర్ శర్మ, డిడి సోషల్ వెల్ఫేర్ సత్యనారాయణ, ఎస్ఇ ట్రాన్స్‌కో సురేందర్, బీసి.వెల్ఫేర్ అధికారి జ్యోతి, జిల్లా సంక్షేమ అధికారి రాంగోపాల్ రెడ్డి, అనుబంధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సీపీఐ(ఎం) సీనియర్ సభ్యుడు దారెల్లి నాగేశ్వరరావు మృతి

నవతెలంగాణ-బోనకల్

మండల పరిధిలోనే చొప్పకట్లపాలెం సీపీఐ(ఎం) సీనియర్ గ్రామ సభ్యుడు దారెల్లి నాగేశ్వరరావు (60) అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. మృతునికి భార్య, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నాగేశ్వరరావు మృతదేహంపై సీపీఐ(ఎం) మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరావు, మండల కమిటీ సభ్యులు బంధం శ్రీనివాసరావు, కిలారు సురేష్, సీపీఐ(ఎం) జెండా కప్పి నివాళులర్పించారు. నాగేశ్వరరావు సీపీఐ(ఎం) నిర్వహించే ప్రతి కార్యక్రమంలో చురుగ్గా పాల్గొనేవాడు. సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఎక్కడ కార్యక్రమాలు జరిగినా ఆ కార్యక్రమాల తప్పకుండా పాల్గొనేవాడు గ్రామంలో పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేశాడు. సీపీఐ(ఎం) అంటే ఎంతో ప్రాణంగా భావించేవాడు. గత కొంతకాలంగా అనారోగ్య సమస్యతో బాధపడుతున్నాడు. పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఈ సందర్భంగా దొండపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ నాగేశ్వరరావు లాంటి వ్యక్తి అకాల మరణం చెందటం ప్రధానంగా చొప్పకట్లపాలెంలో సీపీఐ(ఎం)కి ఎంతో లోటు అన్నారు. నాగేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాప సానుభూతి తెలిపారు. మృతదేహాన్ని మాజీ సర్పంచ్ బూసి వెంకటేశ్వర్లు, సీపీఐ(ఎం) శాఖా కార్యదర్శులు బోయినపల్లి పున్నయ్య, బండి శ్రీనివాసరావు, ఉన్నం వెంకటేశ్వర్లు, చలమల హరి కిషన్‌రావు, పరిటాల కొండలరావు తదితరులు సందర్శించి నివాళులర్పించారు.



నారాయణపురంలో బీఆర్ఎస్‌కు షాక్

- కాంగ్రెస్‌లో చేరిన గ్రామ అధ్యక్షుడు

నవతెలంగాణ-బోనకల్

మండల పరిధిలోనే నారాయణపురం గ్రామంలో బీఆర్ఎస్‌కు షాక్ తగిలింది. బీఆర్ఎస్ నారాయణపురం గ్రామ అధ్యక్షుడు సూర్యదేవర సుధాకర్ బాబు ఆదివారం స్నానాల లక్ష్మీపురంలో కాంగ్రెస్‌లో చేరాడు. సుధాకర్ బాబుకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కాంగ్రెస్ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ బోనకల్ మండలంలో కాంగ్రెస్ అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని సుధాకర్ బాబుని కోరారు. సుధాకర్ బాబు మాట్లాడుతూ నారాయణపురం గ్రామం నుంచి త్వరలోనే పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో తన నాయకత్వంలో చేరనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ఆరు గ్యారెంటీ పథకాలు ఎంతో బాగున్నాయని, అందువలనే తాను కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి సభ్యులు పైడిపల్లి కిషోర్ కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు గాలి దుర్గారావు, కలకోట సొసైటీ చైర్మెన్ కర్నాటి రామకోటేశ్వరరావు, కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మారుపల్లి ప్రేమ్ కుమార్, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండి పవన్ తదితరులు పాల్గొన్నారు.



వినియోదారునికి విద్యుత్తు అధికారుల సన్మానం

నవతెలంగాణ-ఖమ్మం రూరల్

పేదవాడు అయినప్పటికీ ప్రతి నెలా సక్రమంగా బిల్లులు చెల్లిస్తున్న విద్యుత్తు వినియోగదారున్ని విద్యుత్తు అధికారులు, సిబ్బంది సోమవారం సన్మానించారు. మండల పరిధిలోని ముత్తగూడెం గ్రామానికి చెందిన కొమ్ము వెంకన్న అత్యంత పేదవాడు. గ్రామంలోని ఓ చిన్నగుడిసెలో ఒక్కడే నివాసం ఉంటూ గ్రామంలో గేదెలు కాస్తూ జీవనం సాగిస్తున్నాడు. తన గుడిసెకు విద్యుత్తు మీటరు ఏర్పాటు చేసినప్పటి నుంచి ప్రతి నెలా విద్యుత్తు బిల్లుల వసూలు కోసం గ్రామానికి విద్యుత్తు సిబ్బంది వచ్చినపుడు క్రమం తప్పకుండా తన గుడిసెకు వచ్చిన విద్యుత్తు బిల్లును చెల్లిస్తున్నాడు. కొంత మంది విద్యుత్తు బిల్లులను చెల్లించడంలో అలసత్వం, రూ.లక్షలు, రూ.కోట్లలో విద్యుత్తు బిల్లులు పెండింగ్ పెడుతున్నారని, కానీ వెంకన్న గేదెల కాపరి అయినప్పటికీ తాను నివాసం ఉండే గుడిసెకి వచ్చిన బిల్లును క్రమం తప్పకుండా చెల్లిస్తున్నాడని విద్యుత్తు లైన్ ఇన్‌స్పెక్టర్ సురేశ్ పేర్కొన్నాడు. వినియోగదారులకు ఆదర్శంగా నిలిచిన వెంకన్నను విద్యుత్తు అధికారులు, వినియోగదారుల తరుపున సన్మానం చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో లైన్ మెన్ కృష్ణమూర్తి, సిబ్బంది మహేశ్, కృష్ణ, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో అన్నదానం

నవతెలంగాణ-మధిర

మధిర పట్టణంలోని శ్రీ మృత్యుంజయ స్వామి వారి దేవాలయంలో సోమవారం ఆలయ నిర్వాహకులు బొందిలి స్రవంతి జ్ఞాపకార్థంగా వారి కుటుంబ సభ్యులు చైతన్య ఆధ్వర్యంలో మధిర పట్టణంలోని అభాగ్యులకు, నిరుపేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారుల, పాటిబండ్ల సత్యంబాబు, మైనేడి జగన్మోహన్, క్రాంతి, మేఘన, రిషిత, అభి, నాని చంద్ర కుమారి, విజయ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



రైల్వే అండర్ బ్రిడ్జిని ప్రారంభించిన జెడ్పీచైర్మెన్ లింగాల కమల్‌రాజు

నవతెలంగాణ-మధిర

మండలంలోని తొండలగోపవరం గ్రామంలో నూతనంగా నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జిను జిల్లా పరిషత్ చైర్మెన్ లింగాల కమల్ రాజు ముఖ్య అతిథిగా హాజరై సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే వ్యవస్థ లో అనేక మార్పులు జరుగుతున్న క్రమంలో రైల్వే అండర్ బ్రిడ్జిల నిర్మాణం, ఫ్లై ఓవర్ల నిర్మాణం, మూడో రైల్వే ట్రాక్ నిర్మాణాలు పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. రైల్వేలో ఇలాంటి అభివృద్ధి పనులు జరగడం మంచి పరిణామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ హెూదాల్లో ఉన్న ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేద మహిళలకు చేతన ఫౌండేషన్ కుట్టుమిషన్ల పంపిణీ

నవతెలంగాణ-కారేపల్లి



మండలంలో మాధారంలో అమరురాలు తుమ్మలపల్లి శాంతమ్మ జ్ఞాపకార్థం, చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదమహిళలకు కుట్టుమిషన్లను పంపిణి చేశారు. సోమవారం మాధారంలో జరిగిన తుమ్మలపల్లి శాంతమ్మ సంస్మరణ సభలో ఇల్లందు మున్సిపాల్ చైర్మెన్ దమ్మాలపాటి వెంకటేశ్వర్లు(డీవీ), ప్రముఖ కవి జయరాజ్, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, మాస్‌లైన్ రాష్ట్రనాయకులు రాయల చంద్రశేఖర్ చేతుల మీదిగా మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా చేతన ఫౌండేషన్ సేవలను వారు కొనియాడారు. పేదలు ఆర్థికంగా నిలదొక్కుకోవటానికి స్వచ్ఛంద సంస్థలు, దాతలు సాయం చేయటం అభినందనీయమన్నారు. మరిన్ని సేవా కార్యక్రమాల ద్వారా బాధితులు, పేదలను అక్కున చేర్చుకోవాలని ఆకాంక్షించారు.

అర్జీల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలి

- **కలెక్టర్ వీపీ.గౌతమ్**

నవతెలంగాణ-ఖమ్మం



గ్రీవెన్స్ డేలో అందిన అర్జీలను సత్వరమే పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ వీపీ.గౌతమ్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం నూతన కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన గ్రీవెన్స్ డేలో జిల్లా కలెక్టర్ అర్జీదారుల నుండి దరఖాస్తులను స్వీకరించి సత్వర చర్య నిమిత్తం సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సత్వర పరిష్కారం కలిగిన దరఖాస్తులు కల్లూరు మండలం ఖాన్‌ఖాన్‌పేటకు చెందిన తుమ్మల గంగాధరరావు తనకు గల వ్యవసాయ భూములు ఎ.3.13 కుంటలు, నిషేదిత భూములుగా ఉన్న వాటిని తొలగింపుకు సమర్పించిన దరఖాస్తును, తుమ్మల ఝాన్సీకుమారికి సంబంధించిన 38 కుంటల వ్యవసాయ భూమిని నిషేదిత జాబితా నుండి తొలగించాల్సిందిగా సమర్పించిన దరఖాస్తును, కొణిజర్ల మండలం గుండ్రాతిమడుగు గ్రామంకు చెందిన పి.గోవిందరావు తనకు గల 18 కుంటల వ్యవసాయ భూమి మిస్సింగ్ జాబితాలో గలదని సమర్పించిన దరఖాస్తులను కలెక్టర్ పరిశీలించి వెంటనే పరిష్కారం చూపారు. ఖమ్మం నగరం 59వ డివిజన్‌కు దానవాయిగూడెంకు చెందిన వెన్ను సుమతి తాము దానవాయిగూడెం కాలనీ ఇం.నెం.12-3-158/1760/40 లో నివాసం ఉంటున్నామని, తమకు జి.ఓ 58 క్రింద క్రమబద్దీకరించి, ఇంటి పట్టా మంజూరు చేయబడలేదని, దాని కారణంగా విద్యుత్ మీటరు కూడా ఇవ్వడంలేదని, ఇంటి పట్టా, విద్యుత్ మీటరు ఇప్పించగలరని సమర్పించిన దరఖాస్తును తగు చర్య నిమిత్తం ఖమ్మం అర్బన్ మండల తహశీల్దారును ఆదేశించారు. తల్లాడ మండలం కేశవాపురం గ్రామస్తులు తమ గ్రామంలో ఎస్సీ మాదిగ కులముకు చెందిన మాగంటి కమల భర్త ఆదాము కడు బీదవారని వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయించగలరని, సమర్పించిన దరఖాస్తును తగు చర్య నిమిత్తం తహశీల్దారు తల్లాడను ఆదేశించారు. చింతకాని మండలం పాతర్లపాడు గ్రామంకు చెందిన మండెపూడి బాబు, మండెపూడి సుధాకర్, అన్నదమ్ములు తమకు పాతర్లపాడు రెవెన్యూ సర్వేనెం.183/అ1లో య.3' 20 కుంటల భూమి తమ తండ్రిగారి నుండి వారసత్వంగా వచ్చినదని, అ భూమి ధరణిలో 0.50 గుంటల భూమి మాత్రమే నమోదు కావడం జరిగినదని, అట్టి భూమిని సర్వేచేసి, తమ భూమికి పట్టాదారు పాస్ బుక్ ఇప్పించగలరని, సమర్పించిన దరఖాస్తును తగు చర్య నిమిత్తం తల్లాడ తహశీల్దారును ఆదేశించారు. కూసుమంచి మండలం గట్టుసింగారం గ్రామంకు చెందిన పెద్ది కేశవరావు తనకు గట్టుసింగారం రెవెన్యూ నందు సర్వేనెం.332/4 లో ఎ 1.500 కుంటల భూమి రికార్డులో ప్రోహిబ్యెటెడ్ ల్యాండ్‌గా నమోదు కావడం జరిగినదని, అట్టి నిషేధిత జాబితా నుండి తొలగించగలరని సమర్పించిన దరఖాస్తును దరఖాస్తును తగు చర్య నిమిత్తం తల్లాడ తహశీల్దారును ఆదేశించారు. కొణిజర్ల మండలం రాజ్యాతండాకు చెందిన తెజావత్ శోభన్ బాబు, తేజావత్ నాగరాజు తన తండ్రి గారి వద్ద నుండి ఖమ్మం అర్బన్ మండలం మల్లెమడుగు రెవెన్యూలో సర్వేనెం.160అ/2లో ఎ.1' 26 గుంటలు భూమి వచ్చినదని అట్టి భూమిని తమ పేరున వారసత్వ రిజిస్ట్రేషన్ చేయాల్సిందిగా కోరగా ఇబ్బందులకు గురి చేయడం జరిగినదని ఇట్టి భూమిని తమపేరున రిజిస్ట్రేషన్ చేయించగలరని సమర్పించిన దరఖాస్తును తగు చర్య నిమిత్తం ఖమ్మ అర్బన్ తహశీల్దారును ఆదేశించారు. పెనుబల్లి మండలం లంకపల్లి గ్రామంకు చెందిన యడవల్లి నరేష్‌కుమార్ తనకు తన తండ్రి నుండి వారసత్వంగా మండలపాడు రెవెన్యూ నందు సర్వేనెం.244 నందు ఎ1'10 కుంటలు భూమి వచ్చినదని అందులో 0.34 కుంటలు విక్రయించగా మిగిలిన 0.16 కుంటలు ఉండగా 0.14 కుంటలు మాత్రమే ఇచ్చియున్నారని, సర్వే చేయించి తనకు న్యాయం చేయగలరని సమర్పించిన దరఖాస్తును తగు చర్య నిమిత్తం పెనుబల్లి తహశీల్దారను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ శిక్షణ కలెక్టర్ మయాంక్ సిగ్, అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సన్యాసయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉల్లాసం, ఆరోగ్యం

- **క్రీడలతో పాటు చదువులో రాణించాలి**
- **మంత్రి పొంగులేటి కార్యాలయ ఇన్‌చార్జి దయాకర్ రెడ్డి, ఎస్ఐ ప్రవీణ్ కుమార్**

నవతెలంగాణ-కామేపల్లి



క్రీడలతో మానసిక ఉల్లాసం, ఆరోగ్యం పెరుగుతుందని, విద్యార్థులు క్రీడలతో పాటు చదువులో రాణించాలని మంత్రి పొంగులేటి కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో గత వారం రోజులుగా బోడెపుడి ట్రస్ట్ చైర్మెన్ రాజా ఆధ్వర్యంలో యువతని ప్రోత్సహిస్తూ క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ ముగింపు సందర్భంగా నేడు కామేపల్లి మండల కేంద్రంలో జరిగిన క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన విజేతలకు బహుమతులను ఎస్ఐ ప్రవీణ్ కుమార్, మంత్రి పొంగులేటి కార్యాలయ ఇన్చార్జి తంబూరి దయాకర్ రెడ్డి చేతుల మీదుగా విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత గెలుపు ఓటములో సహజమేనని ఓడిన వారు రాబోవు రోజుల్లో ఎలా గెలవాలి అని ఉద్దేశంతో ముందుకు పోవాలని నిరుత్సాహ పడకూడదని అన్నారు ప్రతి ఒక్కరు కూడా ఉత్సాహంగా ఉల్లాసంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ ఆటలతోపాటు విద్యలో కూడా రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించి గ్రామాభివృద్ధికి తోడ్పాటు ఇవ్వాలని మరిన్ని సేవా కార్యక్రమాలు చేసేందుకు ప్రత్యేక కృషి చేయాలని సలహాలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డిసిసిపి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, ఎంపీటీసీ నల్లమోతు లక్ష్మయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గింజల నరసింహరెడ్డి, ఎంపిటిసి సునీత, లక్ష్మీనారాయణ, గూగుల్త్ గబ్రూనాయక్, సుమన్, రామనాథం, సీతారాములు తదితరులు పాల్గొన్నారు.



మాస్ లైన్ యూనిటీ మహాసభ జయప్రదానికి ప్రచారం

నవతెలంగాణ-కారేపల్లి

విప్లవ పార్టీలైన సీపీఐ(ఎంఎల్), సీపీఐ(ఎంఎల్) రివల్యూషన్ ఆఫ్ ఇండియా, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా విలీన జాతీయ మహాసభలు మార్చి 3,4,5 తేదిలలో ఖమ్మంలో జరుగునున్న నైపథ్యంలో ఆ మహాసభల విజయవంతానికి కారేపల్లి మండలంలో ప్రచారం నిర్వహించారు. పోలంపల్లిలో రైతులు, వ్యవసాకూలీలు పని చేస్తున్న ప్రాంతాలకు వెళ్ళి విప్లవ పార్టీల ఐక్యత, ఉద్యమాలతో ప్రజల జీవితాల్లో మార్పులపై వారి వివరించారు. వాల్‌పోష్టర్ల విడుదల చేసి, కరపత్రాలను పంపిణి చేశారు. మాస్‌లైన్ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో సిపిఐ(ఎంఎల్) ప్రజాపంథా కారేపల్లి, కామేపల్లి సంయుక్త మండలాల సహాయ కార్యదర్శి ఎన్వీ రాకేష్, డివిజన్ నాయకులు గుగులోతు తేజ నాయక్, దారావత్ సక్రు నాయక తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ మహిళ అమరజీవి తుమ్మలపల్లి శాంతమ్మ

- **భర్త మార్గంలో నడిచిన ధన్యజీవి**
- **సంస్మరణ సభలో వక్తలు**

నవతెలంగాణ-కారేపల్లి



సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నేత తుమ్మలపల్లి అప్పయ్య సహధర్మచారిణి తుమ్మలపల్లి శాంతమ్మ ఆదర్శజీవి అని ప్రముఖ కవి జయరాజ్, సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర నాయకులు రాయల చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్యలు అన్నారు. కారేపల్లి మండలం మాధారంలో సోమవారం తుమ్మలపల్లి శాంతమ్మ సంస్మరణ సభ నిర్వహించారు. శాంతమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్ళుఆర్పించారు. కవి జయరాజ్ అమరులను కీర్తిస్తూ పాటలు పాడారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ తుమ్మలపల్లి అప్పయ్య తాను నమ్మిన సిద్ధాంతం కోసం కుటుంబానికి మార్గనిర్దేశం చేసి అదే మార్గంలో నడిపించారన్నారు. అప్పయ్య అమరుడైనా జీవతభాగస్వామి శాంతమ్మ తన కుమారులను కమ్యూనిస్టులగా మార్చారన్నారు. ఉద్యమంలో పెద్దకుమారుడు తుమ్మలపల్లి హన్మంతరావు అమరుడైనాడని, చిన్నకుమారుడు సీనియర్ జర్నలిస్టుగా తుమ్మలపల్లి ప్రసాద్ అదే మార్గంలో ఆదర్శభావాలతో నడవటం ఆ కుటుంబం ఉక్కు క్రమశక్షణకు నిదర్శనమన్నారు. అమరులైన తుమ్మలపల్లి అప్పయ్య-శాతమ్మ, తుమ్మలపల్లి హనుమంతరావు నేటి తరానికి మార్గదర్శకలన్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మున్సిఫల్ చైర్మెన్ దమ్మాలపాటి వెంకటేశ్వర్లు(డీవీ), సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ నాయకులు చంద్రా అరుణ, గుగులోత్‌తేజా, ఎన్వీ రాకేష్, దారావత్ సక్రు, పులకాని సత్తిరెడ్డి, రావుల నాగేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు పులగండ్ల మాధవరావు తదితరులు పాల్గొన్నారు.



క్రైస్తవులపై మతోన్మాదుల దాడులను ఖండించండి

- ఎన్‌సీసీ రాష్ట్ర అధ్యక్షుడు అలవాల కరుణాకర్

నవతెలంగాణ-సత్తుపల్లి

క్రైస్తవులపై మతోన్మాదులు జరుపుతున్న దాడులను ప్రజాస్వామిక వాదులు తీవ్రంగా ఖండించాలని నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ (ఎన్‌సీసీ) రాష్ట్ర అధ్యక్షుడు అలవాల కరుణాకర్ కోరారు. సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధి ఎన్టీఆర్‌నగర్ క్రీస్తు మందిరంలో ఆ కౌన్సిల్ ముఖ్య నాయకుల సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశంలో కరుణాకర్ ప్రధానోపన్యాసం చేశారు. దేశం ప్రమాదకర పరిస్థితిలో ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మతతత్వ వాదుల వల్ల ప్రజలకు ప్రమాదం పొంచి ఉందన్నారు. లౌకిక రాజ్యమైన మనదేశంలో ఎవరికి ఇష్టం వచ్చిన దేవుళ్లను వారు పూజించుకోవచ్చన్నారు. సర్వమత సౌభాతృత్వంతో అన్ని మతాలకు చెందిన ప్రజలంతా ఐకమత్యంగా ఉండాలన్నారు. తెలంగాణ ప్రజలకు అనుకూలమైన ప్రభుత్వం ఏర్పడిన విధంగానే కేంద్రంలో కూడా ప్రజలకు అనుకూలంగా ఉండే ప్రభుత్వం ఏర్పడటానికి క్రైస్తవులు సిద్ధపడాలన్నారు. ఎన్‌సీసీ రాజకీయ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి సామేలు మాట్లాడుతూ మతతత్వ పార్టీలు మనకొద్దన్నారు. ప్రజలందరిని సమానంగా గౌరవించే ప్రభుత్వం మనకి కావాలన్నారు. ఎన్‌సీసీ మండల అధ్యక్షుడు రవికిరణ్ పాల్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మీడియా వింగ్ రాష్ట్ర అధ్యక్షుడు కనకపూడి నాగార్జున, మండల గౌరవాధ్యక్షుడు ఎన్. యాకోబు, కొత్తపల్లి ప్రభాకర్, కె. బాలప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారం కోసం గ్రీవెన్స్

- **పోలీస్ కమిషనర్ సునీల్ దత్**

నవతెలంగాణ-ఖమ్మం



ప్రజా సమస్యల పరిష్కారం కోసం గ్రీవెన్స్ కార్యక్రమం అని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు . సోమవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 22 బాధితుల ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించిన పోలీస్ కమిషనర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులో వృద్ధాప్యంలో వారసులు పట్టించుకోకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, పలు ఫిర్యాదు వచ్చాయని, అదేవిధంగా భూ వివాదాలు , కుటుంబ , వ్యక్తిగత సమస్యలతో పాటు ఆర్థిక లావాదేవీలు , భార్యభర్తల సమస్యలపై వచ్చిన బాధితుల ఫిర్యాదులను పరిశీలించారు. ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీస్ స్టేషన్లు ఎస్ హెచ్ ఓ అధికారులకు ఆదేశించారు.

రెజోనెన్స్ ఇన్ఫో పాఠశాలలో విద్యార్థుల వీడ్కోలు సభ

నవతెలంగాణ-ఖమ్మం



నగరంలోని వీడియోస్ కాలనీ రెజోనెన్స్ ఇన్ఫో పాఠశాల పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు వేడుకలు నిర్వహించారు. తొలుత మానసిక వైద్యనిపుణులు డాక్టర్ సతీష్ బాబు, రెజోనెన్స్ డైరెక్టర్స్ ఆర్వి. నాగేంద్రకుమార్, కె. శ్రీధర్‌రావు, నీలిమ జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సతీష్ బాబు మాట్లాడుతూ జీవితంలో ప్రధానమైన అంశాలు తల్లిదండ్రులు, గురువులు, గురువు దేశ ప్రతిష్ట, ఉన్నత శిఖరాలు ఎదగటానికి బాలబాలికలు విద్యార్థి దశ నుండి మంచి క్రమ శిక్షణ తోడ్పడుతుందని, అటువంటి క్రమశిక్షణతో కూడిన విద్యాబోధన మన రెజోనెన్స్ ఇన్ఫో పాఠశాలలో మాత్రమే జరుగుతుందని తెలిపారు. చదువుతో పాటు గుణం కూడా ముఖ్యం, మన మనసు వెళ్ళిన ప్రతి చోటుకు శరీరం కూడా వెళ్ళాలి అనిపిస్తుందని, మనసుని మంచి పనుల మీద విద్యార్థులు పెట్టాలని, ఖర్చు పెట్టే ప్రతి రూపాయి ఎక్కడినుండి వచ్చాయనేది గ్రహించాలని, ప్రతి విషయాన్ని క్షుణంగా పరిశీలించాలని, దాని వలన జీవితంలో ఒక గమ్యం ఏర్పడుతుందని, మంచి ప్రవర్తన మనలో కలిగిస్తుందని తెలిపారు. డైరెక్టర్ఆర్.వి. నాగేంద్రకుమార్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పట్టుదలతో అనుకున్న లక్ష్యాన్ని చేరే వరకు విశ్రమించరాదన్నారు. విలువలతో కూడిన విద్యను అందిస్తూ, విద్యార్థులను అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తూ సామాజిక అవగాహన పెంచే విధంగా విద్యార్థులను తీర్చి దిద్దుతున్నామని ఆయన తెలిపారు. శక్తి సామర్థ్యాలను పెంచుకునేందుకు విద్యార్థులు కృషి చేయాలన్నారు. విద్యార్థి తన జీవితంలో ఉన్నతంగా ఎదగటానికి చిన్నతనంలో పాఠశాలలో నేర్చుకున్న జ్ఞానమే దోహదపడుతుందని తెలిపారు. ప్రతి విద్యార్థి దేశభక్తిని పెంపొందించుకొని సమాజం పట్ల బాధ్యతగా మెలగాలని తల్లిదండ్రులను, అధ్యాపకులను గౌరవించాలని అన్నారు .డైరెక్టర్ కె. శ్రీధర్‌రావు మాట్లాడుతూ విద్యార్థులకు మొదటి గురువులు తల్లిదండ్రులైతే, వారి తరువాత అధ్యాపకులదే ప్రముఖ స్థానమని, కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా ఆటపాటలతో పాటు అన్ని రంగాలలో విద్యార్థులు ముందుండే విధంగా తమ విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. పాఠశాల దశను ముగించుకొని పై చదువులకు వెళుతున్న విద్యార్థులకు జీవితంలో విజయం సాధించాలంటే నిజాయితీతో కష్టపడాలని అన్నారు . ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా ధైర్యంగా వాటిని అధిగమించాలని తద్వారా విజయానికి చేరువౌతామని తెలిపారు. డైరెక్టర్ నీలిమా మాట్లాడుతూ పాఠశాల జీవితం బంగారం లాంటిదని, ఈ బాల్యం చాలా సున్నితమైనదని, చాలా విలువైనదని, స్కూల్ దశలో వేసే పునాది తదుపరి జీవితకాలం ఉపయోగపడుతుందని తెలిపారు. నైతిక విలువలతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదిగి చదువుకున్న పాఠశాలకు పేరుతేవాలని అన్నారు . అనంతరం చిన్నారులు ఉత్సాహంతో కేరింతలతో మారుమ్రోగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ గోపాలకృష్ణ, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.



ఓవర్ బ్రిడ్జీని ప్రారంభించిన జారే

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి

మండల పరిధిలోని శాంతినగర్ గ్రామ శివారు దగ్గర రైల్వే ఓవర్ బ్రిడ్జీ పూర్తి కావడంతో సోమవారం అశ్వారావుపేట శాసన సభ్యులు జారే ఆదినారాయణ అధికారికంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి భద్రాచలం రోడ్ నోడల్ అధికారి రజీనిష్ కుమార్, పలువురు రైల్వే అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మండల పరిధిలో శాంతినగర్ గ్రామం దగ్గరా జాతీయ రహదారి రైల్వే లైన్ క్రాస్ కావడంతో ఓవర్ బ్రిడ్జీ నిర్మించినట్టు తెలిపారు. రానున్న రోజుల్లో కొవ్వూరు నుండి భద్రాచలం వరకు జనం ప్రయాణించే రైళ్లు కూడా ఇదే మార్గంలో వచ్చే అవకాశాలు వున్నాయి అని చంద్రుగొండ, పార్థసారథి పురం గ్రామల దగ్గర రైల్వే స్టేషన్‌లు వచ్చే అవకాశం ఉందని రానున్న కాలంలో మండలం మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందని అన్నారు. రైల్వే లైన్ కోసం పోరాడిన ఫలితంగా 1924 ఏప్రియల్ 17న కొత్తగూడెం రైల్వే స్టేషన్ ప్రారంభం అయినదని, రానున్న కొద్ది సంవత్సరాలలోనే మండల సమీప ప్రాంతాల్లో రెండు రైల్వే స్టేషన్‌లు ప్రారంభం అయ్యే అవకాశం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో అర్‌అండ్‌బీ అధికారులు, రైల్వే అధికారులు, తహాశీల్దార్ జగదీష్ ప్రసాద్, డాక్టర్ ప్రియాంక, ఎంపీఓ షబానా తదితరులు పాల్గొన్నారు.

బిల్డింగ్ వర్కర్లకు ఉచిత ఆరోగ్య పరీక్షలు

నవతెలంగాణ-ఇల్లందు

కార్మిక శాఖ వెల్ఫేర్ బోర్డు అధ్వర్యంలో కామన్ సర్వీస్ సెంటర్ వారిచే 50 రకాల ఉచిత ఆరోగ్య పరీక్షలు గత రెండు రోజులుగా ఇల్లందు సీఐటీయూ కార్యాలయంలో 300 మందికి నిర్వహించారు. ప్రభుత్వం చేపట్టిన ఈ సౌకర్యాన్ని లేబర్ కార్డు ఉన్న భావన నిర్మాణ కార్మికులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ నబి కోరారు. ఈ కార్యక్రమం సీఎస్‌సీ క్యాంప్ పారామెడికల్ సిబ్బంది క్యాంప్ కో ఆర్డినేటర్ మహేష్, సాగర్, అంజలి, ప్రసన్న, దుర్గ, బెబి, గౌతమి, లావణ్య, కృష్ణవేణిలు పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిల్డింగ్ అండ్ అధర్‌కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ మండల అధ్యక్ష కార్యదర్శులు తాళ్లూరి కృష్ణ, కామ నాగరాజు, పవన్, వెంకన్న, సత్యనారాయణ కోరి, కామ కోటేశ్వరరావు, శ్రీను, డానియల్ తదితరులు పాల్గొన్నారు.



ఆలయ కమిటీ చైర్మెన్‌గా కృష్ణయ్య యాదవ్ ఏకగ్రీవం

నవతెలంగాణ-చంద్రుగొండ

మండలంలోని రావికంపాడు గ్రామంలో శ్రీ కోదండ రామాలయం దేవస్థానం నూతన కమిటీని ఏకగ్రీవంగా సోమవారం ఎన్నుకున్నారు. చైర్మెన్‌గా ఇనుముల కృష్ణయ్య యాదవ్, గౌరవ అధ్యక్షుడు కుక్కల రాములు యాదవ్, ప్రధాన కార్యదర్శి మద్దిరాల చిన్న పిచ్చయ్య, వైస్ చైర్మెన్ పెనుగొండ నరసింహారావు, కోశాధికారి మద్దిబోయిన రాజు యాదవ్‌గా నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో రావికంపాడు కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు భోగినబోయిన కోటేశ్వరరావు, యాదవ సంఘం సభ్యులు ఇనుముల స్వామి,కుక్కల ముత్యాలరావు, మద్దిబోయిన పుల్లయ్య, చిమట పుల్లయ్య, ఇనుముల సైదులు, గాలం రవి, ఇమ్మడి ముక్తేశ్వరావు, పోతురాజు వెంకట్రావు, ఆర్యవైశ్య సభ్యులు లక్ష్మణరావు, జనార్ధన్ రావు, పెద్ద పిచ్చయ్య కిషన్, తదితరులు పాల్గొన్నారు.

రేపు మాదిగల 'జోడో యాత్ర'

- మాదిగ జేఏసీ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ జోగారావు

నవతెలంగాణ-కొత్తగూడెం



28న ఖమ్మంలో జరుగు "మాదిగల జోడో యాత్రను" జయప్రదం చేయాలని మాదిగ జేఏసీ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ మోదుగు జోగారావు విజ్ఞప్తి చేశారు. సోమవారం స్థానిక మేదర్ బస్తీలో జరిగిన మాదిగ సంఘాల జేఏసీ ముంఖ్యకార్యకర్తల సమావేశంలో జోగారావు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణలో మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ వాట సాధనకై రాష్ట్ర తొలి ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్, మాదిగ జేఏసీ వ్యవస్థాపకులు డాక్టర్ పిడమర్తి రవి నాయకత్వంలో ఎస్సీ వర్గీకరణ సాధనలో జనాభా దామాషా ప్రకారం ఇవ్వాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అతి పెద్ద కులం అయిన మాదిగలకు 12శాతం జర్వేషన్ కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ కారులు వేల్పుల నరసింహారవు, కొత్తగూడెం నియోజకవర్గం ఇన్ చార్జి భీమ్ రాజ్, పోతురాజు నాగరాజు, వెంకట్, సెల్వరాజ్, సురేష్, నరేష్, కుమార్, మహేష్, రమణారావు, కోటేశ్వరరావు, విజయ్ కుమార్ తదితరుల పాల్గొన్నారు.

రహదారి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే తెల్లం

నవతెలంగాణ-దుమ్ముగూడెం



మండలంలోని కొత్త దంతెనం గ్రామపంచాయతీలోని ఆర్‌అండ్‌బీ రహదారి నుండి తాలిపేరు కెనాల్ వరకు సుమారు 900 మీటర్ల గ్రావెల్ రోడ్డు నిర్మాణ పనులతో పాటు సీడీపీ నిధులతో 5లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు సోమవారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. రహదారుల నిర్మాణాలతోనే ఏజెన్సీ ప్రాంత గ్రామాలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రేసు లక్ష్మి, జడ్పీటీసీ తెల్లం సీతమ్మ, పార్టీ మండల అధ్యక్షులు అన్నే సత్యనారాయణ మూర్తి, ప్రధాన కార్యదర్శి కణితి రాముడు, ఉపాధ్యక్షులు తునికి కామేశ్వరరావు, అపకా వీర్రాజు, సొసైటీ డైరెక్టర్ కాలువ పూర్ణయ్య, సోషల్ మీడియా అధ్యక్ష కార్యదర్శులు దామెర్ల శ్రీనివాసరావు, తోట రమేష్, ఎస్సి సెల్ అధ్యక్షులు మోతుకూరి శ్రీకాంత్, విద్యార్థి సంఘం అధ్యక్షులు కొత్త మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి

- ప్రజల నుండి దరఖాస్తు స్వీకరించిన కలెక్టర్
- పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు

నవతెలంగాణ-పాల్వంచ



ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తులు త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ప్రియాంక అల అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో అన్ని శాఖల అధికారులతో ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ దరఖాస్తు చేసిన అభ్యర్థులను వివరాలను అడిగి తెలుసుకొని పరిష్కారాన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు ఇలా ఉన్నాయి....ఎగ్గడి ఇందు, భర్త రాజేశ్వరరావు పెంట్లం గ్రామం అన్నపురెడ్డిపల్లి మండలం తాను సర్టిఫికేషన్ ఆఫ్ రేడియోగ్రఫీ అసిస్టెంట్ కోర్స్ చేసి ఉన్నానని, గత సంవత్సరం సెప్టెంబర్ 22, 2023న అశ్వరావుపేట ప్రభుత్వ ఆసుపత్రి నందు గల పోస్టుకు దరఖాస్తు చేసి ఉన్నానని, ఆ పోస్టు ఫిమేల్ కేటగిరీకి ఉండగా ఆ పోస్ట్‌కి సంబంధించిన ఎటువంటి సమాచారం లేకుండా వేరే వ్యక్తిని కేటాయించారు. మెరిట్ లిస్టులో నేనొకదాన్ని అర్హత కలిగి ఉన్నాను కావున నాకు రావాల్సిన పోస్టు ఇప్పించ వలస వలసినదిగా కోరిన దరఖాస్తును డిస్టిక్ మెడికల్ హెల్త్ అధికారికి ఎండార్స్మెంట్ చేశారు. కరకవాగు గ్రామస్తుడు బి.కృష్ణ పాల్వంచ మండలంలో తాను 2023 సంవత్సరంలో కొత్తగూడెం లక్ష్మీదేవి మండలంలోని రేగళ్ల, భానోజీ తండా ప్రాథమిక పాఠశాలల యందు మన ఊరు మనబడి కార్యక్రమం కింద మేజర్, మైనర్ పనులు చేసి ఉన్నానని, ఇప్పటివరకు ఎటువంటి బిల్లులు రాలేదని తెలిపారు. రావాల్సిన బిల్లులు ఇప్పించగలరని కోరిన దరఖాస్తును ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పంచాయతీ రాజ్‌కు ఎండార్స్మెంట్ చేశారు. ఇల్లందు మండలం మామిడిగూడెం గ్రామపంచాయతీ నిరుపేదలైన రైతులు 1999 సంవత్సరంలో ఫారెస్ట్ వారు, వన సంరక్షణ కమిటీ వారు ఏ.బి.కమిటీ చైర్మెన్‌లు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలందరికీ సమక్షంలో ఒక ఒప్పందం గుర్తుంచుకొని మా భూమిలో ఫారెస్ట్ వారు జామాయిల్ మొక్కలు నాటారని తెలిపారు.

2005 సంవత్సరం వరకు 25 హెక్టర్ల భూమిలో మొక్కలు నాటినట్టు తెలిపారు. కటింగ్ పీరియడ్ 25 సంవత్సరాలు అయినప్పటికీ, ఫారెస్ట్ వారు కటింగ్ చేయకుండా జాప్యం చేస్తున్నందున మేము పలు రకాలుగా నష్టపోతున్నామని తెలిపారు. ఈ చెట్లను కటింగ్ చేసి వాటిని అమ్మి మాకు రావాల్సిన డబ్బులు మాకు ఇప్పించగలరని ఫారెస్ట్ వారిని వేడుకున్నప్పటికీ వారు పట్టించుకోవడం లేదు. కావున దయతో తమ డబ్బులు తమకు ఇప్పించగలరని కోరిన దరఖాస్తును డీఎఫ్ఓకు పరిష్కారానికి సిఫార్సు చేశారు.

తదితర సమస్యలపై వచ్చిన దరఖాస్తులను కలెక్టర్ స్వీకరించి ఆయా శాఖల అధికారులకు ఎండార్స్ చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ రవీంద్రనాథ్, డీఆర్‌డీ ఏపీడీ విద్యాచందన, జిల్లా అధికారులందరూ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

- నేటి నుండి నిరవధిక సమ్మె : సీఐటీయూ

నవతెలంగాణ-ఇల్లందు



పెండింగ్ వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 27నుండి నిరవధిక సమ్మె చేస్తున్నట్టు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ నబి తెలిపారు. ఇల్లందు, టేకులపల్లి, ఆళ్లపల్లి, గుండాల మండలాల పరిధిలోని ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్స్, పీఎంహెచ్ హాస్టళ్లలో పనిచేస్తున్న డైలీ వేజ్, ఔట్ సోర్సింగ్ వర్కర్లు విడివిడిగా సమ్మె నోటీసులు ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్స్‌లో గత 35ఏండ్లుగా పనిచేస్తున్న డైలీ వెజ్ వర్కర్లను జీఓ 16 ప్రకారం పర్మినెంట్ చేయాలనే జీవో పై హై కోర్టు పర్మినెంట్ చేయమన్నా చేయకుండా తాత్సారం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరి కృష్ణ, పాయం ముత్తయ్య, బాలయ్య, వినయ్ కుమార్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలి

- సృజనాత్మకతను వెలికితీసేందుకు బాలోత్సవ్ కార్యక్రమాలు
- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

నవతెలంగాణ-కొత్తగూడెం



విద్యుతోపాటు ఉన్నత వ్యక్తిత్వ వికాసం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం సింగరేణి సీఈఆర్ క్లబ్‌లో మూడు రోజులపాటు జరగనున్న తెలంగాణ రాష్ట్ర స్థాయి బాలోత్సవ్‌ను సోమవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో కూనంనేని మాట్లాడుతూ వెనుకటి రోజుల్లో గురుకులాల్లో మంచి విద్యాబోధన జరిగేదని, నేటి రోజుల్లో విద్య ఆధునిక పోకడలతో అస్తవ్యస్తంగా తయారైందన్నారు. పాశ్చాత్య పోకడలతో భారత సంస్కృతికి చేటు కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు మానసికంగా బలోపేతం అయ్యే వ్యక్తిత్వాన్ని పెంపొందించే విద్య నేడు అవసరమని అన్నారు. కేవలం విద్యకే ప్రాధాన్యత ఇవ్వకుండా క్రీడా, సాంస్కృతిక రంగాలవైపు విద్యార్థులన్ను పోత్సహిందాల్సిన భాధ్యత విద్యాసంస్థలపై ఉందన్నారు. ఉత్తమ ప్రతిభకనబర్చి ప్రతీ యేటా రాష్ట్ర స్థాయి బాలోత్సవ్ పోటీలను నిర్వహిస్తూ విద్యార్థులను పోత్సహిస్తున్న మద్దెల శివకుమార్‌తోపాటు కమిటీ సభ్యులు అభినందనీయులని, వారు చేస్తున్న కృషికి అన్ని విధాలా సహకరిస్తానని కూనంనేని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా, బాలోత్సవన్ నిర్వహకులు మద్దెల శివకుమార్, జడ్పీ చైర్మన్ చంద్రశేఖర్ రావు, గొల్లపల్లి దయానంద్, అందెల ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి టాలెంట్ టెస్టు నిర్వహణ

- 87 పాఠశాలల నుంచి 100 మంది విద్యార్థులు హాజరు

నవతెలంగాణ-లక్ష్మీదేవి పల్లి



ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 19, 20 తేదీల్లో మండల స్థాయిలో టాలెంట్ టెస్ట్ నిర్వహించింది. మండలాల్లో టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులకు సోమవారం లక్ష్మీదేవిపల్లిలోని శ్రీ నలంద జూనియర్ కళాశాలలో జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 87 పాఠశాలల నుండి సుమారు 100 మంది విద్యార్థులు హాజరయ్యారు. జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బయ్యా అభిమన్యు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి వివేకవర్ధిని విద్యాసంస్థల అధినేత ఎంవిఎస్ చౌదరి, త్రివేణి విద్యాసంస్థల అధినేత జి.జగదీష్ హాజరయ్యారు. వారిద్దరూ మాట్లాడుతూ గతంలో అనేక మంది టాలెంట్ టెస్ట్‌లు నిర్వహించేవారని ఆ ఆనవాయితీ ఇప్పుడు కనుమరుగైందని, ఎస్ఎఫ్ఐ మాత్రమే ఇప్పుడు టాలెంట్ టెస్ట్‌లు నిర్వహిస్తుందని అన్నారు. పబ్లిక్ పరీక్షలకు సిద్ధం అయ్యేందుకు టాలెంట్ టెస్ట్‌లు బాగా ఉపయోగపడతాయని, పరీక్షలకు ముందు ఈ టెస్ట్‌లు విద్యార్థులను మానసికంగా ధృఢంగా తయారు చేస్తాయని, విద్యార్థులు మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఎదుర్కొనేందుకు పుస్తకాలు బాగా చదవాల్సి ఉంటుందని, ఈ క్రమంలో అపార జ్ఞానాన్ని పొందుతారని అన్నారు. ఇటువంటి టాలెంట్ టెస్ట్‌లతో విద్యార్థులలో పోటీతత్వాన్ని నెలకొల్పేందుకు రానున్న పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. పబ్లిక్ పరీక్షలకు సిద్ధం కావాలని కోరారు.

అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.వీరభద్రం మాట్లాడుతూ జిల్లా స్థాయిలో పరీక్షకు హాజరైన ప్రతీ విద్యార్థికీ కన్సోలేషన్ బహుమతులు అందిస్తామని, మొదటి ముగ్గురికి నగదు బహుమతులు ఇవ్వనున్నట్టు తెలిపారు. హాజరైన అతిధులు జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్ ప్రారంభించి, ప్రశ్నాపత్రాన్ని హాజరైన విద్యార్థులకు అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు ప్రతీ విద్యార్థికీ భగత్ సింగ్ వీలునామా పుస్తకం బహుకరించారు. ఆయన స్ఫూర్తితో జీవితంలో రాణించాలని పిలుపునిచ్చారు. త్వరలోనే పేపర్ మూల్యాంకనం పూర్తయ్యాక అభినందన సభ ఏర్పాటు చేసి విద్యార్థులకు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా హాజరైన విద్యార్థులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ భూపేందర్, జిల్లా సహాయ కార్యదర్శులు మందా నాగకృష్ణ, జె.భవ్య జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్ రామ్ చరణ్, జె.భవ్య, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



వలస ఆదివాసీ గ్రామాన్ని సందర్శించి ఎంపీఓ

నవతెలంగాణ-పినపాక

మండలంలోని ఉప్పాక గ్రామపంచాయతీ పరిధిలో గల వలస ఆదివాసీ గ్రామం ఎర్రగుంటలో ఎంపీఓ వెంకటేశ్వరరావు పర్యటించారు. అక్కడ సమస్యలు తెలుసుకున్నారు. ఆ గ్రామంలో ఆదివాసీలు ఆయనకు తాగునీటి సమస్యను, గ్రామంలో గల పాఠశాలలో గల సమస్యను గ్రామస్తులు తెలియజేశారు. గ్రామంలో ఉన్న రెండు బోర్వెల్‌లు పూర్తిగా నీరు రావడంలేదని తెలియజేశారు. ఆ ప్రదేశాన్ని సందర్శించిన ఎంపీఓ ఫ్లషింగ్ చేస్తే నీరు వచ్చే అవకాశం ఉందన్నారు. అలాగే ఓపెన్ బోర్ ఉంటే దానిని పరిశీలించారు. రెండు రోజుల్లో తాగునీటి సమస్యను పరిష్కరిస్తానని ఆయన వారికి తెలియజేశారు. అనంతరం అక్కడ గ్రామంలో నిర్వహిస్తున్న పాఠశాలను సందర్శించి విద్యార్థులకు బిస్కెట్ ప్యాకెట్లను అందజేశారు. గ్రామంలో అంగన్వాడి పాఠశాల అందుబాటులో లేకపోవడంతో ఉప్పాడ గ్రామం వచ్చి పోవడం ఇబ్బందిగా ఉందని ఆయనకు గిరిజనులు తెలియజేశారు. సంబంధిత అంగన్వాడీ సిబ్బందితో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీలు అశోక్, కృష్ణమూర్తి, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రైతులకు ఇచ్చిన హామీని విస్మరించిన కేంద్రం

- ప్రతీ రైతు ఉద్యమ ఆయుధమై తిరగబడాలి
- సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా
- సీపీఐ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా

నవతెలంగాణ-పాల్వంచ

మూడు సాగు చట్టాల రద్దు కోరుతూ జరిగిన రైతాంగ ఉద్యమ సమయంలో రైతులకు ఇచ్చిన హామీని కేంద్రం విస్మరించి మోసం చేసిందని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా అన్నారు. సీపీఐ జాతీయ, రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా దేశ రాజదాని ఢిల్లీలో రైతాంగం నిర్వహిస్తున్న పోరాటానికి సంఘీభావంగా సోమవారం కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమ సమయంలో రైతులపై పెట్టిన కేసులు ఉపసంహరించుకున్నట్లు హామీ ఇచ్చిన కేంద్రం సంబందిత రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన విధంగా ఆదేశాలు జారీ చేయలేదన్నారు. రైతు ఉద్యమంలో అమరులైన వారి కుటుంబాలకు నష్టపరిహారం విషయలో కేంద్రం మీనమేశాలు లెక్కిస్తోందన్నారు. పండించిన పంటలకు మద్దతు దర చెల్లిస్తామని హామీ ఇచ్చి ఇందుకోసం కమిటీని ఏర్పాటు చేస్తామని కేంద్రం ఇచ్చిన హామీ నెలల గడుస్తున్నా కమిటీని ఏర్పాటు చేయకుండా మోసం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు బందెల నర్సయ్య, కల్లూరి వెంకటేశ్వరరావు, ఎస్‌డీ సలీం, కె.సారయ్య, రావులపల్లి రవికుమార్, వై.భాస్కర్ రావు, దేవరకొండ శంకర్, వి.పూర్ణచందర్ రావు, జి.రామకృష్ణ, వాసిరెడ్డి మురళి, భూక్యా దస్రు, రాంచందర్, వెంకటేశ్వర్లు, నాగయ్య, వీరాస్వామి, మల్లికార్జున్ రావు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు సిద్ధం కావాలి

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



ఇంటర్మీడియట్ పరీక్షలు దగ్గర పడుతున్నందున గిరిజన సంక్షేమ గురుకులాల్లో చదివే విద్యార్థినీ, విద్యార్థులు, అలాగే గురుకులాల్లో పదవ తరగతి చదివే విద్యార్థినీ, విద్యార్థులకు రోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక స్టడీ అవర్స్ ఏర్పాటు చేస్తూ పరీక్షలు బాగా రాసేలా సంబంధిత ఉపాధ్యా యులు, లెక్చరర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజు అన్నారు. సోమవారం ఐటీడీఏ సమావేశం మందిరంలో ఏర్పాటుచేసిన గిరిజన దర్బార్లో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ప్రతిక్ జైన్ అధికారిక పనులపై వెళ్లి అందుబాటులో లేనందున, ఆయన ఆదేశానుసారం వివిధ గిరిజన గ్రామాలనుండి వచ్చిన గిరిజనుల నుండి ఆయన అర్జీలు స్వీకరించి, తన పరిధిలో ఉన్నవి వెంటనే పరిష్కరించి మిగతా వాటిని సంబంధిత అధికారులకు పంపుతూ అర్హులైన ప్రతి గిరిజనులకు ప్రభుత్వం ద్వారా ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అందే విధంగా సంబంధిత యూనిట్ అధికారులు కృషి చేయాలని ఆయన అన్నారు. గిరిజన దర్బార్లో వచ్చిన అర్జీలలో పోడు భూములకు పట్టాలు, వ్యక్తిగత సమస్యలు, భూ సమస్యలు, ట్రైకార్ రుణాలు, వ్యవసాయానికి సంబంధించి కరెంటు, మోటారు, బోరుబావుల కోసం, గిరిజన గ్రామాలలో విద్యుత్ సౌకర్యం కల్పించుట కోసం, ఇలా తదితర సమస్యలపై గిరిజన దర్బార్లో దాదాపు 150కి పైగా అర్జీలు వచ్చాయని, వీటిని ఆన్లైన్ ద్వారా ప్రత్యేక రిజిస్టర్లో నమోదు చేసి అర్హులైన ప్రతి గిరిజనులకు విడతల వారీగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ తానాజీ, ఎస్ఓ సురేష్ బాబు, ఏడీ అగ్రికల్చర్ భాస్కర్ ,ఏపీవో పవర్ మునీర్ పాషా, డీటీఆర్ఓ ఎఫ్ఆర్ శ్రీనివాస్, మిషన్ భగీరథ ఏఈఈ నారాయణరావు, డీఎస్ఓ ప్రభాకర్ రావు, జేడీఎం హరికృష్ణ, వివిధ విభాగాలకు చెందిన ప్రమీల బాయ్, నరేందర్, వెంకటేశ్వర్లు, సుగుణ, నాగభూషణం, ఐసీడీఎస్ సూపర్వైజర్ మాణిక్యం, ప్రసాద్, మణి కుమారి తదితరులు పాల్గొన్నారు.

పంటకు కనీస మద్దతు ధర కల్పించాలి

- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి వెంకన్న

నవతెలంగాణ-పినపాక



రైతులు పండించే పంటకు కనీస మద్దతు ధర కల్పించి, చట్టబద్ధత కల్పించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నిమ్మల వెంకన్న డిమాండ్ చేశారు. సోమవారం పినపాక మండలం ఈ బయ్యారం క్రాస్ రోడ్‌లో అఖిలపక్ష పార్టీ నాయకులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఢిల్లీలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న రైతులపై బీజేపీ ప్రభుత్వం కాల్పులకు తెగబడటం సరికాదన్నారు. మద్దతు ధర అడిగిన రైతులపై కాల్పులు జరుపుతారా అంటూ ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు మడివి రమేష్ పాల్గొన్నారు.



మహాసభలను జయప్రదం చేయండి

- అమర్ల పూడి రాము

నవతెలంగాణ-దమ్మపేట

మార్చి 3, 4, 5 తేదీలలో ఖమ్మంలో జరుగు సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ యూనిటీ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అమర్ల పూడి రాము పిలుపునిచ్చారు. సోమవారం జమేధారుబంజరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, పిసిసి సిపిఐ(ఎంఎల్), సీపీఐ (ఎంఎల్) ఆర్‌ఐలు మూడు పార్టీలు ఏకమై ఖమ్మంలో యూనిటీ మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే 3 తేదీన ఖమ్మంలో వేలాది మందితో బహిరంగ సభ 4, 5 తేదీలో జరిగే ప్రతినిధుల సభను జయప్రదం చేయాలని ప్రజలకు ప్రజాస్వామ్య వాదులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు తోడెం దుర్గమ్మ, మండల నాయకులు కాకా వెంకటేష్, కుర్సం ముత్యాలరావు, తాటి సత్యం, కుంజా కాంతారావు, రాముడు, బండి ఆదినారాయణ, కీసరి వెంకటేష్, కొండ్రు లక్ష్మి, చాపా ముత్యాలరావు, వగ్గెల ప్రసాద్, కుంజా రాజు తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో ఉద్యోగ అవకాశాలు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాచలం ప్రభుత్వ ఏరియా హాస్పిటల్, భద్రాచలంలో ఏఆర్‌టీ సెంటర్ నందు ల్యాబ్ టెక్నీషియన్ (1) అర్హత బీఎస్సీ, ఎంఎల్‌టీ డీఎంఎల్‌టీ ఉద్యోగములకు కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేయుటకు అర్హులైనవారి నుండి దరఖాస్తులు ఆహ్వానించడమైనదని ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ సూపర్నెంట్ ముదిగొండ రామకృష్ణ పత్రికా ప్రకటన ద్వారా కోరారు. ఆసక్తి కలవారు తేదీ 27.02.2024 నుండి 04.03.2024 వరకు ఉ:9:00 నుండి సా : 04:00 వరకు దరఖాస్తులు ఏఆర్‌టీ సెంటర్ ఏరియా హాస్పిటల్, భద్రాచలం రూమ్ నం.38, నందు ఇవ్వగలరని ఆయన సూచించారు. అదేవిధంగా ఏమైనా సందేహాలు ఉంటే సంప్రదించవలసిన నెంబర్ 9963130775. మెడికల్ ఆఫీసర్ ఏఆర్‌టీ సెంటర్ ఏరియా హాస్పిటల్, వారిని భద్రాచల సూపరింటెండెంట్ ప్రభుత్వ ఏరియా హాస్పిటల్, వారిని సంప్రదించాలని కోరారు.

నవతెలంగాణ మనసు తెలుగు దినపత్రిక
8
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం | ఫిబ్రవరి 27, 2024 | www.navatelangana.com

ఇసుక అక్రమ రవాణాను అరికట్టండి

- ప్రభుత్వ ఆదాయాన్ని పెంచేందుకు చర్యలు
- అధికారులకు జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా ఆదేశం



నవతెలంగాణ-పాల్వంచ

జిల్లాలో అక్రమ ఇసుక రవాణాను పూర్తిగా అరికట్టి ప్రభుత్వ ఆదాయాన్ని పెంచేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ప్రియాంక అలా అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ భవన సముదాయ సమావేశ మందిరంలో జరిగిన డిస్ట్రిక్ లెవల్ స్యాండ్ కమిటీ సమావేశంలో ఇసుక అక్రమ రవాణా నియంత్రణ చర్యలు, ప్రభుత్వ ఆదాయాన్ని పెంచే దిశగా చేపట్టవలసిన చర్యలపై మైన్స్, ఆర్అండ్‌బి, ఇరిగేషన్, టిఎస్‌యండిసి, మున్సిపల్, పంచాయితీరాజ్ ఇంజనీరింగ్, రెవెన్యూ అధికారులతో సమీక్షించి పలు ఆదేశాలు చేసారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని గోదావరి, కిన్నెరసాని నదులకు సంబంధించి మండలాల్లో నిర్వహిచబడుచున్న జిల్లాలో గల ఇసుక రీచ్‌లలో ఇసుక లభ్యత, నిల్వలపై సంయుక్త తనిఖీలు చేసి శుక్రవారం నాటికి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. పాత రీచ్‌లతో పాటు ఇసుక లభ్యతను బట్టి కొత్త రీచ్ లో ఏర్పాటుకు తగిన ప్రదేశాలను గుర్తించాలని ఆమె తెలిపారు. ఇసుక రీచ్‌ల ద్వారా జిల్లాలో ఇసుక రవాణాకు ఇసుక ర్యాంపుల నుండి నియమ నిబంధనలకు అనుగుణంగా ఇసుకను విక్రయించాలన్నారు. జీపిఎస్ ట్రాకింగ్ సిస్టం ఏర్పాటు చేయాలని, ఇసుక రీచ్ లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని వాటి మానిటరింగ్ అధికారులు ప్రతిరోజు ఆదేశించారు. ఇసుక రీచ్ చేరుకోవడానికి ఒకే రహదారి ఉండేలా, క్రంచ్ ఏర్పాటు చేయాలన్నారు. రసీదు, దానిపైన స్టాంపు ఉన్న వాహనాలు మాత్రమే రీచ్‌లోకి అనుమతించేలాగా చర్యలు చేపట్టాలన్నారు. ఎట్టి పరిస్థితులలో ఇసుక అక్రమ రవాణా జరుగరాదని, ఆ దిశగా పోలీసు, మైనింగ్, రెవెన్యూ అధికారులు సమన్వయంతో చెక్ పోస్ట్ వద్ద పటిష్టమైన నిఘా పెడుతూ రాత్రి వేళల్లో ఇసుక అక్రమ రవాణా పూర్తిగా కట్టడి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఇసుక అక్రమ రవాణా చేసే వాహనాలకు జరిమానా విధించాలని కలెక్టర్ ఆదేశించారు.

ఈ సమావేశంలో డిఆర్ఓ రవీంద్రనాథ్, డీఎస్పీ రెహమాన్, కలెక్టరేట్ పరిపాలనాధికారి గన్య, ఇరిగేషన్ ఈ ఈ అర్జున్ రావు, ఏడి మైన్స్ అధికారి జై సింగ్, భూమి కొలతల శాఖ అధికారి కుసుమకుమారి, డిప్యూటీ పంచాయతీ అధికారి భద్రాచలం గ్రౌండ్ వాటర్, ఏడి బాలు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

1 వరకు ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు

- పోస్టర్ల ఆవిష్కరించిన కలెక్టర్ ప్రియాంక అలా

ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల 26 నుండి మార్చి 01 వరకు నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ డాక్టర్ ప్రియాంకల తెలిపారు. ఈ సందర్భంగా రిజర్వ్ బ్యాంక్ అఫ్ ఇండియా విడుదల చేసిన పోస్టర్లను కలెక్టర్ డా. ప్రియాంక అలా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ రవీంద్రనాథ్, డిఆర్డిఏ పిడి విద్యా చందన, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామిరెడ్డి, మరియు అధికారులు పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ వర్కర్లకు వేతనాలు పెంచాలి

- జిల్లా కలెక్టర్‌కు సీఐటీయూ వినతి



నవతెలంగాణ-పాల్వంచ

జిల్లాలోని సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ వర్కర్లకు వేతనాలు పెంచాలని సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్ వర్కర్స్ యూనియన్ సీఐటియు జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లా సిఐటియు ఉపాధ్యక్షులు దొడ్డ రవికుమార్ మాట్లాడుతూ ఔట్సోర్సింగ్ వర్కర్లు చాలా తక్కువ వేతనాలతో ఇబ్బంది పడుతున్నారని స్కావెంజర్ డ్యూటీ చేస్తున్న వారికి 4000 వంటపని చేస్తున్న వారికి 8000 వాచ్మెన్ డ్యూటీ చేసిన వారికి 10000 మాత్రమే వేతనాలు చెల్లిస్తున్నారని పెడుతున్న ధరలు ప్రకారం వేతనాలు పెంచడం లేదని అన్నారు. చాలీచాలని వేతనాలతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కనీస వేతనం 26000 ఇవ్వాలని అందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియూ నాయకులు వీరన్న, ఔట్సోర్సింగ్ వర్కర్స్ బి.వెంకటమ్మ, మంగమ్మ, రోజామణి, విజయలక్ష్మి, మాధవి, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రవేశ పరీక్షల రుసుమును ప్రభుత్వమే భరించాలి

- మైనారిటీ జిల్లా అధ్యక్షులు ఎండీ. యాకూబ్ పాషా

నవతెలంగాణ-పాల్వంచ

మైనార్టీ గురుకులాల్లో, నీట్, ఎంసెట్, జేఈఈ మెయిన్స్ ప్రవేశ పరీక్షల రుసుమును ప్రభుత్వమే భరించాలని జిల్లా మైనార్టీ అధ్యక్షులు ఎండీ. యాకూబ్ పాషా సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా గల మైనారిటీ గురుకుల కళాశాలలో పలు ప్రవేశ పరీక్షల ఫీజులను ప్రస్తుతం విద్యార్థులే చెల్లిస్తున్నారని, సంవత్సరానికి ఒకొక్క విద్యార్థికి సగటున 1,20,000/- పెట్టుబడి పెడుతున్న ప్రభుత్వం, ప్రవేశ పరీక్షల ఫీజును మాత్రం చెల్లించకుండా ఈ భారాన్ని విద్యార్థులపై మోపడం సమంజసం కాదని అన్నారు. ఇట్టి విషయమై రాష్ట్ర ముఖ్య మంత్రి, మైనారిటీ గురుకుల కార్యదర్శి, మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ దృష్టికి లేఖ ద్వారా తీసుకెళ్లడం జరిగిందని పేర్కొన్నారు.



ఇండస్ట్రియల్ క్రికెట్ టోర్నమెంట్లో కేటీపీఎస్ ప్రతిభ

- క్రీడాకారులను అభినందించిన సీఈ

నవతెలంగాణ-పాల్వంచ

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇండస్ట్రియల్ క్రికెట్ టోర్నమెంట్ లో కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ క్రికెట్ క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. మంచి నైపుణ్యతను ప్రదర్శించి, రన్నర్ ట్రోఫీని కైవసం చేసుకున్నారు. కేటీపీఎస్ క్రికెట్ టీంలో ఎండి ఆరిఫ్, కెప్టెన్ ఎం.శ్రీనివాస్, డి.రమేష్, కె.నరసింహారావు, టి మహేష్, కె వివేక్, ఎం రంగనాయక్, జి లక్ష్మణరావు, ఎండి ముద్దార్ అహ్మద్, ఎస్ భాను, మహేష్, టి రమేష్, పి శ్రీనివాస్, కె రాహుల్, డి భరత్ కుమార్, పి సతీష్ కుమార్, డి మహేష్ లు పాల్గొన్నారు. చీఫ్ ఇంజనీర్ కార్యాలయం ఆవరణలో క్రీడాకారులను చీఫ్ ఇంజనీర్ వెంకటేశ్వరరావు అభినందించారు ఘనంగా సన్మానించారు. ఇదే స్ఫూర్తితో రాష్ట్ర జాతీయ స్థాయిలో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గేమ్స్ సెక్రెటరీ వై.వెంకటేశ్వర్లు, ట్రెజరర్ ఎస్ఎల్‌కే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పది, ఇంటర్ విద్యార్థులకు హాల్‌టికెట్స్ సకాలంలో ఇవ్వాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు జమ్మి యశ్వంత్

నవతెలంగాణ-జూలూరుపాడు

జిల్లా వ్యాప్తంగా ప్రయివేటు పాఠశాలల్లో, ప్రయివేటు జూనియర్ కళాశాలల్లో ట్యూషన్ ఫీజులు చెల్లించలేదని, స్కాలర్‌షిప్ రాలేదని, హాజరు లేదని అటెండెన్స్ ఫీజు వసూళ్లు చేసే కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు జమ్మి యశ్వంత్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలో ఇంటర్మీడియట్ నోడల్ అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారి డీఈఓ కళాశాలలు, పాఠశాలల్లో పర్యవేక్షణ లేదని ఫీజులు నియంత్రించడంలో, విద్యార్థులను వేధిస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవడంలో ఉదాసీనత ప్రదర్శిస్తున్నారని అన్నారు. విద్యార్థులను రకరకాల ఫీజుల పేరుతో వేధించే విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు, లేదంటే ఆయా విద్యాసంస్థల ఎదుట బైఠాయించి ఆందోళనలు చేపడతామని అన్నారు.

జిల్లా కలెక్టరేట్ గార్డెన్ ను పరిశీలించిన రాష్ట్ర పరిశీలకులు



నవ తెలంగాణ-పాల్వంచ

రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే ఎనిమిదవ గార్డెన్ అర్బన్ ఫార్మింగ్ ఫెస్టివల్ 2024 సందర్భంగా అన్ని జిల్లా కలెక్టరేట్ కార్యాలయాలు పరిశీలించడానికి రాష్ట్ర పరిశీలకులు కే.కిషన్ రావు, కెవి.ప్రవీణ్ కుమార్ సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జిల్లా కలెక్టరేట్ కార్యాలయాన్ని సందర్శించారు. మార్చి నెల మొదటి వారంలో రాష్ట్రస్థాయిలో నిర్వహించనున్న ఈ పోటీలకు జిల్లా కలెక్టరేట్లో పచ్చదనం పెంపకానికి చేపట్టిన చర్యలను ప్రామాణికంగా తీసుకుని రాష్ట్రస్థాయిలో ఎంపిక చేసే ఉత్తమ కలెక్టర్ కార్యాలయాలకు బహుమతులు అందజేయనున్నట్లు వారు పేర్కొన్నారు. గతంలో కొన్ని ప్రాంతాలలో ల్యాండ్ స్కిప్ ఉండేదని నేడు అన్ని ప్రాంతాలలో ల్యాండ్ స్కిప్పింగ్ చేపడుతున్నారని తెలిపారు. ఇళ్లల్లో పచ్చదనాన్ని పెంపొందించేందుకు టెర్రస్ గార్డెన్ ఏర్పాట్లపై పెద్ద ఎత్తున ప్రజలలో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో స్పీకర్స్ పాపప్స్ వంటి అధునాతన పరికరాలు ఉపయోగించి పచ్చదనం పెంపొందిం చేందుకు జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా పక్క ప్రణాళికతో పకడ్బందీగా చర్యలు చేపట్టారని అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ అధికారి జీనుగు మరియన్న, కార్యాలయ అధికారి పాల్గొన్నారు.

అంగన్వాడీ హెల్పర్స్‌కి పాత పద్ధతిలోనే ప్రమోషన్ సౌకర్యం కల్పించాలి

- అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జి.పద్మ
- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు దొడ్డ రవికుమార్ డిమాండ్
- కలెక్టరేట్ ఎదురుగా అంగన్వాడీ హెల్పర్స్ మహాధర్నా
- జిల్లా కలెక్టర్ ప్రియాంక అలాకు వినతి

నవతెలంగాణ-పాల్వంచ

అంగన్వాడీ హెల్పర్స్‌కి పాత పద్ధతిలోనే ప్రమోషన్ సౌకర్యం కల్పించాలని తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జి.పద్మ సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు దొడ్డ రవికుమార్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదురుగా తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటియు ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. భారీ నినాదాలతో హెల్పర్స్ హోరెత్తించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు మెమోరండం అందజేశారు. ఈ సందర్భంగా ఈసం వెంకటమ్మ అధ్యక్షతన జరిగిన సభలో వారు మాట్లాడుతూ స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఈ మధ్యకాలంలో ఐసిడిఎస్ 9వేల అంగన్వాడీ ఉద్యోగుల పోస్టులు ఖాళీ ఉన్నాయని, ప్రభుత్వం ఉత్తర్వులు ఇస్తే వెంటనే భర్తీ చేస్తామని ప్రకటించిందని సంతోషం, కానీ ఇదే సమయంలో అంగన్వాడీ కార్యకర్తలకి ప్రమోషన్ సౌకర్యం, విద్యార్హత ఎస్ఎస్‌సీ ఉన్న దానిని ఇంటర్ కి మార్చారు. దీనివల్ల అనేక సంవత్సరాల తరువాత వస్తున్న ఖాళీ పోస్టుల భర్తీ ద్వారా వచ్చే ప్రమోషన్ సౌకర్యానికి ఎక్కువమంది అంగన్వాడీ హెల్పర్స్ ప్రభుత్వం చేసిన నిర్ణయంతో హెల్పర్స్ తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరణ చెయ్యాలని,పాత పద్ధతిలోనే ప్రమోషన్ సౌకర్యం కల్పించాలని,ప్రమోషన్ వయసు 50 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సుమారు 70వేల మంది అంగన్వాడీ ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఇందులో సగం మంది గత 45 సంవత్సరాలు పైగా పనిచేస్తున్నారు. వీరికి గతంలో ఎస్ఎస్సి అర్హత ప్రకారం టీచర్గా ప్రమోషన్స్ సౌకర్యం ఉండేది. గత ప్రభుత్వం 2022 డిసెంబర్లో విద్యార్హతను ఇంటర్ గా మార్చింది. అంగన్వాడీ టీచర్ పోస్ట్ భర్తీ చేయాలంటే ఇంటర్ ఉండాల్సిందేనని ప్రభుత్వం అంటుంది. ఐసిడిఎస్ పట్ల ఎలాంటి అవగాహన లేని ప్రజల నుండి కొత్తగా వచ్చే వారికి సంవత్సరాలకు పైగా ఐసిడిఎస్ లో అంగన్వాడీ కేంద్రాలను అంటిపెట్టుకొని





పనిచేస్తూ టీచర్లు ప్రభుత్వం చెప్పిన అదనపు పనులు చేయడానికి బయటకు వెళ్లినప్పుడు ఆయా సమయాల్లో టీచర్ల పనులు కూడా హెల్పర్లు నిర్వహిస్తూ ఐసిడిఎస్ పైన అపార అనుభవం ఉన్న హెల్పర్లకు పాత కొత్త ఇద్దరికీ ఏ తేడా లేకుండా ఒకే రకమైన విద్యార్హత ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం చేయడం అత్యంత అన్యాయం అన్నారు. కొత్త, పాత తేడా లేనప్పుడు ఇది ప్రమోషన్స్ సౌకర్యం ఎలా అవుతుందో ప్రభుత్వం పరిశీలించాలన్నారు. హెల్పర్స్‌లో కూడా ఇంటర్, డిగ్రీ, పీజీ ఉన్న వాళ్ళు ఉన్నారని వారికి కూడా ప్రమోషన్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ సానుకూలంగా ఈ సమస్యను పరిష్కరించాలని రెండు నెలలుగా పెండింగ్లో ఉన్న జీతాలు ఇవ్వాలని వంట పాత్రలు ఇవ్వాలని స్టేషనరీ ఇవ్వాలని, కనీస వేతనం 26వేలు ఇవ్వాలని, రిటైర్మెంట్ సౌకర్యం ఐదు లక్షలు ఇవ్వాలని వస్తున్న జీవితంలో ప్రతినెల సగం పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిచో రాష్ట్రవ్యాప్త ఆందోళన కార్యక్రమాలు ఉంటాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కే సత్య, డి వీరన్న, అంగన్వాడీ హెల్పర్స్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు వీరభద్రమ్మ, జిల్లా కమిటీ సభ్యులు రాంబాయి, విజయ, కళ్యాణి, భవాని, లక్ష్మి, అనురాధ, వెంకటమ్మ, పద్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

కృష్ణ కుమారి ఆశయాలను కొనసాగిస్తాం..

- పగిడేరులో జరిగిన సంస్మరణ సభలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి
- ప్రజాప్రతినిధిగా ప్రజల మనసులను గెలుచుకున్న కృష్ణకుమారి
- మాజీ ఎంపీ మిడియం బాబూరావు
- సమాజంలో శాశ్వతంగా నిలిచిపోయారు
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య





నవతెలంగాణ-మణుగూరు

దేశంలో తొమ్మిదిన్నర సంవత్సరాల కాలంలో బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబించిందని, దానిని ఓడించడమే కుంజ కుమారికి అర్పించే నిజమైన నివాళులని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. సోమవారం పగిడేరులో మాజీ సర్పంచ్, ఎంపీటీసీ కామ్రేడ్ కృష్ణకుమారి సంస్మరణ సభ మండల కార్యదర్శి కోడిశాల రాములు అధ్యక్షతన జరిగింది. ముందుగా గ్రామంలో స్తూపాన్ని ఆవిష్కరించారు. అనంతరం సభలో ఆమె మాట్లాడుతూ.. కమ్యూనిజంపై అచంచలమైన విశ్వాసం మనోనిబ్బరం కలిగిన కృష్ణకుమారి ధన్యురాలని అన్నారు.

అనంతరం ఖమ్మం జిల్లా ఐద్వా కార్యదర్శి బుగ్గ వీటి సరళ మాట్లాడుతూ.. 2005లో 200 మందితో మహిళలకు రాజకీయ క్లాసులు నిర్వహించిన ఘనత కృష్ణకుమార్‌కి దక్కిందన్నారు. మహిళా సమస్యలకు రాజకీయల కారణమని ఆనాడే రాజకీయ క్లాసులు నిర్వహించిందన్నారు. పార్టీలో పదవులు అలంకరణ కాకుండా ప్రజల కోసం ఆయుధంగా ఉపయోగించిందన్నారు. ఆమె మహిళగా కాకుండా ఒక పురుష నాయకుడుగా పనిచేస్తుందన్నారు. పార్టీ ఇచ్చిన క్రమశిక్షణతో సమస్యలపై పోరాటం నిర్వహించిన వనిత అన్నారు. సహా ధర్మచారిగా కాకుండా మహిళలకు పరిశీలించిందన్నారు. కుటుంబ సభ్యులు చనిపోతే ఏడవడమే కాకుండా ధైర్యంగా ఆమె ఆశయాలను పునుగుపుచ్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆశయాల కోసం ప్రతిజ్ఞ చేయాల్సిన అవసరం ఉందని ఆ పిలుపునిచ్చారు.

అనంతరం మాజీ పార్లమెంట్ సభ్యులు రాష్ట్ర కమిటీ నాయకులు మీడియం బాబురావు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో పినపాక నియోజకవర్గంలో కమ్యూనిస్టు భావజాలం అధికంగా ఉన్న గ్రామం, ఉద్యమాలకు కూడా పేరుగాంచిన పగిడేరు అన్నారు. సీపీఐ(ఎం) తరపున నిలబడి ఉద్యమాలు నిర్వహించి ప్రజాప్రతినిధిగా ప్రజల మనసులను గెలుచుకున్న వ్యక్తి కృష్ణకుమారి అని అన్నారు. కష్ణకుమారి వీరత్వం కలిగిన మహిళ అన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య మాట్లాడుతూ.. చావు పుట్టుకలు సహజమని అన్నారు. కొందరు కుటుంబం కోసం పాకులాడితే మరికొందరు సమాజంలో సమస్యలపై పోరాడుతారన్నారు. కుటుంబం కోసం పనిచేసే వ్యక్తులు కొంతకాలం మాత్రమే గుర్తింపు పోతారని చివరికి కుటుంబ సభ్యులు మర్చిపోతున్నారు. సమాజం కోసం పనిచేసే వారు ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోతారని అన్నారు. పెద్ద డిగ్రీలు చదువుకోలేక పోయిన ప్రజల సమస్యలను అధ్యయనం చేసిందన్నారు ప్రజల కోసం పోరాటాలు చేసిందన్నారు. పదవి ఉన్నా లేకున్నా ప్రజల కోసం ఉద్యమాలు చేసింది అన్నారు. ఒకవైపు ఆరోగ్యంతో బాధపడుతూనే మంచానికే పరిమితమై చివరి వరకు పార్టీ కోసం పనిచేసిన వీర మహిళా అన్నారు. ఆమె ఆశయం కోసం ఈ ప్రాంత లో కమ్యూనిస్టు పార్టీకి ప్రత్యేకంగా సిపిఎం పార్టీకి తీవ్ర నష్టమని అన్నారు. ఉద్యమాలు ఉధృతం చేస్తామని అన్నారు. ఆమె ఆశయ సాధన కోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి మధు, ఐద్వా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎం.జ్యోతి, సీనియర్ నాయకులు జిల్లా కమిటీ సభ్యులు గద్దల శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు గద్దల శ్రీనివాసరావు, మండల కార్యదర్శులు పినపాక నిమ్మల వెంకన్న, బూర్గంపాడు బత్తుల వెంకటేశ్వర్లు, కొమరం కాంతారావు, పాయం నరసింహారావు, మండల కార్యదర్శి వర్గ సభ్యులు దామల్ల వెంకన్న, సత్రపల్లి సాంబశివరావు, ఉపతల నరసింహారావు, టీవీఎంవి ప్రసాద్, సర్గం బాల నరసయ్య, పగిడేరు శాఖ కార్యదర్శి పర్శిక పాపారావు, కృష్ణకుమారి భర్త కుంజ బాబురావు, కుమారుడు కుంజ రాజా, సంధ్యారాణి, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షులు గుడిపూడి కోటేశ్వరరావు, కాంగ్రెస్ నియోజకవర్గ కోఆర్డినేటర్ కాటుబోయిన, బీఆర్ఎస్ నాయకులు గువ్వా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణకుమారి స్థూపాన్ని ఆవిష్కరించిన మల్లు లక్ష్మి

మాజీ సర్పంచ్ రెండుసార్లు ఎంపీటీసీగా గెలుపొందిన కుంజ కృష్ణకుమారి స్తూపం ఆవిష్కరాన్ని సోమవారం మల్లు లక్ష్మి ఆవిష్కరించారు. వీరతెలంగాణ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం కోడలు మల్లు లక్ష్మి పగిడేరు వస్తుందని వార్త తెలుసుకొని మహిళలు అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. గుడిసెలకుంట, శాంతినగర్, గొల్ల కొత్తూరు గ్రామాల ప్రజలు నల్గొండ, వరంగల్ ప్రాంతాల నుండి వలస వచ్చిన వారే అధికంగా ఉంటారు. ఎర్రజెండాలతో నృత్యాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సిపిఎం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య జండా ఆవిష్కరించారు. మల్లు లక్ష్మి స్థూపాన్ని ఆవిష్కరించారు. జోహార్లు కుంజ కృష్ణకుమారి, సాధిస్తాం మీ ఆశయాలను నినాదాలతో ప్రాంతమంతా మారు మోగిపోయింది. అనంతరం కుంజ కృష్ణకుమారి ఇంటి వద్ద ఏర్పాటుచేసిన సంతాప సభలో ప్రజలు సభ ముగిసేంతవరకు ఆసక్తిగా సంస్మరణ సభలో ప్రజలు పాల్గొనడం విశేషం. చారిత్రాత్మక గ్రామమైన పగిడేరు లో ఇంత భారీగా ప్రజలు రావడం ఇదే మొదటిసారి అని సీనియర్ నాయకులు గ్రామ పెద్దలు చర్చించుకున్నారు.

రజకులను ఆదుకోవాలి



- రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ళ ఆశయ్య

నవతెలంగాణ పాల్వంచ

రేవంత్ రెడ్డి ప్రభుత్వం రజకులను ఆదుకోవాలని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ళ ఆశయ్య కోరారు. సోమవారం తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో రజక సహకార సంఘాలు పైన అవగాహన సదస్సు పాల్వంచలో ముదిగొండ రాంబాబు అధ్యక్షతన చిటికన ముసలయ్య స్వగృహంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పైళ్ళ ఆశయ్య మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 10 లక్షల మందికి పైగా రజక వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారు. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా తీవ్ర వెనుకబడి ఉన్నారని, కొత్తగా ఏర్పడ్డ రేవంత్ రెడ్డి ప్రభుత్వం రజకులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. రజక ఫెడరేషన్ ఏర్పడి 40 సంవత్సరాలు దాటిందని, తెలంగాణ ఏర్పడిన తర్వాత ఫెడరేషన్ కి పాలకవర్గాన్ని నియమించకుండా గత బిఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. ఫెడరేషన్‌కు అనుబంధంగా 4000 సహకార సంఘాలు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నాయని వాటితో పాటు నూతనంగా ప్రతి గ్రామంలో, పట్టణంలో సొసైటీలను ఏర్పాటు చేసుకున్న వాళ్లందరికీ ప్రభుత్వం బిసి కార్పొరేషన్ రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. రజకులపై జరుగుతున్న సామాజిక కుల వివక్షత, దాడులు, దౌర్జన్యాలు అరికట్టి ప్రత్యేక రక్షణ చట్టం అందించాలని తెలిపారు. రజక వృత్తిదారులకు ఉపాధి నిమిత్తం ప్రతి ఒక్కరికి పది లక్షల ఆర్థిక సహకారం ప్రభుత్వం ఇస్తానని తెలిపిందని, మోడ్రన్ దోబీగాట్లు నిర్మాణానికి ప్రతి జిల్లాకు రూ.10 కోట్లతో అభివృద్ధి పరుస్తామని ప్రభుత్వం తమ ఎన్నికల హామీలో తెలిపారని వాటన్నిటిని సత్వరమే చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని ఈ సదస్సు తీర్మానించిందని తెలిపారు. నూతన రజక సహకార సంఘాల నిర్మాణం పైన ఈ సదస్సులో అవగాహన కల్పించడం కోసం జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి హాజరై మాట్లాడారు. జిల్లాలో స్థానిక సమస్యలపైన జిల్లా ప్రధాన కార్యదర్శి చిటికెన ముసలయ్య మాట్లాడుతూ ఇప్పటికీ రజక వృత్తిదారుల ఇళ్లు, ఇళ్ల స్థలాలు లేక అద్దె ఇళ్లల్లో జీవిస్తున్నారని వారందరికీ ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ప్రథమ ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో అనేక చోట్ల రజక వృత్తిదారులకు కేటాయించబడ్డ మాన్యం, ఇనాము భుములు అన్యాక్రాంతానికి గురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రజకుల భూములకు పట్టాలిచ్చి కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో కంచర్ల శ్రీనివాస్, శివ కుమారి, యాదగిరి, రామ తులసి, సత్తెనపల్లి విజయలక్ష్మి పాల్గొన్నారు.

రేపటి నుంచి ఇంటర్ పరీక్షలు

- హాజరుకానున్న 1771 మంది విద్యార్థులు

నవతెలంగాణ - అశ్వారావుపేట

ఈ ఏడాది ఇంటర్మీడియట్ సార్వత్రిక పరీక్షలు ఫిబ్రవరి 28 నుండి మార్చి 14 వరకు జరగనున్నాయి. నియోజక వర్గం కేంద్రం అయిన అశ్వారావుపేటలో నియోజక వర్గంలోని అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో గల ప్రభుత్వ జూనియర్, ముస్లిం మైనార్టీ బాలికల, వీకేడీవీఎస్ రాజు జూనియర్, సాంఘీక సంక్షేమ శాఖ బాలురు మందలపల్లి, గిరిజన సంక్షేమ శాఖ బాలుర (దమ్మపేట), బాలికలు (అంకం పాలెం), ఏకలవ్య గురుకుల(గండుగులపల్లి) మొత్తం 7 జూనియర్ కళాశాలకు చెందిన మొత్తం 1771 మంది ప్రథమ - ద్వితీయ సంవత్సరాలు విద్యార్థులు అశ్వారావుపేటలోని ప్రభుత్వ జూనియర్, ముస్లిం మైనార్టీ,వీకేడీవీఎస్ రాజు జూనియర్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన మూడు పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు రాయ నున్నారు. ఇందులో ప్రథమ సంవత్సరం 829, ద్వితీయ సంవత్సరం 832, ప్రైవేట్ 90,ఒకేషనల్ 20 మంది మొత్తం 1771 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు అవుతారు. ప్రభుత్వ జూనియర్, ముస్లిం మైనార్టీ, వీకేడీవీఎస్ రాజు జూనియర్ కళాశాలల్లో గల పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహణకు చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్ మెంట్ ఆఫీసర్లు గా డి.నరసింహారావు, వెంకటేశ్వరరావు, రామయ్య, ఝాన్సీ, యేసోబు, ఎల్.ఎస్ ప్రసాద్‌లు నియమితులు అయ్యారు.



భద్రాచలంలో న్యాయ కళాశాలను ఏర్పాటు చేయాలి

- 4న ఐటీడీఏ ముందు ధర్నా

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాచలం కేంద్రంగా న్యాయ కళాశాలను ఏర్పాటు చేయాలని 4న ఐటీడీఏ ముందు జరిగే ధర్నా జయప్రదం చేయాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు పాయం సత్యనారాయణ పిలుపునిచ్చారు. భద్రాచలం ఐటీడీఏ ప్రాంగణంలో గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భద్రాచలంలో తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం గిరిజన "లా" కళాశాలను ఏర్పాటు చేయటానికి కంకణం కట్టుకోవాలని కోరారు. ఈ సమావేశంలో గడ్డం వెంకన్న, బాబు పాల్గొన్నారు.

స్టేట్ లెవెల్‌లో గోల్డ్ మెడల్ సాధించిన కాకర్ల వాసి

నవతెలంగాణ-జూలూరుపాడు

మండలంలోని కాకర్ల గ్రామానికి చెందిన ముత్తినేని గోపి కుమారుడు ముత్తినేని విక్రమ్ తెలంగాణ స్పోర్ట్ స్కూలు హాకింపేట హైదరాబాద్ లో టెన్త్ క్లాస్ చదువుతున్నాడు. ఇటీవల నల్గొండలో జరిగిన స్పోర్ట్స్ ఈవెంట్ లో సెపక్ తాకరా విభాగంలో స్టేట్ లెవెల్ లో గోల్డ్ మెడల్ సాధించారు.

సాయి శ్రీజ సీడ్స్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-జూలూరుపాడు

మండల పరిధిలోని కొత్తూరు గ్రామపంచాయతీ వాస్తవ్యులు కాంగ్రెస్ పార్టీ వైరా నియోజకవర్గ ఏ బ్లాక్ అధ్యక్షులు నున్నా కృష్ణయ్య కుమారుడు నున్నా విజయ్ కుమార్ మండల కేంద్రంలోని చంద్రుగొండ క్రాస్ రోడ్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన సాయి శ్రీజ సీడ్స్‌ను సోమవారం ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్ నాయక్, టీపీసీసీ జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ నవీన్ రాథోడ్, జిల్లా ఓబీసీ సెల్ ఉపాధ్యక్షులు అరిగేల నరసింహారావు, జిల్లా సేవాదళ్ కార్యదర్శి కోదుమూరి కోటేశ్వరరావు, మండల సేవాదళ్ అధ్యక్షుడు వాంకుడోత్ కిషన్ నాయక్, పాల్గొన్నారు.

సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ యూనిటీ జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

నవతెలంగాణ-జూలూరుపాడు

సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా పార్టీ ఆలిండియా మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జాటోత్ కృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం కొత్తగూడెం రైటర్ బస్తీలో కార్మికులతో జరిగిన గ్రూప్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. అనంతరం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు జిల్లా సహాయ కార్యదర్శి ఏదులాపురం గోపాలరావు, జిల్లా నాయకులు ఎం.చంద్రశేఖర్, రాజశేఖర్ కార్మికులు కృష్ణ, పోషన్న, సంధ్య, శ్రీనివాస్, ముఖేష్, జవహర్లాల్, రాజేశ్వరి పాల్గొన్నారు.



ఖమ్మం పార్లమెంట్ టికెట్ బీసీలకే కేటాయించాలి

- ఓబీసీ నాయకుల డిమాండ్

నవతెలంగాణ-లక్ష్మీదేవి పల్లి

ఖమ్మం పార్లమెంట్ టికెట్‌ను బీసీల ముద్దుబిడ్డ నాగా సీతారాములుకు ఇవ్వాలని సుజాతనగర్, లక్ష్మీదేవిపల్లి మండల ఓబీసీ అధ్యక్షులు కసనబోయిన లక్ష్మణ్, బొబ్బిశెట్టి వీరబాబు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కూడా బీసీ వర్గానికి చెందిన నాగా సీతారాములుకు అన్యాయం జరిగిందని, ప్రస్తుతం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉన్న పరిస్థితులను బట్టి బీసీలకు టికెట్ ఇస్తే రికార్డ్ స్థాయి మెజారిటీ దక్కడం ఖాయమన్నారు. గత 20 సంవత్సరాల నుండి పార్టీకి సేవ చేస్తు కార్యకర్తలకు నేనున్నా అంటు అందరికీ అండగా ఉన్న బీసీ బిడ్డ నాగా సీతారాములుకు గతంలో ఎమ్మెల్యే టికెట్ హామీ ఇచ్చిన అధిష్టానం పొత్తుల పేరిట సీపీఐకు కేటాయించిన్నప్పటికి పార్టీ పిలుపుతో కూనంనేని సాంబశివరావు గెలుపు కోసం పనిచేశామని అన్నారు. పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పుడు నియోజకవర్గ కార్యకర్తలకు నేనున్నా అంటూ అనేక విధాలుగా అండగ ఉండి ఎన్నో సేవలు అందించి, కరోనా సమయంలో సైతం తన ట్రస్ట్ ద్వారా నిత్యావసర సరుకులు పంచిన నాగా సీతారాములుకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మంచి పేరుందన్నారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు బొల్లం ఉదయ్ కుమార్ యాదవ్, రాచబంటి నాగరాజు యాదవ్, పరిటాల నాగరాజు యాదవ్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-దుమ్ముగూడెం

మండలంలోని పెద్ద కమలాపురం గ్రామంలో ఓ వ్యక్తికి చెందిన ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన మూడు క్వింటాల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు సిఐ బొడ్డు అశోక్ కుమార్ తెలిపారు. ఒడిషా రాష్ట్రానికి చెందిన రతన్ బిశ్వాల్ అనే వ్యక్తి గ్రామంలో సేకరించిన రేషన్ బియ్యాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్టు తెలిపారు. వీటిని సివిల్ సప్లయ్ అధికారులకు అందజేయనున్నట్టు సీఐ తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ పట్టివేత

నవతెలంగాణ-లక్ష్మీదేవి పల్లి

మండలంలోని చాతకొండ గ్రామపంచాయతీ పరిధిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ను ఫారెస్ట్ సిబ్బంది పట్టుకున్నారు. ఫారెస్ట్ అధికారులను చూసిన టిప్పర్ డ్రైవరు టిప్పర్ మరమ్మతులకు గురైనట్టుగా నటిస్తూ టిప్పర్ని రోడ్డుపైన వదిలేసి పరారయ్యాడు. ఈ విషయాన్ని గమనించిన ఫారెస్ట్ అధికారులు సిబ్బంది టిప్పర్ను సెంట్రల్ పార్క్‌కి తరలించారు. కేసు నమోదు చేసినట్టు ఎఫ్ఆర్ఓ సురేష్ తెలిపారు.

పల్స్ పోలియోపై కళాజాత

నవతెలంగాణ-మధిర

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా సార్వత్రిక వ్యాధి నిరోధక టీకాలు ప్రోగ్రాం అధికారుల ఆదేశాలు మేరకు పీహెచ్ సి దెందుకూరు వైద్యులు డా పృథ్వీ రాజ్ నాయక్ ఆధ్వర్యంలో పారా మెడికల్ సిబ్బంది ఆరోగ్యపరి వేక్షకుడు జానపద కళాకారుడు లంకా కొండయ్య ఆధ్వర్యంలో సోమవారం పల్స్‌పోలియోపై కళాజాత నిర్వహించారు. మార్చి 3వ తేదీ దేశ వ్యాప్తంగా నిర్వహించబోయే పల్స్ పోలియో కార్యక్రమంలో మీ పిల్లలు అప్పుడే పుట్టిన బిడ్డ మొదలు కొని 5 సంవత్సరాల లోపు పిల్లలకు తప్పకుండా నిండు జీవితానికి రెండుపోలియో చుక్కలు వేపించాలని సంపూర్ణముగా పాటల ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ఖమ్మం పాడు ఎస్సి కాలనీ అంగన్వాడీ కేంద్రం చింతచెట్టు వద్ద జన సమూహ ప్రాంతం వద్ద కళా జాత ద్వారా అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో హెచ్ఇఓ సనప గోవింద్, హెల్త్ విజిటర్ బి. కౌసల్య, ఎఎన్ఎమ్ భారతి, నాగమణి, అంగన్వాడీ టీచర్ ముప్వ పద్మావతి, ఆశ కార్యకర్తలు నాగుర్ బీ, నాగమణి ఐకేపీ సిబ్బంది, జీపి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతి అందచేసిన బ్యాంక్ బాధితులు

నవతెలంగాణ-తిరుమలాయపాలెం

బాధితుల పేరుపై ఎలాంటి వ్యవసాయ భూమి లేకున్నా మాయమాటలతో సంతకాలు తీసుకొని క్రాప్ లోన్ ఎత్తుకున్న దళరులను సహకరించిన ఏపీజీవీబీ బ్యాంకు అధికారులపై చర్యలు తీసుకోవాలని ఇస్లావత్ తండాకు చెందిన బ్యాంక్ బాధితులు సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కి వినతి పత్రం అందజేశారు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం ఇస్లావత్ తండాకు చెందిన కొందరి వ్యక్తులపై లేని భూమిని సృష్టించి క్రాప్ లోన్లు తీసుకున్న సంఘటన ఏపీజీవీబీ బ్యాంక్ సుబ్లేడు శాఖలో జరిగింది. ఈ విషయంపై శనార్తి తెలంగాణ అనేక కథనాలను పాఠకులకు అధికారులకు చేరవేసింది. బాధితులు ఎన్నిసార్లు బ్యాంకు వారికి విన్నవించుకున్న స్పందించకపోగా ఆసరా పింఛన్ నిలిపివేసి గిరిజనుల జీవితాలతో చెలగాటమాడుతున్న బ్యాంక్ అధికారులపై సంబంధిత బ్రోకర్లపై చర్యలు తీసుకోవాలని శనివారం తిరుమలాయపాలెం మండల తహసిల్దార్ పీవీ రామకృష్ణకు వినతి అందజేశారు. కాగా సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ విపి. గౌతమ్‌కు వినతి అందజేసినట్లు బాధితులు తెలిపారు.

బీజేపీ బైక్ ర్యాలీ

నవతెలంగాణ-కల్లూరు

త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి వర్తి 400 సీట్లు పైగా గెలుస్తుందని బిజెపి శాసనసభ పక్ష నాయకులు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి జోష్యం చెప్పారు. సోమవారం సాయంత్రం బిజెపి సంకల్పయాత్ర కల్లూరు చేరిన సందర్భంగా ఎన్ఎస్పి క్రాస్ రోడ్ నుండి కాటన్ సెంటర్ వరకు మోటర్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పట్టణ సెంటర్లో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ గత పది ఏళ్ల నుండి బిజెపి పార్టీ చేసిన అభివృద్ధిని ఏకరు పెట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గేల్లా సత్యనారాయణ, పార్లమెంటరీ కన్వీనర్ నంబూరు రామలింగేశ్వరరావు, నాయకులు తాంద్ర వినోదరావు, గోంగూర వెంకటేశ్వరరావు, దేవకి వాసుదేవరావు, అంకిరెడ్డి సుధీర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు బొమ్మ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బహుళ అంతస్థుల భవనంలో చోరీ

నవతెలంగాణ - అశ్వారావుపేట

పట్టణంలోని ఒక బహుళ అంతస్తుల భవనంలో పట్టపగలే సోమవారం చోరీ జరిగింది. బాధితుడి కథనం ప్రకారం..స్థానిక భగత్ సింగ్ కూడలి లో ఆళ్ల అంజయ్య బహుళ అంతస్తుల భవనంలో రెండవ అంతస్తులో ఉంటున్న విజయ్ కృష్ణ, తన భార్యతో కలిసి మధ్యాహ్నా సమయంలో తన గదికి తాళం వేసి మార్కెట్కు వెళ్లారు. మార్కెట్ నుంచి కేవలం అరగంట వ్యవధిలోనే తిరిగి ఇంటికి రాగా, అప్పటికే వెనుక వైపు ఉన్న తలుపు తాళం ధ్వంసం చేసిన గుర్తు తెలియని దొంగలు లోపలికి ప్రవేశించి ఇంట్లో ఉన్న బీరువా తెరిచి దాంట్లో ఉన్న నాలుగు కాసుల బంగారు హారం, రెండు ఉంగరాలు తో పాటు రూ.28 వేల నగదును అపహరించారు. అపహరణకు గురైన బంగారు అభరణాలు విలువ సుమారు రూ.2.50 లక్షలు ఉంటుందని బాధితుడు వాపోయాడు. ఈ సమాచారం అందుకున్న స్థానిక ఎస్ఐ శ్రీరాముల శ్రీను ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. అనంతరం క్లూస్ టీంకు సమాచారం అందించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మిర్చి పంట నష్టపోయిన గిరిజన రైతును ప్రభుత్వం ఆదుకోవాలి

నవతెలంగాణ-చర్ల

మండలం పరిధిలోని దానవాయిపేట గ్రామానికి చెందిన గిరిజన రైతు కుంజ జాభద్రయ్య మిర్చి పంటను గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు అంటించి దహనం చేశారు. వారిని గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలని, పంట నష్టపోయిన గిరిజన రైతును ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం భద్రాచలం నియోజకవర్గం కన్వీనర్, కో కన్వీనర్ మచ్చా వెంకటేశ్వర్లు, కారం పుల్లయ్యలు ప్రభుత్వాన్ని కోరారు. సుమారు రెండున్నర ఎకరాలలో పండిన మిర్చి పంట 15 క్వింటాళ్ల వరకు ఉంటుందని, పంట సాగు కోసం అప్పులు చేసి వడ్డీలకు తెచ్చి పెట్టుబడి పెట్టానని తీరా పంట చేతికి వచ్చిన తర్వాత ఇటువంటి నష్టం జరిగిందని రైతు వాపోయాడు. ఈ విషయమై ప్రభుత్వం, సంబంధిత శాఖలు మానవతా దృక్పథంతో ఆలోచించి రైతుని ఆదుకోవాలని, తగిన ఆర్థిక సహకారం అందించాలని సిపిఎం కోరింది. పంట పరిశీల చేసిన సిపిఎం బృందంలో మండల కార్యదర్శి కారం నరేష్, మచ్చ రామారావు, బందెల చంటి, పామరు బాలాజీ, బాధిత రైతు కుంజ భద్రయ్య, సోదరుడు కుంజా వెంకటేశ్వర్లు, నుపా క్రిష్ణ, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మూడు రోజులలో మూడు ఎడ్లు మృతి

నవతెలంగాణ- ఆళ్ళపల్లి



మూడు రోజుల వ్యవధిలో ఒక గిత్త, రెండు దుక్కటెడ్లు మృతి చెందిన ఘటన ఆళ్ళపల్లి మండలంలో సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. యజమాని తెలిపిన వివరాల ప్రకారం.. ఆళ్ళపల్లి మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన కరకపల్లి నాగేశ్వరరావు అనే రైతుకు వ్యవసాయం నిమిత్తం మూడు పశువులు ఉండగా గత శుక్రవారం తెల్లవారుజామున ఒక గిత్త మృతిచెందగా సోమవారం అర్ధరాత్రి రెండు దుక్కటెడ్లు పాముకాటుతో మృతి చెందాయని తెలిపారు. విషయం తెలుసుకున్న ఆళ్ళపల్లి స్థానిక రైతు కమిటీ అధ్యక్షుడు కుంట వెంకట్రాములు బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ప్రభుత్వం సత్వరమే ఆర్థిక సహాయం అందించాలని కోరారు. మృతి చెందిన పశువులకు స్థానిక ప్రాథమిక పశువైద్య శాల ఎల్ఎస్ఏ రోళ్లకంటి రమేష్ పంచనామా నిర్వహించి, మృతి చెందిన పశువుల వెల లక్ష ఇరవై వేలు ఉంటుందని అంచనా వేశారు.

వంద శాతం పల్స్ పోలియో చుక్కలు వేయాలి

- వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు కలెక్టర్ ఆదేశం
- మార్చ్ 3 నుండి ప్రారంభం
- మారుమూల కొండ ప్రాంతాల పిల్లలకు చుక్కల మందు అందేలా చూడాలి

నవతెలంగాణ-పాల్వంచ





మార్చి 3న నేషనల్ ఇమ్యూనైజేషన్ డే సందర్భంగా మూడు రోజుల పాటు పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు కలెక్టర్ ప్రియాంక అల తెలిపారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో వైద్య ఆరోగ్య, జిల్లా అధికారులతో పల్స్ పోలియో పై సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 97522 మంది ఐదేళ్ల లోపు చిన్నారులు అందరికీ వంద శాతం పల్స్ పోలియో చుక్కలు వేయాలని కలెక్టర్ వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఆదేశించారు. ఏదైనా కారణం చేత పల్స్ పోలియో చుక్కలు వేయని మిగిలిన చిన్నారులకు 4, 5 తేదీల్లో ఇంటింటికీ తిరిగి వ్యాక్సినేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలోని పంచాయతీరాజ్, పోలీస్ శాఖ, ఐసీడీఎస్, విద్యాశాఖ, మున్సిపల్ శాఖ, ఆర్టీసీ, రైల్వే శాఖ, పబ్లిక్ రిలేషన్ శాఖ అధికారులు సహాయ సహకారాలు అందించాలన్నారు. అప్పుడే పుట్టిన శిశువు నుండి 5 ఏండ్ల పిల్లల వరకు ప్రతి ఒక్కరికీ రెండు చుక్కల పోలియో మందు వేయాలన్నారు. జిల్లాలో 925 పోలియో కేంద్రాలు, 38 సంచార పోలియో టీంలు, 33 ట్రాన్సిట్ టీంలను ఏర్పాటు చేశామని జిల్లా వైద్యాధికారి శిరీష కలెక్టర్‌కు వివరించారు. పల్స్ పోలియో కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు అంగన్వాడీ సిబ్బంది వాలంటీర్లు పాల్గొనాలని కలెక్టర్ ఆదేశించారు. మారుమూల గ్రామాలు, కొండ ప్రాంతాలు, గిరిజన, మత్స్యకార ప్రాంతాల్లోని పిల్లలకు చుక్కలమందు అందేలా చూడాలన్నారు. అలాగే, బస్టాండ్, రైల్వే స్టేషన్‌లో పోలియో బూత్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. పల్స్ పోలియోపై అవగాహన కోసం విస్తృతంగా ప్రచారం చేయాలని, రద్దీగా ఉండే ప్రదేశాలు పోస్టర్లు, బ్యానర్లు ఏర్పాటు చేయాలని, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు, పల్స్ పోలియో పై తల్లిదండ్రులకు అవగాహన పెంచాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి పల్స్ పోలియోను విజయవంతం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ రవీంద్రనాథ్, డీఆర్డీఓ పీడీ విద్యాచందన, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఈకేవైసీకి మరో మూడు రోజులే గడువు

- తహసీల్దార్ సూర్య నారాయణ

నవతెలంగాణ-పినపాక



రేషన్ కార్డుకు సంబంధించిన ఈ-కేవైసీ గడువు ఈ నెల 29తో ముగియనుందని ఈ కేవైసీ చేయని వారు దగ్గరలో రేషన్ కార్డుకు వెళ్లి చేసుకోవాలని పినపాక తహసీల్దార్ సూర్య నారాయణ తెలిపారు. సోమవారం ఆయన తహసీల్దార్ కార్యాలయంలో మాట్లాడుతూ ఈ గడువును రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికి రెండుసార్లు పొడిగించిందన్నారు. ఈ కేవైసీ నమోదులో సమస్యలు తలెత్తుతుండడంతో ప్రక్రియ పూర్తికావడం లేదని గడువు పెంచారని, ఈ నేపథ్యంలో ఈ గడువును మరోసారి గడువు పెంచేది లేదని అధికారులు స్పష్టం చేశారన్నారు. లబ్ధిదారులు త్వరగా ఈ కేవైసీ చేసుకోవాలని తెలిపారు.

నేటి నుండి హాస్టల్ వర్కర్ల సమ్మె

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని పోస్ట్ మెట్రిక్ హాస్టల్స్‌లో ఇంటర్, డిగ్రీ, పిజి, విద్యార్థుల హాస్టళ్లలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ వర్కర్లకు 18 నెలలుగా వేతనాలు లేవు, బకాయి వేతనాలు చెల్లించాలని సీఐటియు ఆధ్వర్యంలో పలురూపాల్లో ఆందోళన పోరాటాలు నిర్వహించారు. గత ప్రభుత్వంలోని ఎమ్మెల్యేలు మంత్రులకు అనేకసార్లు వినతి పత్రాలు అందజేశారు. కొత్తగా ఏర్పాటు అయిన కాంగ్రెస్ ప్రభుత్వంలో సైతం పలువురు మంత్రులకు అనేకసార్లు వినతి పత్రాలు అందజేశారు. అయినప్పటికీ అధికారుల్లో గానీ రాష్ట్ర ప్రభుత్వంలో గాని ఎలాంటి చలనం లేదు. అలాగే డైలీ వేజ్ వర్కర్లకు ఏడు నెలల వేతనాలు బకాయి ఉన్నాయి. ఈ బకాయి వేతనాల కోసం 27వ తేదీ నుంచి ఔట్సోర్సింగ్ వర్కర్లు, డైలీ వేజ్ వర్కర్లు నిరవధిక సమ్మె చేస్తున్నారు. ముఖ్యంగా ఔట్సోర్సింగ్ వర్కర్లు సమ్మె చేయడం మూలాన ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులకు వంటలు పూర్తిగా బంద్ అవుతాయి. ఇంటర్మీడియట్ విద్యార్థులకు 28వ తేదీ నుండి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పరీక్షల సమయంలో సమ్మె చేయటానికి కార్మికులు సిద్ధపడ్డ ఐటీడీఏ అధికారులు కానీ రాష్ట్ర ప్రభుత్వం వైపు నుంచి గాని వారి సమస్యలపై ఎలాంటి స్పందన లేదని సిఐటియు జిల్లా అధ్యక్షులు కే.బ్రహ్మాచారి పేర్కొన్నారు. బకాయి వేతనాలు చెల్లించాలని ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కకి నాలుగు సార్లు వినతి పత్రం అందజేశామని గుర్తు చేశారు. సమ్మె వల్ల తలెత్తే ఇబ్బందులకు రాష్ట్ర ప్రభుత్వం గిరిజన సంక్షేమ అధికారులే బాధ్యత వహించాలని సీఐటియు పేర్కొన్నది. మార్చి నెలలోనే పదవ తరగతి విద్యార్థులకు సైతం వార్షిక పరీక్షలు జరగనున్నాయి. పరీక్షల సమయంలో సమ్మె చేయటం ఆశ్రమం పాఠశాలలో సైతం వంటలు పూర్తిగా బంద్ అవుతాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని వేతనాలు చెల్లించాలని సిఐటియు డిమాండ్ చేసింది.

వైస్ ఎంపీపీ పై నెగ్గిన అవిశ్వాసం

నవతెలంగాణ-అశ్వాపురం



మండల పరిషత్ వైస్ ఎంపీపీ కంచుగట్ల వీరభద్రంపై ఎంపీటీసీలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. వైస్ ఎంపీపీ పై అవిశ్వాస తీర్మానం పెడుతున్నట్టు భద్రాచలం ఆర్డీవోకి ఇటీవల మండల పరిషత్‌కు చెందిన ఎనిమిది మంది ఎంపీటీసీలు నోటీసు అందజేశారు. దీంతో కలెక్టర్ ఆదేశానుసారం భద్రాచలం ఇన్చార్జి ఆర్డీవో సుమ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని రైతు వేదికలో ఎంపీటీసీల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ పై అవిశ్వాసం తీర్మానం ప్రవేశపెట్టగా 12 మంది ఎంపీటీసీలు ఉన్న మండల పరిషత్‌లో 8 మంది ఎంపీటీసీలు సమావేశానికి హాజరుకాగా అవిశ్వాసానికి మద్దతు తెలుపుతూ 8 మంది ఎంపీటీసీలు చేతులు ఎత్తారు. దీంతో వైస్ ఎంపీపీ కంచుగట్ల వీరభద్రం పై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. ఈ సమావేశంలో తహశీల్దార్ స్వర్ణ, ఎండీఓ గంట వరప్రసాద్, సూపర్డెంట్ పిచ్చేశ్వరరావు యూడీసీ పద్మావతి పాల్గొన్నారు.

వెంకటేశ్వర స్వామి వార్షిక కల్యాణ మహోత్సవ ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

నవతెలంగాణ-పాల్వంచ



పాల్వంచలోని శ్రీనివాస కాలనీ శ్రీనివాసగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం గుట్ట వచ్చేనెల ఏప్రిల్ 3 నుండి 6 వరకు జరుగు వార్షిక కళ్యాణంలో భాగంగా ఏప్రిల్ 4న జరుగు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి వార్షిక కళ్యాణ మహోత్సవ ఆహ్వాన పత్రికను సోమవారం ప్రధాన అర్చకులు తోలేటి నరేష్ శర్మ, సహాయ అర్చకులు పని రాజా చార్యులు ఆధ్వర్యంలో వేదమంత్రాలతో పాల్గొన్న తహసీల్దార్ వివేక్, ప్రముఖులు డాక్టర్ బిక్కసారి సుధాకర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భక్త సమాజ మండలి అధ్యక్షులు పసుమర్తి వెంకటేశ్వరరావు, అధ్యక్షులు ఆరుట్ల లక్ష్మణాచార్యులు, ప్రధాన కార్యదర్శి ధర్మపురి రాము, సమన్వయకర్త ఓకే భద్రయ్య ,వర్కింగ్ ప్రెసిడెంట్ రామకృష్ణ, కోశాధికారి శ్రీలత, ఉపాధ్యక్షులు లక్ష్మారెడ్డి, నారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లకు శంకుస్థాపనలు

నవతెలంగాణ-కల్లూరు

మండల పరిధిలోని తాళ్లూరు వెంకటాపురం గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి సోమవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, గ్రామ మాజీ సర్పంచ్ తోటకూరి శేషగిరిరావు పనులు ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర రాష్ట్ర ప్రభుత్వం సత్తుపల్లి శాసనసభ్యులు మట్టా రాగమయ దయానంద్, కృషి ఫలితంగా రూ.15 లక్షల వ్యయంతో సీసీ రోడ్లకు ఎంఎస్, ఆర్ డబల్ యు, ఈజీయస్ నిధుల ద్వారా ఈ సీసీ రోడ్ల నిర్మాణం నిధులు మంజూరు చేయటంతో ఎమ్మెల్యే ఆదేశంతో పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా శేషగిరిరావు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో కేవలం బిఆర్ఎస్ పార్టీకి సంబంధించిన వారికి మాత్రమే అభివృద్ధి ఫలాలు అందాయని, మిగిలిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు కానీ, కార్యకర్తలు కానీ ప్రభుత్వ అభివృద్ధి ఫలాలు అందలేదన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సీనియర్ నాయకులు, మాజీ వార్డు సభ్యులు, జొన్నలగడ్డ ప్రసాదు, పాచవరం సొసైటీ సభ్యులు రామిశెట్టి కృష్ణయ్య, ఎస్యంసీ చైర్మెన్ రామిశెట్టి నాగేశ్వరరావు, జొన్నలగడ్డ బాలరాజు, మర్శకట్ల దావీదు, మర్శకట్ల దేవేందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బోనకల్: మండల పరిధిలోని గోవిందాపురం ఏ గ్రామంలో పలు సిసి రోడ్లకు ఆళ్ళపాడు ఎంపీటీసీ పారా శ్రీదేవి గోవిందాపురం ఏ తాజా మాజీ సర్పంచ్ భాగం శ్రీనివాసరావు సోమవారం శంకుస్థాపనలు చేశారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కృషితో సిసి రోడ్లకు నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోవిందపురం ఏ గ్రామంలో పలు ప్రధాన వీధులలో సిసి రోడ్లకుగాను ఆరు లక్షల రూపాయల మంజూరైనట్లు తెలిపారు. ఈ నిధులతో సిసి రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. అదేవిధంగా ఆళ్లపాడు నుంచి గోవిందపురం ఏ మీదుగా ఆంధ్ర బోర్డర్ వరకు బీటీ రోడ్లకు గాను 2 కోట్ల 90 లక్షల రూపాయలు మంజూరైనట్లు తెలిపారు. గోవిందపురం ఏ దళిత కాలనీ నుంచి మోటమర్రి గ్రామం వరకు బీటీ రోడ్డుకుగాను 4 కోట్ల 20 లక్షల రూపాయలు మంజూరైనట్లు తెలిపారు. ఈ రోడ్లకు త్వరలోనే టెండర్లు పిలిచి నిర్మాణ పనులు ప్రారంభించే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షులు భాగం పాపారావు, కాంగ్రెస్ మండల నాయకులు భాగం నాగేశ్వరావు, గ్రామ కార్యదర్శి పరశురాం, పారా వెంకట మోహన్‌రావు, తోటకూర వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తల్లాడ : మండల పరిధిలోని అన్నారుగూడెం గ్రామంలో సీసీ రోడ్డుకు మాజీ సర్పంచ్ మారెళ్ళ మమత సోమవారం శంకుస్థాపన చేశారు. మమత మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా సిసి రోడ్లు మంజూరు అయ్యాయన్నారు. గ్రామ అభివృద్ధి కోసం కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ గోవింద్ శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు తాళ్ల జోసెఫ్, కాంగ్రెస్ నాయకులు తుమ్మలపల్లి రమేష్, పొన్నం కృష్ణయ్య, గోవింద శ్రీనివాసరావు, గోవింద సురేష్, తోట వెంకటేశ్వర్లు కోసూరు రామారావు తదితరులు పాల్గొన్నారు.

కూతురి నిశ్చితార్థం...తండ్రి హఠాన్మరణం

- శోకసంద్రంలో ముగ్గురు కూతుళ్లు...బంధుమిత్రులు

నవతెలంగాణ-ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి



రెక్కాడితే గానీ డొక్కాడని' టైలరింగ్ వృత్తి చేస్తూ ముగ్గురు ఆడపిల్లలను ఉన్నత చదువులు చదివించి...మంచి ఉద్యో గాల్లో స్థిరపడేలా కృషి చేసిన ఆ తండ్రి గుండె చిన్నకూతురి నిశ్చితార్థం నాడే ఆగిపోయింది. ఖమ్మంలోని షాదీఖానాలో సోమవారం కూతురి నిశ్చితార్థ వేడుక కోసం ఏర్పాట్లలో నిమగ్నమైన మహ్మద్ సాధిక్‌అలీ (65) ఒక్కసారిగా బంధుమిత్రులు చూస్తుండగానే కుప్పకూలిపోయాడు. అందరూ పరుగు పరుగున వచ్చేలోపే ప్రాణాలు విడిచాడు. అప్పటి వరకు నిశ్చితార్థం పనుల్లో సందడి చేస్తూ తిరిగిన తండ్రి కళ్లెదుటే హఠాన్మరణం చెందిన దృశ్యం చూసి ముగ్గురు కూతుళ్ళు, భార్య ఫాతిమా, ఇతర బంధుమిత్రులు కన్నీరుమున్నీరై విలపించారు. అక్కడున్న వారంతా అప్పటి వరకు సాధిక్‌అలీ తమతో గడిపిన విధానాన్ని చెప్పుకుంటూ శోకసంద్రులయ్యారు.

అమ్మాయిలైనా అబ్బాయిలకన్నా మిన్నగా...

దాదాపు 20 ఏళ్ల కిందట తిరుమలాయపాలెం మండలం సుబ్లేడ్ నుంచి చింతకాని మండలం పందిళ్లపల్లి గాంధీనగర్‌కు వచ్చి సాధిక్ అలీ స్థిరపడ్డారు. ఖమ్మంలో న్యూ మధీన టైలరింగ్ షాప్‌ను నిర్వహిస్తున్నారు. ముగ్గురు అమ్మాయిలైనా ఏనాడూ చింతించలేదు. అబ్బాయిల కన్నా మిన్నగా వారిని చదివించాడు. తండ్రి తోడ్పాటుకు తగినట్టుగానే కూతుళ్ల మహ్మద్ తస్లీమ్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, మహ్మద్ తహిమూన్ ఫార్మసిస్టు, మహ్మద్ ఫరహా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. ఇద్దరు పిల్లల పెళ్లిళ్ల చేసిన ఆయన చిన్న పాప పెళ్లి నిశ్చితార్థ వేడుకలో ఉండగా హఠాన్మరణం పాలవడంతో కూతుళ్ల రోదిస్తున్న తీరు కంటతడి పెట్టించింది. చిన్ననాటి నుంచి వ్యవసాయం, టైలరింగ్ వృత్తులు చేస్తూ కాయకష్టం చేసే సాధిక్‌అలీకి గుండెపోటు రావడం చర్చనీయాంశమైంది.



గుండెపోటుతో టీడీపీ సీనియర్ నాయకుడు ఎలనాటి అప్పయ్య మృతి

- నివాళులర్పించిన పలు పార్టీల నాయకులు

నవతెలంగాణ-కొణిజర్ల



మండల పరిధిలోని పెద్దగోపతి గ్రామానికి చెందిన తొలితరం టిడిపి సీనియర్ నాయకుడు ఎలనాటి అప్పయ్య (97) ఆదివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న టిడిపి జిల్లా పార్లమెంట్ అధ్యక్షులు డాక్టర్ రామనాథం కెతినేని హరీష్, కొండబాల కరుణాకర్, మండల టీడీపీ సీనియర్ నాయకుడు మోత్కూరి వెంకటేశ్వరావు, మండల పార్టీ అధ్యక్షుడు తాతా సుధాకర్ రావు, అప్పయ్య మృతదేహంపై పార్టీ జెండా కప్పి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సీపీఐ జాతీయ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ పొట్ల నాగేశ్వరరావు, పిసిసి సభ్యులు వడ్డె నారాయణ, బీఆర్ఎస్ నాయకులు కొండబాల కోటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే చంద్రావతి, ఎల్డీయం చైర్మెన్ సూరంపల్లి రామారావు, ఎంపీపీ గోసు మధు, దొండపాటి రమేష్, ఎర్రబాబు, సీపీఐ(ఎం) నాయకులు బొంతు రాంబాబు, మండల కార్యదర్శి చెరుకుమల్లి కుటుంబరావు, ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు స్వర్ణ సుబ్బారావు, మాజీ సర్పంచ్ దానియేలు, ఎంపీటీసీ వడ్డె రమాదేవి, చింతనిప్పు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

రైతును గోనె సంచిలో కుక్కి..

(మొదటిపేజీ తరువాయి)

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (పీజీఐ) చండీగఢ్‌కు మార్చారు. అక్కడ ఆయన వివిధ గాయాలతో అడ్మిట్ అయ్యాడు. ఆయన కాలు, ముక్కు, దవడలో పగుళ్లు, ఆయన శరీరంపై తీవ్రమైన గాయాలు ఉన్నాయి. సంగ్రూర్ జిల్లా మూనాక్ సబ్ డివిజన్‌లోని నవాంగావ్ గ్రామానికి చెందిన ప్రీత్‌పాల్‌ను ఫిబ్రవరి 21న పంజాబ్ వైపు ఖనౌరీ సరిహద్దు నుండి హర్యానా పోలీసులు పట్టుకున్నారు. లంగర్ భోజనం వడ్డించే సమయంలో ఆయనని గోనె సంచిలో ఉంచి నిర్దాక్షిణ్యంగా కొట్టారు. యాదృచ్ఛికంగా, సంగ్రూర్ పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ స్వస్థలం. ఆయనని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తీసుకెళ్తున్నప్పుడే ప్రీత్‌పాల్ తన తల్లిదండ్రులకు ఫోన్ చేసి ఏమి జరిగిందో వివరంగా చెప్పగలిగాడు. తన కుమారుడి శస్త్రచికిత్స కోసం పీజీఐ చండీగఢ్‌లో ఉన్న ప్రీత్‌పాల్ తల్లి లఖ్వీర్ కౌర్ జాతీయ మీడియాతో మాట్లాడుతూ, ఫిబ్రవరి 21న ప్రీత్‌పాల్ పంజాబీ భూభాగంలోని ఖనౌరీ సరిహద్దులో ఉన్నారని, హర్యానా పోలీసులు రైతులపై అకస్మాత్తుగా టియర్ గ్యాస్ షెల్స్ విసరడం ప్రారంభించారు. "ఆ గందరగోళంలో, టియర్ గ్యాస్ షెల్స్ పడిపోయినప్పుడు, రైతులు తమను తాము రక్షించుకోవడానికి పరిగెత్తడం ప్రారంభించినప్పుడు, హర్యానా పోలీసులు ఖనౌరీ సరిహద్దును దాటి నా కొడుకును ఎత్తికెళ్లారు. ఆయనను గోనె సంచిలో వేసి స్పృహ కోల్పోయే వరకు కర్రలు, రాడ్లతో నిర్దాక్షిణ్యంగా కొట్టారు. ఎలాగోలా ప్రాణాలతో బయటపడ్డాడు" అని చెప్పింది.

"ప్రీత్‌పాల్ రెండు మొబైల్ ఫోన్‌లను తీసుకెళ్లేవాడని లఖ్వీర్ చెప్పారు. ఒకటి హర్యానా పోలీసులు లాక్కోగా, రెండోది ఎలాగో ఆయన జేబులో ఉండిపోయింది. నా కొడుకును కొట్టిన తరువాత, వారు ఆయనని పొలాల్లో విసిరారు. కానీ తరువాత వారు ఆయన పరిస్థితిని చూసి, హర్యానాలోని నర్వానాలో గల ఒక ప్రయివేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. మధ్యాహ్నం 1:30 గంటలకు ప్రీత్‌పాల్‌ను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తీసుకెళ్తున్నప్పుడు, ఆయన కాల్ చేసి, జింద్ జిల్లాలోని నర్వానాకు తీసుకెళ్లినట్లు మాకు తెలియజేశాడు" అని ఆమె చెప్పింది.

"ప్రీత్‌పాల్ పరిస్థితి గురించి తెలుసుకున్న వెంటనే, మేము హర్యానాలోని మా బంధువులకు సమాచారం ఇచ్చాము. వారు అంబులెన్స్‌ను వెంబడించగలిగారు. అది మొదట ఆయనను నర్వానాలోని ఆస్పత్రికి తీసుకెళ్లింది. మేము కూడా వెంటనే సంగ్రూర్ నుండి పరుగెత్తాము. కానీ ఆయన పరిస్థితిని చూసిన వైద్యులు నా కొడుకును పీజీఐ రోహ్‌తక్‌కు రిఫర్ చేశారు. అక్కడ ఆయన మూడు రోజులు ఉన్నాడు. ఈ మూడు రోజులు నా కొడుకు నరకం చూశాడు" అని ఆమె తెలిపింది.

పీజీఐ రోహ్‌తక్‌లో హర్యానా పోలీసులు, సివిల్ దుస్తుల్లో ఉన్న కొందరు వ్యక్తులు తమను 24 గంటలు ట్రాక్ చేశారని లఖ్వీర్ చెప్పారు. "పీజీఐ రోహ్‌తక్‌లో హర్యానా పోలీసులను నా కొడుకు గది బయట మోహరించారు. మేం ఎప్పుడు మాట్లాడినా, ఏ ఫోన్ కాల్ వచ్చినా సివిల్ డ్రెస్‌లో ఉన్న మగవాళ్లు మమ్మల్ని అనుసరించేవారు. వారు పగలు, రాత్రి అంతా మమ్మల్ని ట్రాక్ చేస్తూనే ఉన్నారు. మేము కాల్ తీసుకోవడానికి బయటకు వెళ్లినా, వారు మమ్మల్ని అనుసరించేవారు. మా సంభాషణను వినడానికి ప్రయత్నించేవారు. మీడియాతో మాట్లాడవద్దని మమ్మల్ని బెదిరించారు. మేము నిస్సహాయంగా భావించాము. వీలైనంత త్వరగా పంజాబ్ చేరుకోవాలనుకున్నాం" అని ఆమె చెప్పింది.

"భయ వాతావరణం నెలకొంది. మేము పీజీఐ రోహ్‌తక్‌లో అసురక్షితంగా, ఇబ్బందిగా భావించాము. నా కొడుకు స్పృహలోకి వచ్చినప్పుడల్లా, ఆయనను పంజాబ్‌కు తీసుకెళ్లమని మమ్మల్ని వేడుకునేవాడు. మేము అక్కడ ఉండలేకపోవడంతో హర్యానా పోలీసులు ప్రీత్‌పాల్‌ను పీజీఐ రోహ్‌తక్‌కు తీసుకెళ్లారు. సీనియర్ రైతు సంఘం నాయకుడు బల్దేవ్ సింగ్ సిర్సా మాకు సహాయం చేయకపోతే, మేము నాశనం అయ్యేవాళ్లం. ఆయన మాతో టచ్‌లో ఉన్నాడు. ప్రీత్‌పాల్ పంజాబ్‌కు తిరిగి రావడానికి వేగవంతం చేశాడు" అని లఖ్వీర్ చెప్పారు.

ఆదివారం ప్రీత్‌పాల్‌కు వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించారు. మధ్యాహ్నం ప్రారంభమై సాయంత్రం 6 గంటల వరకు సాగింది. రైతు సంఘాలు ఈ విషయాన్ని పంజాబ్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో ప్రీత్‌పాల్ పంజాబ్‌కు తిరిగి రావడం సాధ్యమైంది. పంజాబ్ చీఫ్ సెక్రటరీ అనురాగ్ వర్మ, హర్యానా చీఫ్ సెక్రటరీ సంజీవ్ కౌశల్‌కు ప్రీత్‌పాల్ సింగ్‌ను చికిత్స కోసం తిరిగి పంపాలని అభ్యర్థిస్తూ లేఖ పంపారు.

వాస్తవానికి, ఫిబ్రవరి 21 నాటి గందరగోళం నేపథ్యంలో సివిల్ దుస్తుల్లో ఉన్న పురుషులు ఖానౌరీ సరిహద్దు నుండి కొంతమంది యువకులను ఎత్తుకెళ్లి హర్యానాకు తీసుకెళ్లి కనికరం లేకుండా కొట్టారని రైతులు పేర్కొన్నారు. వారు అన్నింటినీ దోచుకుంటూ, రైతులను దుర్భాషలాడుతూ, లాఠీలతో కొట్టినప్పుడు హర్యానా పోలీసులే ఈ వ్యక్తులను సివిల్ దుస్తులలో రక్షించారని కూడా వారు చెప్పారు. ప్రీత్‌పాల్ సింగ్ నివాసానికి ఎస్కేఎం నేతలు వెళ్లి కుటుంబాన్ని పరామర్శించారు.

ముగ్గురు ఐపీఎస్ అధికారుల బదిలీ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్రంలో ముగ్గురు ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఆదేశాలు జారీచేసింది. హైదరాబాద్ నగర అదనపు పోలీసు కమిషనర్(ట్రాఫిక్)గా పనిచేస్తున్న విశ్వప్రసాద్‌ను రాష్ట్ర పోలీసు ఆర్గనైజేషన్ విభాగం ఐజీగా బదిలీ చేశారు. హైదరాబాద్ నగర అదనపు పోలీసు కమిషనర్(సిట్, క్రైమ్)గా ఉన్న ఏవీ రంగనాథ్‌ను మల్టీజోన్ ఐజీ1గా బదిలీ చేశారు.

ఐజీగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న సుధీర్‌బాబును అక్కడ నుంచి తప్పించారు. హైదరాబాద్ నగర సెంట్రల్ జోన్ డీసీపీగా పనిచేస్తున్న శరత్‌చంద్ర పవార్‌ను టీఎస్ నార్కోటిక్ సెల్ విభాగం ఎస్పీగా బదిలీ చేశారు. త్వరలోనే మరికొంత మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేయనున్నట్టు తెలిసింది.

టార్గెట్ @ రూ.10 వేల కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

రెండవ దశలో స్థలాల క్రమబద్ధీకరణ అర్హత గుర్తించి సిఫారసు చేయడం, మూడో దశలో సంబంధిత అధికారి నిబంధనల మేరకు ఫీజు చెల్లించాలని నోటీసులు జారీ చేశారు. అయితే ఈ ప్రక్రియ పూర్తయినప్పటికి మూడున్నరేండ్లుగా ఎలాంటి పురోగతి కన్పించలేదు. తాజాగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ ఎల్‌ఆర్‌ఎస్ పథకాన్ని తిరిగి పట్టాలెక్కించేందుకు నిర్ణయం తీసుకుంది. దరఖాస్తుదారులు మార్చి 31లోగా లే-అవుట్లను క్రమబద్ధీకరించుకనేందుకు అవకాశం కల్పించింది. దేవాదాయ, వక్ఫ్, ప్రభుత్వ భూములు, కోర్టు ఆదేశాలు ఉన్న భూములను తప్ప ఇతర లే-అవుట్‌లను క్రమబద్ధీకరించనున్నట్టు సర్కార్ ఈ సందర్భంగా తెలిపింది.

క్రమబద్ధీకరణ చార్జీలు

చదరపు గజం ధర రూ. 3,000 కంటె తక్కువ ఉంటే రిజిస్ట్రేషన్ విలువలో 20 శాతం చెల్లించాలి

రూ.3,001 నుంచి రూ.5,000 వరకు 30 శాతం

రూ.5,001 నుంచి రూ.10,000 వరకు 40 శాతం

రూ.10,001 నుంచిరూ.20,000 వరకు 50 శాతం

రూ.20,001 నుంచి 30,000 వరకు 60 శాతం

రూ.30,001 నుంచి రూ.50,000 వరకు ఉంటే 100 శాతం చెల్లించాలి.


ఎల్‌ఆర్‌ఎస్ క్రమబద్ధీకరణలో నాలా కన్వర్షన్ (వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చేందుకు) నిర్ణయించిన ఫీజును అదనంగా చెల్లించాలి. ఆమోదం పొందని లే అవుట్లలో 10 శాతం ఖాళీ స్థలం అందుబాటులో లేక పోతే ప్లాట్ విలువలో 14 శాతం ప్రో రేటా ఓపెన్ స్పేస్ చార్జీలు చెల్లించాలి.

అర్హుల ఎంపికపై అనుమానాలు?

గ్రామ పంచాయితి నుంచి మొదలుకుని కార్పొరేషన్ల వరకు వేలాది అక్రమ లేఅవుట్ వెంచర్లు ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న 25.44 లక్షల దరఖాస్తుల్లో సగం వారివే అని తెలుస్తోంది. నిబంధనలు అతిక్రమించిన వారి దరఖాస్తులకు సైతం గత సర్కార్ ఎల్‌ఆర్‌ఎస్‌కు అనుమతించినట్టు అప్పట్లో విమర్శలు వెల్లువెత్తాయి. రోడ్డు వెడల్పు, కనీసం 9 మీటర్లుండాలి, బలహీన వర్గాలకు చెందిన లే అవుట్లు లేదా 100 మీటర్ల ప్లాట్లకు తక్కువ ఉన్న వాటిలో రహదారి 6 మీటర్ల వరకు ఉండాలి.

అవసరమైన భూమి లేకుంటే రెండు వైపులా సమానంగా వెడల్పు చేయడానికి అవసరమైన భూమి ఉండాలి. ఇలా అనేక నిబంధనలు ఉన్నప్పటికి అప్పటి సర్కార్ ఆదాయం కోసం వాటిని ఓవర్ కం చేసి సరైనవేనని సిఫారసు చేసినట్టు తెలుస్తోంది. అయితే కోర్టులో ఉన్న కేసులను పరిష్కరించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోక పోవడంతో ఆ పథకం మూడున్నరేండ్లుగా పెండింగ్‌లో ఉంది.

షాజహాన్ అరెస్టుపై స్టే లేదు



కోల్‌కతా : సందేశ్‌ఖలిలో నెలకొన్న అశాంతి కలకత్తా హైకోర్టును చేరింది. పరారీలో వున్న తృణమూల్ కాంగ్రెస్ నేత, ఉత్తర 24 పరగణాల జిల్లా పరిషత్‌కి చెందిన షేక్ షాజహాన్ అరెస్టుపై ఎలాంటి స్టే లేదని ప్రధాన న్యాయమూర్తి టి.ఎస్.శివజ్ఞానం నాయకత్వంలోని డివిజన్ బెంచ్ స్పష్టం చేసింది. నాలుగేండ్ల క్రితమే ఫిర్యాదులు వచ్చాయి. ఇంతవరకు ఎందుకు అరెస్టు చేయలేదు. వెంటనే అరెస్టు చేయండి అంటూ బెంచ్ ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో పబ్లిక్ నోటీసు ఇవ్వండని పేర్కొంది. సందేశ్‌ఖలిలో తృణమూల్ కాంగ్రెస్ నేతలు లైంగిక వేధింపులకు, బెదిరింపులకు పాల్పడుతున్నారని వచ్చిన ఆరోపణలను కోర్టు తనకు తానుగా పరిగణనలోకి తీసుకుంది. షాజహాన్ అరెస్టుపై ఎలాంటి స్టే లేదని కోర్టు స్పష్టం చేసిన నేపథ్యంలో వారం రోజుల్లో అరెస్టు చేస్తామని తృణమూల్ పార్టీ ప్రతినిధి కునాల్ ఘోష్ సోషల్ మీడియాలో తెలిపారు. ఆయనను అరెస్టు చేయడంపై స్టే వుండడంతో పోలీసులు చర్యలు తీసుకోలేకపోతున్నారంటూ పార్టీ నేత అభిషేక్ బెనర్జీ ఇంతకుముందు తెలిపారు. ఈ నేపథ్యంలో కోర్టు వికరణ వెలువడింది. హైకోర్టు తీసుకున్న నిర్ణయాన్ని బెంగాల్ గవర్నర్ సి.వి.ఆనందబోస్ సమర్థించారు. ముఖ్యమైన నిర్ణయాన్ని న్యాయస్థానం తీసుకుందన్నారు. ఎన్నికైన ప్రభుత్వం చట్టపరిధిలో చర్యలు తీసుకుంటుందా లేదా అని చూడడమే గవర్నర్ విధి అని, అప్పటివరకు గవర్నర్ జోక్యం చేసుకోరాదని వ్యాఖ్యానించారు.

షాజహాన్ పూర్తిగా రాష్ట్ర పోలీసుల ఆశ్రయంలో వున్నారంటూ సిపిఎం ఎంపి వికాస రంజన్ భట్టాచార్య విమర్శించారు. సందేశ్‌ఖలిలో తృణమూల్ నేతల ఇళ్ళ వద్ద భారీగా బందోబస్తు ఏర్పాట్లు చేపట్టారు. నేతల చర్యలపై ఆగ్రహావేశాలతో వున్న ప్రజలు ఇండ్లపై రాళ్ళ వేస్తుండడంతో ఈ చర్యలు తీసుకున్నారు.

బెర్మాజర్‌కి చెందిన టీఎంసీ నేత శంకర్ సర్దార్ ఇంటిపై సోమవారం ఉదయం గ్రామస్తులు దాడి చేశారు. మంత్రులకు సన్నిహితంగా వుండే సర్దార్ తమను తరచూ అడ్డగిస్తూ, బెదిరిస్తున్నాడని వారు ఆరోపించారు.

స్థానికంగా బలమున్న మరో నేత అజిత్ మెయితీ ఇంటిపై కూడా ఆదివారం గ్రామస్తులు దాడి చేశారు. దాంతో భయపడిన మెయితీ పారిపోయి ఒక వలంటీర్ ఇంట్లో తల దాచుకున్నాడు. పోలీసులు అక్కడకు వెళ్ళి ఆయనను అదుపులోకి తీసుకున్నారు.

అగ్నిపథ్‌తో యువతకు అన్యాయం

- ప్రమాదంలో రెండు లక్షల మంది యువత భవిష్యత్తు
- రాష్ట్రపతి ముర్ముకు మల్లికార్జున్ ఖర్గే లేఖ
- ప్రభుత్వం సైన్యాన్ని బలహీనపరిచింది
- అగ్నిపథ్‌ను రద్దు చేస్తాం
- పాత రిక్రూట్‌మెంట్ స్కీమ్‌ను తిరిగి ప్రవేశపెడతాం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం సైన్యంలో ప్రవేశపెట్టిన అగ్నిపథ్ స్కీమ్‌పై కాంగ్రెస్ మరోసారి విరుచుకుపడింది. అగ్నిపథ్ పథకం కారణంగా సాయుధ దళాలలో యువతకు అన్యాయం జరుగుతోందని, వారి ఉపాధి పోతోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే పేర్కొన్నారు. సోమవారం ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే లేఖ రాశారు. కేంద్రం తీసుకున్న నిర్ణయంతో రెండు లక్షల మంది యువత భవిష్యత్తు ప్రమాదంలో పడిందని ఆరోపించారు. "బీజేపీ సర్కార్ సాయుధ దళాల్లో నియామకాల్ని మరింత కఠినతరం చేసింది. దీనికితోడు తాత్కాలికంగా రిక్రూట్‌మెంట్ చేసుకోవడం యువత భవిష్యత్తును అంధకారంలో పడేయటమే. యువత తమ కల సాకారం అవుతుందని ఏండ్లుగా ఎదురుచూస్తున్నారు. ప్రధాని మోడీ తీసుకొచ్చిన అగ్నిపథ్‌తో యువతలో నిరాశ పెరిగిపోయింది. ఎంతో మంది యువత ఆత్మహత్య చేసుకున్నారు. వారికి న్యాయం జరగాలి. సాయుధ దళాల్లో ఎంపికైన వారిని ఈ మధ్య కలిశాను. ప్రభుత్వ చర్యతో దేశ సేవ చేసేందుకు వారు ఏ మాత్రం ఆసక్తి చూపడం లేదు. 2019-22 మధ్యకాలంలో దాదాపు రెండు లక్షల మంది త్రివిధ దళాల్లో చేరారు. ఎన్నో పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి వారు కొలువులు సంపాదించారు. జాయినింగ్ లెటర్‌ల కోసం ఎదురు చూశారు. వారి ఆశలను సమాధి చేస్తూ ప్రభుత్వం అగ్నిపథ్ పథకంతో నియామకాలను చేపట్టాలని నిర్ణయించింది. ఈ పథకం తనకు ఆశ్చర్యానికి గురి చేసిందని ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ ఎంఎం నరవాణే ఒక పుస్తకంలో రాశారు. ఈ పథకం వివక్షతో కూడినది. దీని కింద నియమితులైన వారికి నాలుగేండ్లే ఉద్యోగం కల్పించి.. తరువాత ఉద్యోగం నుంచి తీసేస్తే.. దేశ వ్యాప్తంగా నిరుద్యోగిత రేటు పెరిగిపోతుంది" అని ఖర్గే లేఖలో పేర్కొన్నారు.

అగ్నిపథ్‌ను రద్దు చేసి, పాత రిక్రూట్‌మెంట్ స్కీమ్ తెస్తాం: సచిన్ పైలట్

అగ్నిపథ్‌ను రద్దు చేస్తామని, పాత సాయుధ సేవల రిక్రూట్‌మెంట్ స్కీమ్‌ను తిరిగి ప్రవేశపెడతామని కాంగ్రెస్ నేతలు సచిన్ పైలట్ హామీ ఇచ్చారు. సైన్యంలో నాలుగేండ్ల సర్వీస్ అనంతరం రిటైరైన తరువాత ఉద్యోగుల భవితవ్యంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం నాడిక్కడ ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎంపీ దీపేందర్ హుడాతో కలిసి ఆయన మాట్లాడారు. "అగ్నిపథ్ స్కీమ్‌లో భాగంగా 17.5 ఏండ్ల నుంచి 21 ఏండ్ల వయస్సు వారిని నాలుగేండ్లు సైన్యంలో సేవలందించేందుకు సర్వీసులోకి తీసుకువెళతారు.

అయితే నాలుగేళ్ల సర్వీస్ అనంతరం వారిలో 25 శాతం మంది 15 ఏండ్ల పాటు సర్వీస్‌లో కొనసాగనిస్తారు. ఇక నాలుగేండ్ల అనంతరం రిటైరయ్యే యువ ఉద్యోగుల భవిష్యత్‌కు ఎలాంటి హామీ లేదని వారికి ఆ వయస్సులో పెన్షన్ రాదు. గ్రాట్యుటీ రూ.11 లక్షలను వారి వేతనం నుంచి తగ్గిస్తారు" అని సచిన్ పైలట్ ఆందోళన వ్యక్తం చేశారు. వ్యయ నియంత్రణ చర్యల పేరుతో సాయుధ దళాల నియామక ప్రక్రియతో చెలగాటమాడుతున్నారని దుయ్య బట్టారు. ప్రపంచంలోనే మన సైన్యం, రక్షణ బలగాల పాటవం, స్వయం కృషి మరుపురానివని సచిన్ పైలట్ పేర్కొన్నారు.

"మన రక్షణ వ్యయం పెరుగుతోంది... రక్షణ ఎగుమతుల ద్వారా చాలా డబ్బు సంపాదిస్తున్నామని.. మనం స్వతంత్రంగా మారి స్వదేశీ తయారీ చేస్తున్నామని ఇటీవల చెప్పారు. మన రక్షణ శాఖ ఇంత ఆదాయాన్ని ఆర్జిస్తున్నట్లయితే, మనం అంత సామర్థ్యం సాధిస్తున్నట్లయితే, మన వీర సైనికుల ఉద్యోగాలు, నియామకాలు, కుటుంబాలకు వనరులను అందుబాటులో ఉంచడం చాలా ముఖ్యమైనది" అని అన్నారు. అగ్నిపథ్ పథకాన్ని కేవలం "రాజకీయాకరించిన" ఖర్చు తగ్గించే చర్యగా విమర్శించారు. ప్రభుత్వం సైన్యాన్ని బలహీన పరిచిందని ఆరోపించారు.

జి-20 సమ్మిట్‌కు రూ.4,100 కోట్లు, ప్రధానమంత్రి విమానానికి రూ.4,800 కోట్లు, సెంట్రల్ విస్టా ప్రాజెక్ట్‌పై రూ.20,000 కోట్లు, ప్రకటనల కోసం రూ.6,500 కోట్లు ఖర్చు చేసిన మోడీ ప్రభుత్వం, రిక్రూట్‌మెంట్ ప్రక్రియలో గందరగోళం సృష్టిస్తుందా? అని పైలట్ ప్రశ్నించారు. డబ్బు ఆదా చేయడం దేశ భద్రత, సమగ్రతకు సవాలుగా మారుతుందని అన్నారు.

అగ్నిపథ్ పథకాన్ని తీసుకురావాలని సైన్యం, దాని నాయకత్వం, యువత లేదా ఏ రాజకీయ పార్టీ నుండి ఎలాంటి డిమాండ్ లేదని దీపేందర్ హుడా అన్నారు. ఆర్మీ రిక్రూట్‌మెంట్‌లు ఏడాదికి సగటున 60,000-65,000 కు, 45,000కు అగ్నివీర్ రిక్రూట్‌మెంట్లకు గతేడాదిలో క్షీణించాయని హుడా తెలిపారు. "రిక్రూట్‌మెంట్ సంఖ్యలు ఈ స్థాయిలో తగ్గుతూ ఉంటే, 1.4 మిలియన్ల మా సైన్యం పదేండ్లలో 8,00,000కి తగ్గుతుంది" అని ఆయన అన్నారు.

"ఒకే ర్యాంక్, ఒకే పెన్షన్" అనే ఎన్నికల వాగ్దానాన్ని నెరవేర్చడానికి బదులుగా, ప్రభుత్వం "నో ర్యాంక్, నో పెన్షన్" విధానాన్ని అమలు చేసిందని ధ్వజమెత్తారు. బీజేపీ నాయకుడు కైలాష్ విజయ వర్గీయ అగ్నివీరులకు వారి కార్యాలయాల్లో సెక్యూరిటీ గార్డులుగా ఉద్యోగాలు ఇస్తామని చెప్పడంపై ఆయన మండిపడ్డారు. ఒక్కసారి యువత సరిహద్దులకు వెళ్లి తమ ప్రాణాలను పణంగా పెట్టి దేశాన్ని కాపాడుకుంటారని అన్నారు. అలాంటి వారు కూలీలుగా మారుతారని విమర్శించారు.

పలువురు ఐఎఫ్‌ఎస్‌ల బదిలీలు, ఉద్యోగోన్నతులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పలువురు ఐఎఫ్‌ఎస్‌లకు ఉద్యోగోన్నతులు, బదిలీలు, పోస్టింగ్‌లు కల్పిస్తూ సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి జీవోలను జారీ చేశారు. ఇప్పటిదాకా పీసీసీఎఫ్(ఎఫ్‌సీఏ)గా పనిచేస్తున్న మోహన్‌చంద్ర పర్గెయిన్ పీసీసీఎఫ్(వైల్డ్ లైఫ్, చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్) పోస్టుకు బదిలీ అయ్యారు. పీసీసీఎఫ్(హరితహారం) బాధ్యతలు చూస్తున్న డాక్టర్ సి.సువర్ణ పీసీసీఎఫ్(కంపా)గా నియమితులయ్యారు. అడిషనల్ పీసీసీఎఫ్(హెచ్‌ఓఎఫ్ఎఫ్)గా పనిచేస్తున్న సునీతా మహేశ్ భగవత్ పీసీసీఎఫ్(అడ్మినిస్ట్రేషన్)కు బదిలీ అయ్యారు. ప్రమోషన్లు పొందిన ఐఎఫ్‌ఎస్ అధికారుల్లో ఎస్.శాంతారామ్, ఎస్.రాంబాబు, డాక్టర్ సునీల్ ఎస్.హిరిమత్ ఉన్నారు. 2010 ఐఎఫ్‌ఎస్ బ్యాచ్‌కు చెందిన ఎస్.శాంతారామ్‌కు కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(సీఎఫ్) ఉద్యోగోన్నతి కల్పించి సూపర్ టైమ్ స్కేల్(ఐ) వర్తింపజేశారు. అతన్ని కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫీల్డు డైరెక్టర్‌గా నియమించారు. 2011 బ్యాచ్‌కు చెందిన సునీల్ ఎస్.హిరిమత్ నెహ్రూ జువాలజికల్ పార్కు క్యూరేటర్‌గా నియమితులయ్యారు. అదే బ్యాచ్‌కు చెందిన రాంబాబు హైదరాబాద్ సర్కిల్ డీసీఎఫ్, సీఎఫ్‌గా ప్రమోషన్ పొందారు.

కేంద్రం తీరు వల్లే రాబడికి గండి..

- జీఎస్టీ పరిహారం రూ.4 వేల కోట్లు రావాలె...
- సీఎం దృష్టికి తెచ్చిన ఉన్నతాధికారులు
- నిర్దేశిత లక్ష్యం మేరకు పన్నులు వసూలు చేయాలంటూ రేవంత్ ఆదేశాలు
- నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్ రవాణాను అరికట్టాలి
- వాణిజ్య పన్నులు, రిజిస్ట్రేషన్ శాఖకు సొంత భవనాలుండాలి
- సమగ్రమైన ఇసుక విధానాన్ని రూపొందించాలంటూ సూచన
- గనుల శాఖ విధించిన జరిమానాలను వసూలు చేయాలి
- ఏండ్లుగా తిష్టవేసిన అధికారులను బదిలీ చేయాలంటూ ఆదేశాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం గతేడాది వరకు జీఎస్టీ పరిహారం కింద రూ.4 వేల కోట్లకుపైగా తెలంగాణకు చెల్లించేదని ఉన్నతాధికారులు... ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తెలిపారు. దాని గడువు ముగిసినా, వాటిని మోడీ సర్కార్ చెల్లించకపోవటంతో రాష్ట్ర ప్రభుత్వ రాబడిలో వ్యత్యాసం కనిపిస్తోందని వారు ఆయనకు విన్నవించారు. వాణిజ్య పన్నుల శాఖలో పన్ను లక్ష్యానికి, రాబడికి మధ్య వ్యత్యాసం ఎందుకు ఎక్కువగా ఉంటోందంటూ సీఎం ప్రశ్నించిన సందర్భంగా అధికారులు ఈ మేరకు వివరణిచ్చారు.

2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వాణిజ్య పన్నులు, ఆబ్కారీ, రిజిస్ట్రేషన్లు, రవాణా, గనులు, భూగర్భ వనరుల శాఖల పన్ను వసూళ్లపై సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ సమీక్ష నిర్వహించారు. నిర్దేశిత లక్ష్యం మేరకు అన్ని శాఖలూ పన్నులు వసూలు చేయలంటూ ఆయన ఈ సందర్భంగా ఆదేశించారు. పొరుగు రాష్ట్రాల నుంచి నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ రాష్ట్రంలోకి రాకుండా అడ్డుకోవాలని సూచించారు. మద్యం సరఫరా, విక్రయాలకు సంబంధించిన లెక్కల్లో తేడాలు ఉంటున్నాయని తెలిపారు. ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలని కోరారు. ప్రతీ డిస్టలరీ వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. మద్యం సరఫరా వాహనాలకు జీపీఎస్ అమర్చి వాటిని ట్రాకింగ్ చేయాలనీ, బాటిల్ ట్రాకింగ్ సిస్టం కూడా ఉండాలని తెలిపారు. ఆయా వాహనాల వే-బిల్లులు కచ్చితంగా ఉండాలంటూ సూచించారు. నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్‌తోపాటు గతంలో నమోదు చేసిన పలు కేసుల పురోగతిపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయనే విషయాన్ని అధికారులు సీఎం దృష్టికి తెచ్చారు. తమ శాఖలోనూ అదే పరిస్థితి నెలకొందని వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ డాక్టర్ టి.కె.శ్రీదేవి తెలిపారు. ఈ అంశాలపై స్పందించిన సీఎం... ఆదాయాన్ని తెచ్చే శాఖలకు సొంత భవనాలు లేకపోవడం సరికాదన్నారు. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా నూతన భవనాలు నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అవసరాలకు అనుగుణంగా హైదరాబాద్‌తోపాటు జిల్లా కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాలను వినియోగించుకోవాలని ఆయన సూచించారు. హైదరాబాద్‌తోపాటు వివిధ నగరాల్లోని పలు ప్రాంతాల్లో రహదారులపై కంకరను కుప్పలుగా పోసి విక్రయిస్తున్నారనీ, వివిధ ప్రదేశాల్లోని ప్రభుత్వ ప్రభుత్వ స్థలాలను అందుకు వినియోగించాలని పేర్కొన్నారు. ఇసుక విక్రయాలపై సమగ్ర విధానాన్ని రూపొందించాలని సీఎం ఆదేశించారు. వే-బిల్లులతోపాటు ఇసుక సరఫరా వాహనాలకు ట్రాకింగ్ ఉండాలని అన్నారు. ఆ మేరకు చర్యలు తీసుకోవటం ద్వారా అక్రమ రవాణాకు ఆస్కారం లేకుండా చూడాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘించినందుకుగానూ పలు గనులపై గతంలో జరిమానాలు విధించారనీ, కేసులు నమోదు చేశారని గుర్తు చేశారు. ఆయా జరిమానాలను వెంటనే వసూలు చేయాలని ఆదేశించారు. గతంలో జరిమానాలు విధించి తర్వాత వాటిని తగ్గించారనీ, అందుకుగల కారణాలను తెలుపుతూ ఒక నివేదిక సమర్పించాలని కోరారు. టీఎస్ఎండీసీతోపాటు గనుల శాఖలో పలువురు అధికారులు ఒకే పోస్టులో ఏండ్ల తరబడి తిష్ట వేయటంపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిలో కొందరిపై ఆరోపణలున్నాయని గుర్తు చేశారు. అలాంటి వారిని వెంటనే బదిలీ చేయాలని ఆదేశించారు. సమీక్షలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారితోపాటు ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నేడు ఆర్ట్ ఎగ్జిబిషన్ ప్రారంభం

- ఎంఆర్ఈఐఎస్ కార్యదర్శి వెల్లడి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ మైనార్టీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 11.30కి ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభిస్తున్నట్టు ఆ సంస్థ కార్యదర్శి అయిషా మసరత్ ఖానం తెలిపారు. ఎంపీసీసీ హాల్, కావూరి హిల్‌లో నిర్వహిస్తారు. ఎగ్జిబిషన్‌లో 204 పాఠశాలల విద్యార్థులు పాల్గొంటున్నారని తెలిపారు.

కాంగ్రెస్ లోకి తీగల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, రంగారెడ్డి జిల్లా జెడ్పీ చైర్ పర్సన్ తీగల అనితా రెడ్డి సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఏఐసీసీ ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షి వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.

సింగరేణి కార్మికులకు నజరానా

- రూ. కోటి ఉచిత ప్రమాద బీమా
- సంస్థ ప్రైవేటీకరణను బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రోత్సహించింది
- కేసీఆర్ హయంలో కార్మికులు నిర్లక్ష్యానికి గురయ్యారు
- కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు సైతం రూ.30 లక్షలు వర్తింపు
- తెలంగాణ ఉద్యమంలో సింగరేణి కార్మికులు కీలక పాత్ర పోషించారు
- బీఆరెస్ పాలనలో నీళ్ల ముసుగులో నిధుల దోపిడీ
- రూ. 6వేల కోట్ల నుంచి రూ.7 లక్షల కోట్లకు అప్పులు
- ఆర్థిక నియంత్రణ పాటిస్తూ, అన్ని వర్గాలకు న్యాయం చేస్తున్నాం
- మోడీ మూడోసారి పీఎం అయితే రైతులను కాల్చి చంపుతారు
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలంగాణకు చేసిందేమిటో చెప్పాలి?: ఉచిత బీమా ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

"తెలంగాణ ఉద్యమ సమయంలో సింగరేణి కార్మికులు కీలకపాత్ర పోషించారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక సింగరేణి కార్మికులు నిర్లక్ష్యానికి గురయ్యారు. సంస్థను ప్రయివేటుపరం చేయడాన్ని బీఆరెస్ అడ్డుకోకపోగా ప్రోత్సహించింది" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. సోమవారం సచివాలయంలో సింగరేణి ఉద్యోగులకు కోటి రూపాయల ఉచిత ప్రమాద బీమా పథకాన్ని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వర్ రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, కొండా సురేఖతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం సిగరేణి ఎమ్‌డీ బలరాం, యూనియన్ బ్యాంక్ ప్రతినిధి కారె భాస్కర్ రావు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. అనంతరం సీఎం మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా మొదటి సారిగా సింగరేణి కార్మికులకు ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్టు చెప్పారు. పర్మినెంట్ ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సైతం రూ.20 నుంచి రూ.30 లక్షల వరకు బీమాను వర్తింప జేయనున్నట్టు తెలిపారు. గత సర్కార్ నిర్వాకం వల్ల రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. "పదేండ్లలో వందేండ్ల విధ్వంసం జరిగింది. బీఆరెస్ పాలనలో నీళ్ల ముసుగులో నిధుల దోపిడీ జరిగింది. 2014లో రూ.72 వేల కోట్ల అప్పులుంటే పదేండ్ల బీఆర్ఎస్ హయాంలో రూ.7 లక్షల కోట్లకు చేర్చారు. ఏటా రూ.6 వేల కోట్లు చెల్లించాల్సిన అప్పులను రూ.70 వేల కోట్లకు చేర్చారు. చేసిన అప్పులకు వడ్డీలు కట్టడానికి సర్కారు తిరిగి అప్పులు చేయాల్సిన పరిస్థితి దాపురించింది" సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. గత పాలకులు సృష్టించిన సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ, పేదలకు ఉపయోగపడే పనులు చేస్తూ ముందుకెళుతున్నామని చెప్పారు. అన్ని వర్గాలను సంతృప్తిపరిచేలా తమ ప్రభుత్వం చేస్తున్న పనులను అభినందించాల్సింది పోయి కేసీఆర్, కేటీఆర్, హరీశ్ అబద్దాలు చెబుతున్నారని విమర్శలు గుప్పించారు. కాళేశ్వరం తప్పిదాలకు గత పాలకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కృష్ణా జలాలపై హరీశ్ రావు మళ్లీ అవే అబద్దాలు చెబుతున్నారని ఆరోపించారు. 2014, 2018, మ్యానిఫెస్టోల్లో ప్రజలకిచ్చిన హామీలపై బీఆర్ఎస్ బీజేపీ చర్చకు రావాలని సవాల్ విసిరారు. మూడోసారి మోడీని ప్రధాని చేస్తే ఏం చేస్తారు? రైతులను కాల్చి చంపుతారా? అంటూ ప్రశ్నించారు. కేంద్ర మంత్రిగా ఉండి తెలంగాణ కు కిషన్ రెడ్డి ఏం చేశారో చెప్పాలని నిలదీసారు. హైదరాబాద్ లో వరదలు వచ్చినపుడు ఎన్ని నిధులు తెచ్చారో చెప్పాలన్నారు. రెండు పార్టీలకు కాంగ్రెస్‌ను విమర్శించే నైతిక హక్కులేదని అన్నారు. 60 రోజుల్లోనే 25 వేల ఉద్యోగాలిచ్చి నిరుద్యోగులకు భరోసా కల్పించామని చెప్పారు. మార్చి 2న మరో 6వేల పైచిలుకు ఉద్యోగాలు భర్తీ చేయబోతున్నామని ప్రకటించారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేవారి కోసం నియోజక వర్గానికొకటి చొప్పున అంబేద్కర్ నాలెడ్జి సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగరేణి ప్రాంత ఎమ్మెల్యేలు, ప్రభుత్వ సలహాదారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సింగరేణి ప్రమాద బీమా ముఖ్యాంశాలు

1) ఉద్యోగుల జీతంతో సంబంధం లేకుండా కోటి రూపాయల ఉచిత ప్రమాద బీమా సదుపాయం

2). యూనియన్ బ్యాంక్ డెబిట్ కార్డును నెలలో ఒక్కసారైనా వాడటం ద్వారా అదనంగా 15 లక్షల రూపాయల బీమా ప్రయోజనం.

3). ఒక్క రూపాయి కూడా చెల్లించనవసరం లేకుండా రూ. 1 కోటి 15 లక్షల ప్రమాద బీమా సదుపాయం సింగరేణి ఉద్యోగులకు అందుతుంది.

4). అగ్ని ప్రమాదం జరిగి ప్లాస్టిక్ సర్జరీ లాంటి ట్రీట్‌మెంట్ అవసరమైతే రూ.2 లక్షల వరకు ఆర్థిక సాయం.

5). ప్రమాదంలో మరణించిన ఉద్యోగి మృతదేహాన్ని తరలించేందుకు రూ. 20 వేల ఆర్థిక సహాయం

6). ప్రమాదంలో ఉద్యోగి చనిపోయే సమయానికి గ్రాడ్యుయేషన్ చదివే పిల్లలు ఉన్నట్లయితే రూ.6 లక్షల ఆర్థిక సాయం.

7). ఎయిర్ అంబులెన్స్ అవసరమైతే 6 లక్షల రూపాయల వరకు ఆర్థిక సాయం.

8). ప్రమాదం జరిగిన ప్రదేశానికి ఇద్దరు కుటుంబ సభ్యులు వెళ్లడానికి వీలుగా రవాణా ఖర్చుకింద రూ.20 వేల ఆర్థిక సాయం.

9). అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరి చికిత్స తీసుకుంటే ఏడాదిలో రూ. 15 వేల వరకు ఇన్ పేషెంట్ కవరేజ్ సదుపాయం.

10). విదేశీ విద్యకోసం తీసుకునే రూ. 75 లక్షలకు పైగా రుణాలపై 0:10 శాతం రాయితీ.

11) కుటుంబ సభ్యులు ముగ్గురు (జీవిత భాగస్వామి, ఇద్దరు పిల్లలు) జీరో బ్యాలెన్స్ ఖాతాలు తెరిచేందుకు అవకాశం

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాలరీ ప్యాకేజీ కలిగిన సింగరేణి ఉద్యోగులందరికీ ఈ బీమా వర్తిస్తుంది. ఉద్యోగి రిటైర్ అయిన తర్వాత పింఛన్ ఖాతాను యూనియన్ బ్యాంకులోనే కొనసాగించడం ద్వారా 70 ఏళ్ల వరకు ఈ బీమా సదుపాయాన్ని పొందొచ్చు.

నవతెలంగాణ ఖమ్మం
మానవి
www.navatelangana.com
మంగళవారం 27 ఫిబ్రవరి 2024

భారత సైన్యంలో ఒక బెటాలియన్‌కు నాయకురాలు



అడ్డంకులు ఎన్ని ఎదురైనా కలలు కంటూనే ఉంది. ఆ కలలను సాకారం చేసుకునేందుకు అనునిత్యం శ్రమించింది. ఆమే కల్నల్ సప్నా రానా. కల్నల్ అయ్యేందుకు ఆమె చేసిన ప్రయాణం అంత సులభమైనదేమీ కాదు. ఒక చిన్న పల్లెటూర్లో పుట్టి పెరిగిన ఆమె ఒకప్పుడు కుటుంబ పోషణ కోసం పశువులను కాసింది. ఇప్పుడు భారత సైన్యంలో ఒక బెటాలియన్‌కు నాయకత్వం వహిస్తోంది. ఆమె సంకల్ప బలం గొప్ప విజయానికి ఎలా దారితీసిందో తెలుసుకుందాం...



భారత సైన్యంలో చేరి ఒక బెటాలియన్‌కు నాయకత్వం వహిస్తుందని అసలు సప్నా రానా ఎప్పుడూ ఊహించలేదు. అసలు తన జీవితంలో ఇలాంటి కెరీర్ ఎంచుకోవాలనే ఆలోచనే ఆమెకు లేదు. ఇప్పుడు కల్నల్‌గా చరిత్ర సృష్టించిన ఆమె తన చిన్నతనంలో కుటుంబ పోషణ కోసం పశువులు కాసేది. బస్సుల్లో, ఆటోల్లో ప్రయాణం చేస్తే డబ్బు ఖర్చు అవుతుందని, ఆ డబ్బు కూడా తన చదువుకు ఉపయోగపడుతుందని ఎంత దూరమైనా కాలినడకే నడిచింది. అటువంటి ఓ మారుమూల గ్రామంలో, పేద కుటుంబంలో పుట్టారు ఆమె. సప్నా ప్రారంభ జీవితం ఇలా ఎన్నో కష్టాలతో ముడిపడి ఉంది.

సివిల్ సర్వీస్ ఆమె మొదటి కల


చేస్తున్న ప్రయాణంలో ఎన్ని సవాళ్లు ఎదురైనప్పటికీ తన స్థాయికి మించిన కలలు మాత్రం కన్నది. ఆ కల నెరవేర్చుకోవడం కష్టమని తెలిసినా ప్రయత్నం చేయాలనుకుంది. సివిల్ సర్వీసెస్‌కు ఎంపిక కావాలన్నది ఆమె తొలి కోరిక. ఆ లక్ష్య సాధన కోసమే ఎన్నో మైళ్లు కాలి నడకన ప్రయాణించింది. రూపాయి ఖర్చు పెడితే మళ్ళీ సంపాదించడం ఎంత కష్టమో ఆమెకు తెలుసు. అందుకే కాళ్ళు బొబ్బలెక్కుతున్నా ప్రతి పైసా చాలా జాగ్రత్తగా ఖర్చుపెట్టేది. ఆ తపనే ఆమెను హిమాచల్ ప్రదేశ్ విశ్వవిద్యాలయం నుండి ఎంబీఏ పూర్తి చేసేలా చేసింది. అయితే అనుకోకుండా సివిల్ సర్వీసెస్‌కు సిద్ధం కావాలనుకున్న ఆమె మధ్యలో తన ప్రణాళికను మార్చుకోవల్సి వచ్చింది. కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ పరీక్షలో అవకాశం పొందింది.

గర్వంగా ఉంది

గృహిణి అయిన సప్నా తల్లి కృష్ణ ఠాకూర్ మాట్లాడుతూ 'నాకు ముగ్గురు పిల్లలు. ఇద్దరు కొడుకులు, ఒక కూతురు. మా అమ్మాయి సప్నా చిన్నప్పటి నుండి బాగా చదివేది. చదువు విషయంలో అస్సలు రాజీపడేది కాదు. మాది ఒక చిన్న గ్రామం. ప్రపంచం ఎలా ఉంటుందో కూడా మాకు తెలియదు. అలాంటిది నా కూతురు ఆ గ్రామ పంచాయితీ దాటి బయటకు వస్తుందని అస్సలు ఊహించలేదు. అయితే సప్నా తన 10వ తరగతి పూర్తి చేసిన తర్వాత తన అన్నలతో కలిసి ఉన్నత చదువుల కోసం సోలన్‌కు వెళతానని పట్టుబట్టింది. మాకు చాలా భయం వేసింది. ఆడపిల్లను ఊరుకి దూరంగా పంపించేందుకు మొదట కాస్త కంగారు పడ్డాము. కానీ చదువు పట్ల ఆమెకున్న ఆసక్తి మమ్మల్ని ఒప్పించేలా చేసింది. ఇప్పుడు తనను చూస్తే చాలా గర్వంగా ఉంది' అని ఆమె చెబుతున్నారు.

అనుకోకుండా వచ్చిన అవకాశం

కల్నల్ సప్నా తన కలలకు రెక్కలు వచ్చిన రోజులను గుర్తుచేసుకుంది 'సోలన్‌లోని ప్రభుత్వ కళాశాలలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాను. ఆ తర్వాత నేను సిమ్లాలోని ఎంబీఏ డిగ్రీ కోసం హిమాచల్ ప్రదేశ్ విశ్వవిద్యాలయంలో అడ్మిషన్ పొందాను. అప్పటి నుండే నేను సివిల్ సర్వీసెస్ కోసం ప్రిపేర్ అవ్వడం మొదలుపెట్టాను. కానీ మధ్యలో కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ పరీక్షకు హాజరయ్యాను. ఇది అసలు నా ఆలోచనల్లోనే లేదు. అనుకోకుండా ఓ ప్రయత్నం చేద్దామని వెళ్లింది. చెన్నైలోని ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీలో శిక్షణకు ఎంపికయ్యాను' అని చెప్పారు. అలా సర్వీస్ సెలక్షన్ బోర్డ్‌ను క్లియర్ చేసిన తర్వాత ఆమె 2003లో చెన్నైలోని ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీలో చేరారు. 2004లో ఇండియన్ ఆర్మీలో లెఫ్టినెంట్‌గా నియమితులయ్యారు. 41 ఏండ్ల ఈ అధికారి ప్రస్తుతం ఆర్మీ సర్వీస్ కార్ప్స్ (ఏఎస్‌సీ) బెటాలియన్‌కు నాయకత్వం వహిస్తున్నారు. సప్నా ఈశాన్య ఆర్మీ అధికారిని వివాహం చేసుకున్నారు. వీరికి ఒక కుమార్తె ఉంది.





ఖర్చులు తగ్గించుకునేందుకు

సప్నా తండ్రి పాఠశాల ఉపాధ్యాయుడు. ఇదే ఆమె పై చదువులు చదివేందుకు మంచి అవకాశంగా మారింది. కూతురు పై చదువుల కోరిక గురించి తెలుసుకున్న ఆమె తల్లే, తండ్రిని ఒప్పించింది. తర్వాత ఆమె తన పై చదువుల కోసం సోలన్‌కు వెళ్లింది. 'అక్కడ హాస్టల్లో ఉంటే ఖర్చు ఎక్కువని ఒక చిన్న గది తీసుకొని తనే స్వయంగా వంట చేసుకునేది. బస్సులో ప్రయాణిస్తే డబ్బు ఖర్చు అవుతుందని కళాశాల నుండి చాలా దూరం నడిచి వచ్చేది' అని తల్లి గుర్తు చేసుకున్నారు. 'గ్రామంలో ఉన్నప్పుడు అప్పటికి ఇండ్లల్లో ఉండే స్త్రీలు చేసే పనులన్నీ సప్నా చేసేది. పశువుల కోసం మేత కోయడం, పశువులను మేపుకు రావడం, పాలు పితకడం, చపాతీలు చేయడం... ఇలా అన్ని పనులూ చేసేది. అలా ఇండ్లల్లో అన్ని పనులు చేసిన సాధారణ మా అమ్మాయి ఈ రోజు ఆర్మీలో కమాండింగ్ ఆఫీసర్ (సీఓ) అయ్యింది అంటే మేము ఊహించలేకపోతున్నాం' అంటూ ఆ తల్లి గర్వంగా చెబుతున్నారు.

కొబ్బరి నీళ్ళు ఎప్పుడెప్పుడు తాగొచ్చో తెలుసా?

ఏ కాలంలోనైనా కొబ్బరి నీళ్ళు తాగడం ఆరోగ్యానికి శ్రేయస్కరం అని వైద్యులు సూచిస్తుంటారు. వేసవి వచ్చిందంటే కచ్చితంగా తీసుకోవాల్సిన పానీయాల్లో కొబ్బరి నీళ్లు ఒకటి. కొబ్బరి నీటిని అద్భుత పానీయంగా చెబుతారు పోషకాహార నిపుణులు. ఎన్నో వ్యాధులకు ఇది ఔషధంగా పనిచేస్తుంది. వేసవి తాపాన్ని తట్టుకొనే శక్తిని అందిస్తుంది. దీనిలో కేలరీలు తక్కువగా ఉంటాయి కాబట్టి ఎంత తాగినా బరువు పెరగరు. అలాగే శరీరానికి అవసరమైన సహజ ఎంజైములు వీటిలో పుష్కలంగా ఉంటాయి. పొటాషియం వంటి ఖనిజాలు కలిగి ఉంటాయి. కాబట్టి కొబ్బరి నీళ్లను తాగడం వల్ల అధిక రక్తపోటు అదుపులో ఉంటుంది. అలాగే మాంగనీస్, విటమిన్ సి, క్యాల్షియం, ఫైబర్ వంటి అవసరమైన పోషకాలు కొబ్బరి నీళ్లలో అధికంగా ఉంటాయి. అందుకే వేసవి వచ్చిందంటే ప్రతిరోజు కొబ్బరి నీళ్లు తాగుతుంటారు. అయితే రోజులో ఏ సమయంలో కొబ్బరి నీళ్లు తాగితే రెట్టింపు ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చో తెలుసుకుందామా...!

వ్యాయామానికి ముందు...

వ్యాయామం చేయడానికి ముందు కొబ్బరి నీళ్ల తాగి వెళితే మంచిది. ఇది డీహైడ్రేషన్ సమస్యలు రాకుండా అడ్డుకుంటుంది. అలాగే శక్తిని అందిస్తుంది. వ్యాయామం చేసిన తర్వాత కూడా ప్రోటీన్ షేక్ వంటివి తాగే బదులు ఎలక్ట్రోలైట్స్ నిండిన కొబ్బరినీళ్ళను తాగడం చాలా మంచిది. ఇది అలసటను దూరం చేస్తుంది. సత్వర శక్తిని అందిస్తుంది.

భోజనానికి ముందు..

భోజనానికి ముందు ఒక గ్లాసు కొబ్బరి నీళ్లను తాగితే, ఆహారం అధికంగా తినలేరు. కాబట్టి బరువు పెరిగే అవకాశం తక్కువగా ఉంటుంది. త్వరగా బరువు తగ్గాలి అనుకునేవారు ఈ చిట్కాలు పాటించడం అలవాటు చేసుకుంటే ఉపయోగం ఉంటుంది. అలాగే శరీరంలో ఎలక్ట్రోలైట్ బ్యాలెన్స్ చేయడంలోనూ కొబ్బరినీళ్ల ముందుంటాయి. రక్తపోటు పెరగకుండా ఇవి అడ్డుకుంటాయి.

నిద్రపోయే ముందు..

మానసిక సమస్యలకు దివ్య ఔషధంగా పనిచేస్తుంది. రాత్రి పడుకునే ముందు ఒక గ్లాసు కొబ్బరి నీళ్ల తాగడం వల్ల మానసిక ఒత్తిడి రాకుండా కాపాడుతుంది. ఆందోళనలను తగ్గించడంలో సహాయపడుతుంది. హార్ట్ రేటు పెరగకుండా అడ్డుకుంటుంది. ఒత్తిడితో పోరాడటానికి కొబ్బరి నీళ్లు దోహదం చేస్తాయి. మనసును ప్రశాంతంగా ఉంచి నిద్ర సరిగా పట్టేలా చేస్తాయి. కొబ్బరినీరు తాగడం వల్ల మూత్ర నాళాలు శుభ్రపడతాయి. దీని వల్ల ఇన్ఫెక్షన్లు, కిడ్నీ సమస్యలు రాకుండా ఉంటాయి.

కొంతమందికి రాత్రిపూట ఆల్కహాల్ అలవాటు ఉంటుంది. ఈ అలవాటు వల్ల శరీరం ఎక్కువగా డీ హైడ్రేట్ అవుతుంటుంది. తలనొప్పి, వికారం వంటి సమస్యలు ఏర్పడతాయి. ఇలాంటివి ఏర్పడకుండా ఉండాలంటే ఉదయం సమయంలో కొబ్బరినీళ్ల తాగడం అలవాటు చేసుకుంటే సరి. వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ కొబ్బరి నీళ్ల తాగడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు పొందడంతో పాటు వేసవి తాపం నుంచి ఉపశమనం పొందవచ్చు కూడానూ.



క్విట్ డబ్ల్యూటీవో

(మొదటిపేజీ తరువాయి)

అణచివేతకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా కుట్ర పన్నుతున్నారని తీవ్రంగా ధ్వజమెత్తారు. హర్యానా సీఎం మనోహర్ లాల్ ఖట్టర్, హోం మంత్రి అనిల్ విజ్ చట్టవిరుద్ధంగా, రాజ్యాంగ విరుద్ధంగా రాష్ట్ర సరిహద్దుల గుండా బలగాలను పంపి రైతులపై బుల్లెట్లు, పెల్లెట్లు, టియర్ షెల్స్ కాల్చారని, అక్కడ నిలబడి ఉన్న వందలాది రైతుల ట్రాక్టర్లను ధ్వంసం చేశారని విమర్శించారు. అనంతరం రైతులను రోడ్లపైకి ట్రాక్టర్లను తీసుకురావద్దని ఆదేశించారని దుయ్యబట్టారు. రైతుల ఆస్తుల కూల్చివేతకు బుల్డోజర్ రాజ్ వంటివి ఆచరిస్తున్నారని, ఈ రైతు వ్యతిరేక దాడిని నిరసిస్తూ ఎస్కేఎం రోడ్లపై ట్రాక్టర్లను నిలబెట్టి నిరసన సభలు నిర్వహించిందని తెలిపారు.

సి2 ప్లస్ 50 శాతం లాభదాయక రేటుతో ఎంఎస్పీకి చట్టపరమైన హామీ, చౌకైన రేషన్ దేశంలోని రైతులు, శ్రామిక జనాభా మనుగడకు ఉమ్మడి అవసరాలని ఎస్కేఎం నాయకులు వివరించారు. మతపరమైన ముసుగులో కప్పబడిన ప్రభుత్వ విధానం, వ్యవసాయంలో విదేశీ పెట్టుబడిని, బడా కంపెనీలను ప్రోత్సహిస్తోందని విమర్శించారు. "ఇన్‌పుట్ ధరలను పెంచుతోంది. పంటల అమ్మకపు ధరలను తగ్గించడం, ఆహార సరఫరా గొలుసును నియంత్రించడం, భూమి, నీటి వనరులను స్వాధీనం చేసుకోవడం, తద్వారా రైతు ఆర్థిక వ్యవస్థను నాశనం చేస్తోంది" అని విమర్శించారు. ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాన్ని అమలు చేయడమే కాక, ధనిక దోపిడీదారుల లాభార్జన అవసరాల కోసం ప్రజలపై ఫాసిస్ట్ అణచివేతకు పూనుకుంటోందని ధ్వజమెత్తారు.

కనీస మద్దతు ధర విధానాన్ని ఉపసంహరించుకోవాలన్న డబ్ల్యూటీవో డిమాండ్ దేశంలోని కోట్లాది మంది రైతులపై దాడి మాత్రమే కాదని, దేశ సార్వభౌమాధికారంపై కూడా దాడి అని పేర్కొన్నారు. ఇలాంటి స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు దేశంపై రుద్దబడుతున్నాయని, రైతులకు, దేశ పౌరుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉన్నాయని విమర్శించారు. సంయుక్త కిసాన్ మోర్చా మార్చి 14న ఢిల్లీలోని రాంలీలా మైదాన్‌లో భారీ కిసాన్ మహాపంచాయత్‌ను నిర్వహించనుందని, ఇందులో దేశవ్యాప్తంగా ఉన్న రైతులు పాల్గొననున్నారని తెలిపారు.

డబ్ల్యూటీవో నుంచి బయటకొస్తేనే... :ఏఐకేఎస్, ఏఐఏడబ్ల్యూయూ నేతలు కృష్ణప్రసాద్, బి వెంకట్

దేశ వ్యవసాయ రంగాన్ని సర్వనాశనం చేసే డబ్ల్యూటీవో షరతులను భారత ప్రభుత్వం ప్రతిఘటించాలని ఏఐకేఎస్ కోశాధికారి కృష్ణ ప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ డిమాండ్ చేశారు. అబుదాబిలో జరుగుతున్న డబ్ల్యూటీవో సదస్సులో భారత ప్రభుత్వం సంపన్న దేశాల షరతులను అంగీకరించరాదని అన్నారు. సోమవారం దేశవ్యాప్తంగా సంయుక్త కిసాన్ మోర్చా, రైతు వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జాతీయ రహదారులపై ట్రాక్టర్ పరేడ్లు, డబ్ల్యూటీవో దిష్టిబొమ్మల దహనం కార్యక్రమం జరిగింది. హర్యానాలోని రోహతక్‌లో జాతీయ రహదారులపై జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న కృష్ణ ప్రసాద్, బి. వెంకట్ మాట్లాడుతూ గత నాలుగేండ్లుగా కనీస మద్దతు ధరల చట్టం కోసం రైతాంగం రోడ్లెక్కారని, అన్ని వర్గాల ప్రజలు వారితో భుజం భుజం కలిపి పోరాడుతున్న నేపథ్యంలో అభివృద్ధి చెందుతున్న దేశాలన్నీ డబ్ల్యూటీవో పెట్టే షరతులను ప్రతిఘటించాల్సిన అవసరం ఉందని, కాని భారత ప్రభుత్వం వారి షరతులను పాటించేందుకు సిద్ధమవ్వటం విచారకరమని అన్నారు. దేశంలో వ్యవసాయానికి, ప్రజా పంపిణీకి సబ్సిడీలు తగ్గించటం, విదేశీ వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతుల సుంకాలను తగ్గించడం లాంటి విషమ షరతులు అందులో ఉన్నాయని అన్నారు. ఇప్పటికే దేశం వ్యవసాయ రంగ సంక్షోభంలో ఉందని, సబ్సిడీలు తగ్గిస్తే మరింత సంక్షోభంలోకి కూరుకుపోయి వ్యవసాయ రంగంపై ఆధారపడిన 65 కోట్ల మంది ప్రజల జీవితాలు తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉందని అన్నారు.



అమెరికా లాంటి సంపన్న దేశాలు వ్యవసాయ సబ్సిడీలు తగ్గించాలని గగ్గోలు పెడుతున్నాయని అన్నారు. వాస్తవానికి మూడు శాతం వ్యవసాయ రంగంపై ఆధారపడిన అమెరికాకు 80 శాతం సబ్సిడీలు ఇస్తున్నాదని అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో ప్రజా పంపిణీ వ్యవస్థకు సగం కేటాయింపులు తగ్గించారని, దీనితో వ్యవసాయ రంగం మరింత సంక్షోభంలోకి పోయే ప్రమాదం ఉందని అన్నారు. భారత దేశ ప్రజల అవసరాలకు తగిన వ్యవసాయ ఉత్పత్తులు పండించకుండా అడ్డుపడి సంపన్న దేశాల్లో వృథాగా ఉన్న ఉత్పత్తులను మన దేశానికి డంపు చేయడానికి అమెరికా కుట్ర పన్నుతున్నదని అన్నారు.

అమెరికా ప్రజలు తినకుండా వదిలేస్తున్న, అమెరికాలో వథాగా ఉన్న చికెన్ లెగ్స్‌ను భారతదేశానికి దిగుమతి చేయటానికి అన్ని ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. 30 శాతం దిగుమతి సుంకాలు ఉన్న చికెన్ లెగ్ పీసులకు మోడీ ప్రభుత్వం ఐదు శాతానికి కుదించిందని అన్నారు. చికెన్ లెగ్ పీస్‌లు విపరీతంగా దిగుమతి అవటంతో మన దేశంలో కోళ్ల పరిశ్రమ తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉందని అన్నారు. మన వ్యవసాయ పంటలకు గిట్టుబాటు ధర లేకుండా చేస్తే వ్యవసాయదారులంతా దానికి దూరం అవుతారని, వ్యవసాయ రంగాన్ని మొత్తాన్ని కబళించి కార్పొరేట్ శక్తులు, అదాని లాంటి వారికి అప్పగించేందుకు మోడీ ప్రభుత్వం సర్వవిదాలా ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. దేశంలోని కార్పొరేట్ శక్తులు, సంపన్న దేశాల అధినేతలు కలిసి భారతదేశం లాంటి వెనకబడిన దేశాల వ్యవసాయ రంగాన్ని నాశనం చేస్తున్నాయని అన్నారు. అటువంటి నిర్ణయాలు చేసేందుకే డబ్ల్యుటిఓ సమావేశాలు జరుగుతున్నాయని వివరించారు. డబ్ల్యుటిఓ విషమ షరతులకు భారతదేశం అంగీకరిస్తే భారత వ్యవసాయ రంగం బ్రతకదని, షరతులను ప్రతిఘటించక పోతే మోడీ గద్దె దిగటం ఖాయమని హెచ్చరించారు.

2,3 రోజుల్లో డీఎస్సీ నోటిఫికేషన్?

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఉపాధ్యాయ అభ్యర్థులు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు. పార్లమెంటు ఎన్నికల షెడ్యూల్ వెలువడక ముందే ఉద్యోగ నియామకాలకు సంబంధించిన ప్రకటనలను విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నది. అందులో భాగంగానే రెండు, మూడు రోజుల్లో ఉపాధ్యాయ నియామకాల కోసం డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేసే అవకాశమున్నది. ఇందుకోసం విద్యాశాఖ ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నారు. ఉపాధ్యాయ ఖాళీలకు సంబంధించి వారు ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆమోదం తీసుకున్నట్టు తెలిసింది. వాటి భర్తీకి ఆర్థిక శాఖ అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీ చేయనుంది. ఆ వెంటనే విద్యాశాఖ డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేసే అవకాశమున్నది. 'అధికారంలోకి వచ్చిన ఏడాదిలోగా ఖాళీగా ఉన్న రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తాం.'అని కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపర్చిన విషయం తెలిసిందే. అందుకనుగుణంగానే రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. రాష్ట్రంలో 5,089 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి జిల్లాస్థాయి నియామక కమిటీ (డీఎస్సీ) నోటిఫికేషన్‌ను గతేడాది సెప్టెంబర్ ఆరో తేదీన బీఆర్ఎస్ ప్రభుత్వం విడుదల చేసిన విషయం తెలిసిందే. 5,089 ఉపాధ్యాయ పోస్టులకు 1,77,502 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఆయా పోస్టుల సంఖ్యను పెంచాలని భావిస్తున్నది. మరో ఆరు వేల ఉపాధ్యాయ పోస్టులను అదనంగా కలపాలని నిర్ణయించినట్టు సమాచారం. దీంతో 11 వేల ఉపాధ్యాయ పోస్టులతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేసే అవకాశమున్నది. లోపాల్లేకుండా, న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తకుండా నిబంధనలను పొందుపర్చాలని విద్యాశాఖ భావిస్తున్నది. అయితే బీఆర్ఎస్ ప్రభుత్వం డీఎస్సీ రాతపరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహించాలని నిర్ణయించింది. ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలని అభ్యర్థులు కోరుతున్నారు. దీనిపై కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచిచూడాలి.

ఎల్ఆర్ఎస్ వేగవంతం చేయండి

(మొదటిపేజీ తరువాయి)

అనుమతించాలని ఆదేశించారు దరఖాస్తులకు పూర్తి రుసుము చెల్లించి మార్చి 31లోగా లే-అవుట్‌ల క్రమబద్ధీకరణ చేసుకునేందుకు అవకాశం ఇవ్వాలని చెప్పారు. దేవాదాయ, వక్ఫ్, ప్రభుత్వ, కోర్టు ఆదేశాలున్న భూములు తప్ప ఇతర లే-అవుట్‌లను క్రమబద్ధీకరించాలని అధికారులకు సూచించారు.

ఆన్‌లైన్ డేటా ఉల్లంఘన

- 2023లో 53 లక్షల భారతీయ ఖాతాల గుర్తింపు

న్యూఢిల్లీ : గతేడాదిలో మొత్తంగా 53లక్షల భారతీయ ఆన్‌లైన్ ఖాతాలు డేటా ఉల్లంఘనకు గురయ్యాయని ఒక నివేదిక వెల్లడించింది. ప్రయివేట్ వర్చువల్ నెట్‌వర్క్ ప్రొవైడర్ సర్ఫ్‌షార్క్ సోమవారం వార్షిక నివేదికను విడుదల చేసింది. 'విశ్వసనీయమైన, సున్నితమైన డేటా అనధికార తృతీయ పక్షానికి వెల్లడైంది." అని ఆ నివేదిక వ్యాఖ్యానించింది. ఆన్‌లైన్ సర్వీసుల కోసం రిజిస్టర్ కావడానికి ఉపయోగించిన ఈ మెయిల్ అడ్రస్‌లను లీక్ చేయడం జరిగింది. పాస్‌వర్డ్స్, ఫోన్ నెంబర్లు, ఇంటర్‌నెట్ ప్రొటోకాల్ అడ్రస్‌లు, జిప్ కోడ్‌లు, డేటా వంటి అదనపు సమాచారంతో ఈ ఖాతాలు లీకయ్యాయని ఆ నివేదిక తెలిపింది. 2023లో ప్రతి నిముషానికి దాదాపు 10 భారతీయ ఖాతాలు లీకయ్యాయని తెలిపింది. ప్రతి వెయ్యి ఖాతాల్లో నాలుగు ఉల్లంఘించబడ్డాయని పేర్కొంది. అత్యంత ఎక్కువగా డేటా ఉల్లంఘనలకు బాధపడిన దేశాల్లో భారత్ ఐదవ స్థానంలో నిలిచిందని నివేదిక పేర్కొంది. గతేడాది జనవరిలో భారతీయ దుస్తుల తయారీ సంస్థ కేవల్ కిరణ్ క్లోతింగ్ నుంచి అత్యంత ఎక్కువగా డేటా ఉల్లంఘనలు చోటు చేసుకున్నాయి. మొత్తంగా 12,32,580 యూజర్ ఖాతాలు లీకయ్యాయి. రెండవది ఫర్నిచర్ అండ్ ఎలక్ట్రానిక్ అప్లయన్స్ రెంటల్ సర్వీస్ రెంటోమోజోలో ఏప్రిల్‌లో జరిగింది. 11,63,135 ఖాతాలు లీకయ్యాయి. 2022లో డేటా ఉల్లంఘనలో భారత్ ఏడవ స్థానంలో వుంది.

డీఎస్సీ-2008 మెరిట్ అభ్యర్థులకు నియామకాలు చేపట్టాలి

- సీఎం రేవంత్‌రెడ్డికి జూలకంటి లేఖ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైకోర్టు తీర్పు ప్రకారం డీఎస్సీ-2008 ఎంపికైన బీఈడీ మెరిట్ అభ్యర్థులను సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్జీటీ)గా నియమాకాలను చేపట్టేందుకు విద్యాశాఖ అధికారులకు ఆదేశాలివ్వాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆయన సోమవారం లేఖ రాశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్సీ-2008 నోటిఫికేషన్ ద్వారా ఎస్జీటీ పోస్టుల్లో బీఈడీ, డీఈడీ అభ్యర్థులకు నాటి ప్రభుత్వం సమాన అవకాశాలు కల్పించిందని గుర్తు చేశారు. నోటిఫికేషన్ విడుదలైన 54 రోజుల తర్వాత జీవో నెంబర్ 28 ద్వారా ఎస్జీటీ పోస్టుల్లో డీఈడీ అభ్యర్థులకు 30 శాతం రిజర్వేషన్ కల్పించడం వల్ల కామన్ మెరిట్‌లో ఎంపికైన బీఈడీ అభ్యర్థులు నష్టపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. 28 జీవో వల్ల నష్టపోయిన బీఈడీ మెరిట్ అభ్యర్థులకు 39 జీవో ద్వారా ఏపీ ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించిందని వివరించారు. అదే విధంగా తెలంగాణలోని అభ్యర్థులకు ఉద్యోగ నియామకాలను ఆరు వారాల్లో పూర్తి చేయాలంటూ హైకోర్టు తీర్పు ఇచ్చిందని తెలిపారు. దాన్ని అమలు చేసేందుకు విద్యాశాఖాధికారులకు తగిన ఆదేశాలివ్వాలని సీఎంను కోరారు.

అన్నదాతను కాపాడాలి

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి ఆర్టీసీ క్రాస్‌రోడ్డు వరకు బైకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానుద్దేశించి ఎస్‌కేఎమ్ రాష్ట్ర కన్వీనర్లు తీగల సాగర్, వి.ప్రభాకర్, ఆర్.వెంకట్రాములు, జక్కుల వెంకటయ్య, డేవిడ్, కార్మిక సంఘాల నాయకులు భూపాల్, ఎస్ఎల్ పద్మ, ఎం.శ్రీనివాస్, అరుణ, మహిళా సంఘం నాయకులు ఝాన్సీ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని విదేశీ కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు యత్నిస్తున్నదని విమర్శించారు. అబుదాబీలో డబ్ల్యూటీవో కాన్ఫరెన్స్ సోమవారం ప్రారంభమైందన్నారు. మన రైతులకు ఎమ్ఎస్‌పీ మంజూరు చేయొద్దనీ, రైతులకిస్తున్న సబ్సిడీలు తగ్గించాలని కేంద్ర ప్రభుత్వంపై డబ్ల్యూటీవో ఒత్తిడి చేస్తున్నదని విమర్శించారు. ప్రజలకు నేరుగా డబ్బులు బదిలీ చేయాలని ఒత్తిడి చేయడమంటే ప్రజాపంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేయడమేనన్నారు. డబ్ల్యూటీవో ప్రతిపాదనలు రైతులకు, పేద ప్రజలకు, ఆహార భద్రతకు, భారతదేశ సార్వభౌమత్వానికి హానికరమని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం డబ్యూటీఓ నుంచి వెనక్కి రావాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ సరిహద్దు ప్రాంతంలో రైతుల ట్రాక్టర్లను పోలీసులు ధ్వంసం చేయడం దుర్మార్గమన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతు ఉద్యమంలో చీలికలు తేవడానికి కుట్రలు పన్నుతున్నదని విమర్శించారు. పోలీసుల కాల్పుల్లో చనిపోయిన రైతుల కుటుంబాలకు కోటి రూపాయల పరిహారం ఇవ్వాలనీ, ట్రాక్టర్ల మర్మత్తుల ఖర్చులను ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మార్చి 14న చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు. రైతులను చైతన్యపరిచేందుకు పల్లెపల్లెనా పాదయాత్రలు చేయాలని పిలుపునిచ్చారు. పార్టీలకతీతరంగా రైతు పోరాటానికి మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో సోమన్న, కిషన్ (సీఐటీయూ), యం.హన్మేష్ (ఐఎఫ్‌టీయూ), మూడ్ శోభన్ (రైతు సంఘం), బుర్రి ప్రసాద్, బొప్పని పద్మ(వ్యవసాయ కార్మిక సంఘం), ఆర్.శ్రీరామ్ నాయక్, యం. ధర్మానాయక్(గిరిజన సంఘం), స్వరూప, వరలక్ష్మి, లక్ష్మి బాయి, పుష్ప(పీఓడబ్ల్యూ), కోట రమేష్, జావెద్ (డివైఎఫ్ఐ), కేఎస్‌ప్రదీప్ (పీవైఎల్), తాళ్ళ నాగరాజు, అశోక్ రెడ్డి, లెనిన్ గువేరా (ఎస్ఎఫ్ఐ) ఎస్.నాగేశ్వరావు, మహేష్, అనిల్ (పీడీఎస్‌యూ)తదితరులు పాల్గొన్నారు.



సిరీస్ చిక్కింది ఇక్కడే!

నన్ను అవమానించారు


- ఇక జీవితంలో ఆంధ్ర తరపున ఆడను
- ఆంధ్ర క్రికెట్ సంఘంపై విహారి ఆరోపణ



హైదరాబాద్ : ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ)పై భారత క్రికెటర్ హనుమ విహారి తీవ్ర ఆరోపణలు చేశారు. రాజకీయ నాయకుడి ఒత్తిడికి తలొగ్గి అవమానకర రీతిలో కెప్టెన్సీ నుంచి తప్పించారని, ఇక జీవితంలో ఆంధ్ర తరపున దేశవాళీ క్రికెట్ ఆడబోనని సోషల్ మీడియా వేదికగా ప్రకటించాడు. 'బెంగాల్‌తో రంజీ మ్యాచ్ సందర్భంగా జట్టులోని 17వ ఆటగాడిపై అరిచాను. ఆటలో ఇది అత్యంత సహజం. కానీ అతడు నా మాటలను వ్యక్తిగతంగా తీసుకున్నాడు. ఆ ఆటగాడి తండ్రి రాజకీయ నాయకుడు కావటంతో.. ఒత్తిడి తీసుకొచ్చి సారథ్య బాధ్యతల నుంచి నన్ను తప్పించారు. జట్టు కోసం, ఆట కోసం ఈ సీజన్‌లో ఆంధ్రతోనే కొనసాగాను. సీజన్లో ఆంధ్ర తరపున ఆఖరు మ్యాచ్ వరకు మౌనంగా ఉన్నాను. భారత జట్టు తరపున 16 టెస్టులు ఆడిన నన్ను అవమానకర రీతిలో కెప్టెన్సీ నుంచి తప్పించారు. ఆటను అభివృద్ధి చేయాలనే ఆలోచన ఆంధ్ర క్రికెట్ లేదు. జీవితంలో మళ్లీ ఆంధ్ర తరపున ఆడబోను' అని హనుమ విహారి రాసుకొచ్చాడు. విహారి వ్యాఖ్యలపై 17వ ఆటగాడు పృథ్వీరాజ్ కెఎన్, ఆంధ్ర క్రికెట్ సంఘం స్పందించాయి. 'విహారి చెప్పిన ఆ 17వ ఆటగాడిని నేనే. ఆయన చెప్పిందంతా అబద్ధం. డ్రెస్సింగ్‌రూమ్‌లో అందరి ముందు నన్ను వ్యక్తిగతంగా టార్గెట్ చేసి దూషించారు. విహారికి మద్దతుగా లెటర్‌పై సంతకాలు చేసిన క్రికెటర్లు నాకు వ్యక్తిగతంగా మెసేజ్‌లు పంపించి నన్ను సమర్థిస్తున్నారు. ఇలా అబద్ధాలు చెప్పి సానుభూతి పొందటం తప్ప నువ్వు (విహారి) ఏం చేయలేవు' అని పృథ్వీరాజ్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాడు. ఇక విహారి ప్రవర్తనపై విజయ్ హజారే టోర్నీ సమయంలోనే ఫిర్యాదులు అందాయని, ఆటగాడు ఇచ్చిన ఫిర్యాదు మేరకే ఏసీఏ చర్యలు తీసుకుందని ఆంధ్ర క్రికెట్ సంఘం ఓ ప్రకటనలో తెలిపింది. ఇక సోమవారం ముగిసిన రంజీ ట్రోఫీ క్వార్టర్‌ఫైనల్లో మధ్యప్రదేశ్ చేతిలో 4 పరుగులు తేడాతో ఆంధ్ర అనూహ్య పరాజయం చవిచూసింది.

హైదరాబాద్‌కు మళ్లీ నిరాశే

ప్రైమ్ వాలీబాల్ లీగ్ 2024



చెన్నై : ప్రైమ్ వాలీబాల్ లీగ్‌లో హైదరాబాద్ బ్లాక్‌హాక్స్‌కు మరో ఓటమి ఎదురైంది. సోమవారం చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన గ్రూప్ దశ మ్యాచ్‌లో ఢిల్లీ తుఫాన్స్ చేతిలో హైదరాబాద్ 1-3తో పరాజయం పాలైంది. తొలి సెట్‌లో ఢిల్లీ 15-11తో నెగ్గగా.. రెండో సెట్‌ను బ్లాక్‌హాక్స్ 15-13తో గెల్చుకుని స్కోరు సమం చేసింది. కానీ తర్వాతి వరుస సెట్లలో ఢిల్లీ తుఫాన్స్ పైచేయి సాధించింది. 15-9, 15-11తో బ్లాక్‌హాక్స్‌పై గెలుపొందింది. బ్లాక్‌హాక్స్ తరఫున హేమంత్, ఫెర్నాండేజ్ 11 పాయింట్లతో రాణించారు.



- ఛేదనలో గిల్, ధ్రువ్ అసమాన ఇన్నింగ్స్‌లు
- నాల్గో టెస్టులో 5 వికెట్ల తేడాతో భారత్ గెలుపు
- టెస్టు సిరీస్ 3-1తో టీమ్ ఇండియా వశం



ఊరించే లక్ష్యం. ఇంగ్లాండ్ స్పిన్ ఉచ్చు. పరుగులు అంత సులువుగా రావటం లేదు. 120 పరుగులకే ఐదుగురు స్పెషలిస్ట్ బ్యాటర్లు పెవిలియన్‌కు చేరుకున్నారు. మరో 72 పరుగులు అవసరమైన దశలో ఒత్తిడి భారత్‌పై నెలకొంది. ఇంగ్లాండ్ రెట్టించిన ఉత్సాహంతో మాయ చేయటం మొదలెట్టింది. ఇంగ్లాండ్ ఆశలను ఆవిరి చేస్తూ ఆతిథ్య జట్టును గట్టెక్కించారు ధ్రువ్ జురెల్ (39 నాటౌట్), శుభ్‌మన్ గిల్ (52 నాటౌట్) అసమాన ప్రదర్శన చేశారు. ఆరో వికెట్‌కు అజేయ భాగస్వామ్యంతో భారత్‌కు ఐదు వికెట్ల తేడాతో ఘన విజయాన్ని కట్టబెట్టారు.

బజ్‌బాల్‌కు తొలి దెబ్బ తగిలింది. స్టోక్స్, మెక్‌కలమ్ జోడికి తొలి సిరీస్ ఓటమి ఎదురైంది. సిరీస్ ఓటమి లేకుండా భారత్‌కు వచ్చిన బజ్‌బాల్ ఇంగ్లాండ్.. ఇక్కడ గట్టిగా పోరాడినా పరాజయం తప్పలేదు. మరోవైపు వరుస టెస్టులకు కీలక ఆటగాళ్ల సేవలు కోల్పోయినా ఆతిథ్య భారత్ అదరగొట్టే ప్రదర్శన చేసింది. యువ జట్టుతోనే ఇంగ్లాండ్ మెడలు వంచింది. 3-1తో టెస్టు సిరీస్ సొంతం చేసుకుంది. భారత్, ఇంగ్లాండ్ నామమాత్రపు ఐదో టెస్టు మార్చి 7 నుంచి ధర్మశాలలో జరుగుతుంది.

నవతెలంగాణ-రాంచి

ఇంగ్లాండ్ స్పిన్ వలను ఛేదిస్తూ రాంచి టెస్టులో భారత్ ఘన విజయం సాధించింది. 192 పరుగుల లక్ష్యాన్ని ఐదు వికెట్లు కోల్పోయి ఛేదించింది. శుభ్‌మన్ గిల్ (52 నాటౌట్, 124 బంతుల్లో 2 సిక్స్‌లు), ధ్రువ్ జురెల్ (39 నాటౌట్, 77 బంతుల్లో 2 ఫోర్లు) అజేయ ఇన్నింగ్స్‌లతో చెలరేగటంతో 61 ఓవర్లలో 192 పరుగులు చేసి 5 వికెట్ల తేడాతో భారత్ గెలుపొందింది. ఛేదనలో కెప్టెన్ రోహిత్ శర్మ (55, 81 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్), యశస్వి జైస్వాల్ (37, 44 బంతుల్లో 5 ఫోర్లు) రాణించారు. ఇంగ్లాండ్ యువ స్పిన్నర్ షోయబ్ బషీర్ (3/79) ఆ జట్టుకు ఆశలు రేపినా.. గిల్, జురెల్ తుఫాన్‌లో స్టోక్స్‌సేన కొట్టుకుపోయింది. ఛేదనలో అజేయ మెరుపులకు తోడు తొలి ఇన్నింగ్స్‌లో విలువైన 90 పరుగుల ఇన్నింగ్స్ నమోదు చేసిన వికెట్ కీపర్ బ్యాటర్ ధ్రువ్ జురెల్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు సాధించాడు. ఐదు మ్యాచుల టెస్టు సిరీస్‌లో 3-1తో తిరుగులేని ఆధిక్యం సాధించిన టీమ్ ఇండియా.. మరో టెస్టు మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్‌ను లాంఛనంగా సొంతం చేసుకుంది.

ఓపెనర్ల దూకుడు

192 పరుగుల ఛేదనలో టీమ్ ఇండియా ఓపెనర్లు దూకుడు చూపించారు. కెప్టెన్ రోహిత్ శర్మ (55) అర్థ సెంచరీతో కదం తొక్కగా యశస్వి జైస్వాల్ (37) ఆకట్టుకున్నాడు. ఓవర్‌నైట్ స్కోరు 40/0తో నాల్గో రోజు బ్యాటింగ్‌కు వచ్చిన భారత్.. లక్ష్యం దిశగా దూసుకెళ్లింది. యశస్వి ఐదు బౌండరీలతో దండెత్తగా.. రోహిత్ సైతం ఐదు ఫోర్లు బాదాడు. ఓపెనర్లు వడివడిగా పరుగులు చేయటంతో భారత్ లక్ష్యానికి చేరువైంది. 17.3 ఓవర్లలో 84 పరుగులు జోడించిన ఓపెనర్ల భాగస్వామ్యానికి రూట్ తెరదించాడు. రూట్ ఓవర్లో కండ్లుచెదిరే క్యాచ్ అందుకున్న అండర్సన్.. యశస్వి జైస్వాల్‌ను పెవిలియన్‌కు చేర్చారు. నం.4 బ్యాటర్ రజత్ పటీదార్ (0), రోహిత్ శర్మ (55) నిష్క్రమించటంతో లంచ్ విరామ సమయానికి భారత్ 118/3తో నిలిచింది. 69 బంతుల్లో ఐదు ఫోర్లు, ఓ సిక్సర్ బాదిన రోహిత్ శర్మ ఇంగ్లాండ్ బౌలర్లపై ఒత్తిడి పెంచే ప్రయత్నం చేశాడు.

గిల్, ధ్రువ్ అదుర్స్

లంచ్ విరామం అనంతరం భారత్‌కు వరుస ఎదురుదెబ్బలు తగిలాయి. రవీంద్ర జడేజా (4), సర్ఫరాజ్ ఖాన్ (0)లు వరుస బంతుల్లో వికెట్ చేజార్చుకున్నారు. షోయబ్ బషీర్ అద్భుత బంతులతో వరుస బంతుల్లో వికెట్లు పడగొట్టాడు. దీంతో 120/5తో భారత్ ఒత్తిడిలో పడింది. మరో 72 పరుగులు అవసరమైన దశలో పిచ్ స్పిన్‌కు బాగా అనుకూలించింది. చివరి వికెట్లను స్వల్ప వ్యవధిలోనే కోల్పోయిన గత చేదు రికార్డులు మదిలో మెదులుతున్న తరుణంలో భారత శిబిరంలో ఆందోళన, ఇంగ్లాండ్ అభిమానుల్లో ఆశలు రేకెత్తాయి. కానీ శుభ్‌మన్ గిల్ (52) తోడుగా ధ్రువ్ జురెల్ (39 నాటౌట్) అద్భుతం చేశాడు. తొలి ఇన్నింగ్స్‌లో టెయిలెండర్లు తోడుగా విలువైన భాగస్వామ్యాలు నిర్మించిన ధ్రువ్ జురెల్.. ఛేదనలో స్పెషలిస్ట్ బ్యాటర్ జతగా దంచికొట్టాడు. 77 బంతుల్లో 2 బౌండరీలతో అజేయంగా 39 పరుగులు జోడించాడు. శుభ్‌మన్ గిల్ 122 బంతుల్లో 2 సిక్సర్లతో అర్ధ సెంచరీ పూర్తి చేశాడు. విజయానికి చేరువైన దశలో గిల్ రెండు సిక్సర్ల మోతతో ఇంగ్లాండ్ ఆశలను ఆవిరి చేయగా.. జురెల్ గెలుపు పరుగులతో భారత్‌కు మరపురాని విజయాన్ని అందించాడు.



'పరిస్థితులకు అనుగుణంగా ఆడాలని అనుకుంటాను. తొలి ఇన్నింగ్స్‌లో కంటే ఇప్పుడే ఎక్కువ పరుగులు చేశామని అనిపించింది. తొలి ఇన్నింగ్స్‌లో వికెట్లు వేగంగా పడిపోయాయి. టెయిలెండర్లతో కలిసి భాగస్వామ్యాలు నమోదు చేశాను. నా ఇన్నింగ్స్‌లో టెయిలెండర్ల ఘనత సైతం ఉంది. అండర్సన్, మార్క్‌వుడ్ బౌలింగ్‌ను టెలివిజన్‌లో చూస్తూ పెరిగాను. ఇప్పుడు వారిపై ఆడటం ఎంతో బాగుంది. క్రీజులో ఉన్నప్పుడు ఫోకస్ పూర్తిగా బంతిపైనే కానీ బౌలర్‌పై కాదు. ఛేదనలో గిల్, నేను చిన్న లక్ష్యాలపై దృష్టి నిలిపాం. పదేసి పరుగుల చొప్పున టార్గెట్ పెట్టుకుని ఛేదించాం'

- ధ్రువ్ జురెల్, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్

స్కోరు వివరాలు

ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్ : 353/10

భారత్ తొలి ఇన్నింగ్స్ : 307/10

ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్ : 145/10

భారత్ రెండో ఇన్నింగ్స్ : రోహిత్ శర్మ (సి) బెన్ ఫోక్స్ (బి) టామ్ హర్ట్లీ 55, యశస్వి జైస్వాల్ (సి) అండర్సన్ (బి) జో రూట్ 37, శుభ్‌మన్ గిల్ నాటౌట్ 52, రజత్ పటీదార్ (సి) పోప్ (బి) షోయబ్ బషీర్ 0, రవీంద్ర జడేజా (సి) బెయిర్‌స్టో (బి) షోయబ్ బషీర్ 4, సర్ఫరాజ్ ఖాన్ (సి) పోప్ (బి) షోయబ్ బషీర్ 0, ధ్రువ్ జురెల్ నాటౌట్ 39, ఎక్స్‌ట్రాలు : 5, **మొత్తం : (61 ఓవర్లలో 5 వికెట్లకు) 192. వికెట్ల పతనం :** 1-84, 2-99, 3-100, 4-120, 5-120.

బౌలింగ్ : జో రూట్ 7-0-26-1, టామ్ హర్ట్లీ 25-2-70-1, షోయబ్ బషీర్ 26-4-79-3, జేమ్స్ అండర్సన్ 3-1-12-0.

చక్రవ్యూహంలో నితీశ్

జేడీయూలో కొనసాగుతున్న గొడవలు

లోక్‌సభ ఎన్నికలకు ముందు బీహార్ సీఎంకు తలపోటు

అవసరాన్ని బట్టి.. అధికారంలోకి రావటానికి బీహార్ సీఎం వేసే ఎత్తులు అన్నీ ఇన్నీకావు. ఇండియా కూటమి నుంచి ఎన్డీఏ కూటమిలోకి చేరినా.. జేడీయూలో అంతర్గత రగడ నితీశ్‌కు తలపోటు తెప్పిస్తున్నది. లోక్‌సభ ఎన్నికలకు కౌంట్‌డౌన్ షురూ అవుతున్న దశలో పార్టీలో లుకలుకలు ఎక్కడ కొంపముంచుతాయోనన్న భయం నితీశ్‌ను వెంటాడుతోంది.



పాట్నా: బీహార్‌లో ఇటీవల జరిగిన అధికార మార్పిడి గేమ్ కేవలం ట్రైలర్ మాత్రమే. అసలు ఆట ఇంకా ఆగలేదన్న సంకేతాలు వస్తున్నాయి. బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ఇండియా కూటమి నుంచి విడిపోయి ఎన్డీయేతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. అక్రమ మార్గాల ద్వారా విశ్వాస ఓటు కూడా పొందారు. ఇప్పుడు ఏ పార్టీలైతే మద్దతు నిచ్చాయో వారు కోరుకుంటే, ప్రభుత్వం తన పదవీకాలం కూడా పూర్తి చేస్తుంది. కానీ, ప్రభుత్వాన్ని రక్షించడం కంటే పెద్ద సవాలు నితీశ్‌ను వెంటాడుతోంది.

జేడీయూ నుంచి పోటీకి రెడీ

జేడీయూ ఎమ్మెల్యేల్లో చాలా మంది ఎంపీ ఎన్నికల్లో పోటీ చేయాలని భావిస్తున్నారు. తమ సొంత పార్టీలోని నేతలే.. ప్రభుత్వ తీరు గురించి చేస్తున్న వ్యాఖ్యలకు నితీశ్ మాటలకు పొంతన ఉండటం లేదు. దీన్ని బట్టి చూస్తే.. తిరుగుబాటు వైఖరిగా స్పష్టమవుతోంది.

జేడీయూ ఎమ్మెల్యే సంజీవ్ ఘాటు విమర్శలు

నితీశ్ కుమార్‌పై జేడీయూ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవ్ కుమార్‌కు కోపం ఉన్నదో లేదో తెలియదు కానీ.. ఆయన వ్యవహరిస్తున్న శైలిని చూస్తే మాత్రం పార్టీ అధిష్టానంపై ఆగ్రహంగా ఉన్నట్టు తెలుస్తోంది. అయితే సంజీవ్‌కుమార్‌పై నమోదైన కేసు దర్యాప్తును ఈఓయూకు అప్పగించారు. అయినా ఆయన విశ్వాస పరీక్షలో పాల్గొన్నారు. అలాగే నితీశ్‌కు మద్దతు పలికారు. ఎమ్మెల్యేలపై గుర్రపు వ్యాపారం కేసు పెట్టిన జేడీయూ ఎమ్మెల్యే సుధాంశు శేఖర్‌పై ఆయన అసంతృప్తికి అవధులు లేవు. తన కరుణపైనే శేఖర్ ఎమ్మెల్యే అయ్యారని అంటున్నారు. సుధాంశు శేఖర్ ఎవరో ఒకరి సలహాతో, ఎవరి సూచనల మేరకు ఆయనపై కేసు పెట్టారో తెలిసిందే. గుర్రపు వ్యాపారం జరిగితే, ఎక్కడి నుంచి జరిగింది, ఎవరు చేశారంటే సీబీఐ విచారణ జరగాలి. అయితే డాక్టర్ సంజీవ్ మాత్రం లోక్‌సభ ఎన్నికల్లో నవాడ నుంచి పోటీ చేయాలని భావిస్తున్నట్టు సమాచారం. అయితే ఈ సీటు జేడీయూ కోటా కింద లేదు. ఆర్జేడీ అభ్యర్థి విభాదేవి 2019 లోక్‌సభ ఎన్నికలలో ఇక్కడ నుంచి పోటీ చేసి రెండో స్థానంలో నిలిచారు. ఆర్జేడీ నుంచి సంజీవ్‌కు సీటు గ్యారెంటీ వస్తుందనే చర్చ జరుగుతోంది.

గోపాల్ మండల్ తప్పుడు చర్యలు

గోపాల్ మండల్ జేడీయూకు చెందిన లౌడ్‌మౌత్ ఎమ్మెల్యే. ఎన్డీయేలో ఉంటూ షానవాజ్ హుస్సేన్‌కు సవాల్ విసురుతున్నారు. భాగల్‌పూర్ నుంచి ఆయనను పలుమార్లు గెలిపించారని చెబుతున్నారు. ఈసారి ఎన్నికల్లో భాగల్‌పూర్ నుంచి పోటీ చేస్తామని, లోక్‌సభ టిక్కెట్‌ను తన జేబులో పెట్టుకున్నట్టు కూడా చెప్పుకుంటున్నారు. నితీశ్ కుమార్‌తో పలు సందర్భాల్లో తన అసంతృప్తిని సైతం వ్యక్తంచేశారు. రాజీనామా చేస్తానని కూడా బెదిరించారు. భాగల్‌పూర్ నుంచి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తానన్న నమ్మకంతో ఆయనను ఆర్జేడీ ఒప్పించినట్టు తెలుస్తోంది. ఎందుకంటే ఎన్డీయేలో ఇంకా సీట్లు పంచలేదు. నితీశ్ కుమార్ బీహార్‌లో 'కండీషన్స్ అప్లై' రాజకీయాలకు బాధితుడైతే.. ఇప్పుడు పార్టీలో అంతర్గత ఒత్తిడికి గురవుతున్నట్టు తెలుస్తోంది.

ప్రస్తుతం దేవేష్ చంద్ర ఠాకూర్ పరిస్థితేంటి?

దేవేష్ చంద్ర ఠాకూర్ సీతామర్హి నుంచి ఎన్నికల్లో పోటీ చేయాల్సి ఉంది. సీతామర్హి జేడీయూ కోటా సీటు. అక్కడ సిట్టింగ్ ఎంపీగా సునీల్ కుమార్ పింటూ ఉన్నారు. తన సీటును ఎవరు చేజిక్కించుకుంటారోనని పింటూ ఆందోళన చెందుతున్నారు. ఆయన అక్కడి నుంచి ఎన్నికల్లో పోటీ చేయనుండగా, సీతామర్హి నుంచి శాసనమండలి చైర్మెన్ దేవేశ్ చంద్ర ఠాకూర్ అభ్యర్థిగా సీటును నితీశ్ కుమార్ ప్రకటించారు. ఈ హామీ తర్వాత ఠాకూర్ ఎన్నికల బరిలోకి దిగి ప్రచారాన్ని ప్రారంభించారు. పింటూ బీజేపీని వీడి జేడీయూలో చేరి ఎంపీ అయ్యారు. ఇలాంటి పరిస్థితుల్లో దేవేశ్ చంద్ర ఠాకూర్ కోసం సీతామర్హి సీటును సులభంగా వదిలేస్తాడా.. అన్నదే పెద్ద సందేహం.

నితీశ్‌కు 'ప్రత్యేక' సంజ్ఞ వచ్చింది. ఆర్జేడీ మాజీ కోటా కింద మంత్రుల 'స్కానింగ్' తేజశ్వితో ప్రారంభమైంది. జేడీయూ ఎమ్మెల్యే మహేశ్వర్ హజారై ఇటీవల అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ పదవికి రాజీనామా చేశారు. ఆయన వైపు నుంచి ఎలాంటి సూచన రాకపోవడంతో లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు కూడా సిద్ధమవుతున్నట్టు సమాచారం. అయితే నితీశ్ తన మంత్రివర్గ విస్తరణ చేయగానే ఆయనకు మంత్రి పదవి కట్టబెట్టడం కూడా చర్చనీయాంశమైంది. కానీ, ఇంత హడావుడిగా మంత్రి పదవికి రాజీనామా చేయాల్సిన అవసరం ఏముందన్నదే ఇందులో సందేహం. ప్రత్యర్థి శిబిరంతో కూడా చర్చించినట్టు సమాచారం. జేడీయూ మహాకూటమిలో ఉన్నప్పుడు చిరాగ్ పాశ్వాన్‌తో ఒకసారి భేటీ అయినట్టు వార్తలు వచ్చాయి. అప్పుడు నితీశ్ కుమార్ కూడా మాట్లాడుతూ, ఎవరు ఎవరిని కలుస్తారో తనకు తెలుసునని అన్నారు. ఆయన ఆర్జేడీతో కూడా మాట్లాడినా ఆశ్చర్యం లేదు.

బీహార్ రాజకీయాల నుంచి 'సురక్షిత నిష్క్రమణ' యోచనలో నితీశ్ ఉంటే.. జేడీయూలో రెండో శ్రేణిని సిద్ధం చేయకపోవడం పెద్ద ప్రభావంగా కనిపిస్తోందని విశ్లేషకులు అంటున్నారు. ఈ కారణాలతో ఈసారి నితీశ్‌ను ధిక్కరించటానికి పలువురు జేడీయూ నేతలు సిద్ధమవుతున్నారు

ఎవరిని బరిలో దింపాలి..?

గతసారి అలీ అష్రఫ్ ఫాత్మీని లోక్‌సభ అభ్యర్థిగా నిలిపారు. అప్పుడు నితీశ్ కుమార్ ఆయనను రాజ్యసభకు పంపుతారని చెప్పారు. ఈ అవకాశం కూడా రాలేదు. ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సన్నాహాలు కూడా మొదలుపెట్టారు. ఒకవేళ చేతన్ ఆనంద్ ఆర్జేడీపై తిరుగుబాటు చేసి నితీశ్‌కు మద్దతిస్తే.. ఆయన తన తల్లి మాజీ ఎంపీ లవ్లీ ఆనంద్‌కు టికెట్ ఆశించి ఉండాల్సింది. నిఖిల్ చంద్ర మండలం మాధేపురా నుంచి సిద్ధమవుతున్నారు. దర్భంగా లేదా మధుబని సీటు అతనికి అనుకూలంగా ఉంటుంది. ఇప్పుడు రెండూ బిజేపీకి సిట్టింగ్ సీట్లు ఉన్నాయి. సహజంగానే బీజేపీ తన సిట్టింగ్ స్థానాలను వదులుకోలేదు. అంటే ఆర్జేడీలో కూడా ఆయనకు చోటు దక్కినా ఆశ్చర్యపోనక్కర్లేదు.

తాజాగా ఉపేంద్ర కుష్వాహ కూడా రంగంలోకి దిగారు.అయితే ఎన్నికల సంఘం 'రాష్ట్రీయ లోక్ జనతాదళ్' పేరును ఖరారు చేయలేదు.

ఆర్జేడీకి ఇవ్వాల్సినన్ని సీట్లు ఉన్నాయా..?

మహాకూటమి నుంచి జేడీయూ విడిపోయిన తర్వాత ఇతరులకు సరిపడా సీట్లు వచ్చాయి. అందుకే జేడీయూ, బీజేపీ ఎమ్మెల్యేలపై దృష్టి సారిస్తున్నారు. దీనివల్ల ఆర్జేడీకి రెండు ప్రయోజనాలు కలుగుతాయి. ముందుగా అసెంబ్లీలో ఎన్డీయే ఎమ్మెల్యేల సంఖ్య తగ్గుతుంది. రెండవది, ఎన్డీఏలో భయాందోళనలు ఉన్నాయనే సందేశాన్ని ఆర్జేడీ పంపాలనుకుంటున్నట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, డజను మంది ఎన్డీయే ఎమ్మెల్యేలను తమ వైపునకు తీసుకురావడమే దీని లక్ష్యం. దీంతో ఎన్డీయే ప్రభుత్వం స్వయంచాలకంగా మైనారిటీలోకి వస్తుంది. అప్పుడు ప్రభుత్వం మారడం లేదా అసెంబ్లీ రద్దు అయ్యే అవకాశాలు పెరుగుతాయి. ఇదే జరిగితే, ఆర్జేడీ తన లక్ష్యంలో విజయం సాధిస్తుంది. తేజస్వి యాదవ్ యొక్క జన్ విశ్వాస్ యాత్ర కూడా ఆర్జేడీ రెండు పరిస్థితులకు సిద్ధంగా ఉందని సూచిస్తుంది.



కల్కి.. 6 వేల సంవత్సరాల మధ్య జరిగే కథ

నవచిత్రం

ప్రభాస్ నటిస్తున్న 'కల్కి 2989 ఏడీ' చిత్రం గురించి దర్శకుడు నాగ్ అశ్విన్ ఆసక్తికర విషయాలు వెల్లడించారు. తాజాగా నాగ్ అశ్విన్ సినాప్స్ అనే ఓ టెక్నాలజీ, మైథాలజీ ఇంటరాక్షన్ మీట్‌లో పాల్గొన్నారు. అక్కడ 'కల్కి' గురించి ఓ ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. 'మహాభారతం', స్టార్ వార్స్.. రెండింటినీ చూస్తూ, వింటూ పెరిగాను. ఈ రెండు ప్రపంచాలను కలిపే ఒక గొప్ప సినిమా చేయాలనుకున్నప్పుడు 'కల్కి 2898 ఏడీ' పుట్టింది. ఈ సినిమా కూడా మహాభారతం కాలం నుంచి మొదలై 2898లో పూర్తవుతుంది. అందుకే సినిమాకు ఆ టైటిల్ పెట్టాం. సినిమా 6000 సంవత్సరాల మధ్య జరిగే కథని చూపిస్తుంది. సినిమాలో ప్రధానమైన పాత్రలన్నీ ఇండియన్ మైథాలజీ చుట్టే ఉంటాయి. భవిష్యత్తు ప్రపంచం ఎలా ఉంటుందో చూపే ప్రయత్నం కూడా చేశాం. ఈ క్రమంలోనే ఓ ఊహా ప్రపంచాన్ని క్రియేట్ చేశాం.' అని తెలిపారు.

ఈ ఏడాది మే 9న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం విడుదల కానుంది. ఈ చిత్రంలో ప్రభాస్, దీపిక పదుకొణె జంటగా నటించారు. కమల్‌హాసన్, అమితాబ్ బచ్చన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. వైజయంతీ మూవీస్ బ్యానర్‌పై సి.అశ్వినీదత్ నిర్మిస్తున్నారు.

స్ఫూర్తిదాయకంగా యోధ

ధైర్యం, దేశభక్తి స్ఫూర్తిదాయకంగా యోధ సినిమా ఉండబోతుందని హీరో సిద్ధార్థ్ మల్హోత్రా అన్నారు. ధర్మ ప్రొడక్షన్స్ నిర్మాణంలో వస్తున్న ఈ సినిమా ప్రమోషన్ కోసం ఆయనతోపాటు హీరోయిన్ రాశిఖన్నా హైదరాబాద్‌లోని రాజ్‌కృష్ణ హెూటల్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిద్ధార్థ్ మల్హోత్రా మాట్లాడుతూ యోధ సినిమాలో భాగం కావడమే ఒక అసాధారణ ప్రయాణంగా పేర్కొన్నారు. "ఈ సినిమా అత్యంత ఆసక్తికరంగా ఉంటుంది" అని చెప్పారు. రాశీఖన్నా మాట్లాడుతూ, యోధలో పనిచేయటం ఒక ఉత్తేజకరమైన అనుభవం అని అన్నారు. దిశా పటాని కూడా ఈ సినిమాలో కీలకపాత్ర పోషించారు. సాగర్ ఆంబ్రే, పుష్కర్ ఓజా దర్శకత్వం వహించారు. మార్చి 15న విడుదల కానుంది.

గాయకుడు పంకజ్ ఉదాస్ కన్నుమూత



మ్యూజిక్ లెజెండ్, పద్మశ్రీ అవార్డు గ్రహీత పంకజ్ దాస్ (72) అనారోగ్యంతో కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన సోమవారం తుది శ్వాస విడిచారు. ఆయన మరణవార్తను పంకజ్ కుమార్తె నయాబ్ ఉదాస్ సోషల్ మీడియాలో షేర్ చేశారు. గుజరాత్‌లోని జెట్‌పూర్ ప్రాంతంలో 1951 మే 17న ఆయన జన్మించారు. గజల్, నేపథ్య గాయకుడిగా గుర్తింపు పొందారు. ఆయన హిందీ సినిమా, భారతీయ పాప్ రచనలకు మంచి గుర్తింపు వచ్చింది. 1980లో ఆహత్ అనే గజల్ ఆల్బమ్‌తో తన కెరీర్‌ను ప్రారంభించారు. 1981లో ముకరర్, 1982లో తర్రన్నుమ్, 1984లో పంకజ్ ఉదాస్ లైవ్ ఎట్ రాయల్ ఆల్బర్ట్ హాల్, 1985లో నయాబ్ వంటి అనేక హిట్‌లను రికార్డు చేశారు. 2006లో ఆయన పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్నారు.

మా ఊరి రాజారెడ్డి ట్రైలర్ విడుదల

నిహన్, వైష్ణవి కాంబ్లే జంటగా రవి బాసర దర్శకత్వంలో ఆర్ఎస్ మూవీ మేకర్స్‌పై రజిత రవీందర్ ఎర్ర, సునీత వెంకట రమణ అయిత నిర్మిస్తున్న చిత్రం 'మా ఊరు రాజారెడ్డి'. ఈ సినిమా ట్రైలర్ విడుదల కార్యక్రమం హైదరాబాద్‌లో సోమవారం జరిగింది. మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలాచారి ముఖ్య అతిథిగా మాట్లాడారు. కీర్తిశేషులు రాజారెడ్డిని గుర్తు చేసేలా ఈ సినిమా ఉంటుందన్నారు. నటించిన సాంకేతిక నిపుణులంతా నిర్మల్ ప్రాంతానికి చెందిన వారే కావటం ఆనంద దాయకం గా ఉందన్నారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886